

'ప్రజల రుణం తీర్చుకునేందుకు
ఎంత కృషి చేయడానికైనా నేను సిద్ధం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 15
సంచిక: 187

మంగళవారం 27-9-2022



టాప్‌లోనే భారత్

టీ-20 ర్యాంకింగ్స్ ప్రకటించిన ఐసీసీ..
రెండో స్థానంలో ఇంగ్లండ్ - 8లో



ప్రకృతి మెచ్చిన ఎఫ్.పి.ఓ.లు!

ప్రకృతి సేద్య ఉత్పత్తుల మార్కెటింగ్ రంగంలో
విశేష కృషికి జాతీయ గుర్తింపు - IVలో

SIMULTANEOUSLY PRINTED AT SRIKAKULAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

SAMSUNG

Galaxy Z Fold4 | Z Flip4

Unfold your world



samsung.com

Get ready to Flip at ₹ 49999*

Retail price	₹ 89999^
Exchange value of old device	₹ 33000^^
Upgrade bonus / bank cashback	₹ 7000~
Own Z Flip4 now at	**₹ 49999***

+



Galaxy Watch4 Classic**
worth ~~₹ 31999~~ at ₹ 2999

Follow us on: samsung.com | @SamsungIndia | @SamsungIndia | SamsungIndia | @samsungindia


Re+ Please dispose e-waste and plastic waste responsibly. For more information or for e-waste pick up, please call 1800 40 7267864 or 1800 5 7267864.

Image simulated for representational purpose only. Colour as per availability. S Pen Fold Edition sold separately and is only compatible with Z Fold3 and Z Fold4.
*T&C apply. ^Retail price for Z Flip4 128GB | 8GB. Price inclusive of taxes. ^^Approximate value shown for 1 Number of 128GB | 8GB of Galaxy Z Flip3.
Exchange at the discretion of retailer. ~Cashback provided by issuer at its sole discretion. Final pricing is subject to dealer discretion.
**Watch4 Classic 42mm BT with Z Flip4.

Scan and experience the ultimate flex.

Or WhatsApp "Hi" to 9870-494949 to buy now at Samsung Exclusive Stores.

Cheil-13407/22


'గ్రామం ప్రగతిపథంలో ఉంటే ఎవ్వరూ మురా కక్షల జోలికి వెళ్లరు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 187

మంగళవారం 27-9-2022

SIMULTANEOUSLY PRINTED AT SRIKAKULAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



KVR



జన్మదిన శుభాకాంక్షలు



ఎదిగిన కొద్ది ఒదుగుతూ...
అన్నదమ్ముల అనుబంధంతో
కుటుంబసభ్యులకు ప్రేమానురాగాలు చూపిస్తూ...
మా అందరి అభివృద్ధికై బంగారు బాటలు వేసి
కష్టసుఖాలలో మాతో పాలుపంచుకుంటూ...
మంచిమార్గంలో నడిపించిన
ఆంధ్రప్రదేశ్ మారిటైం బోర్డు చైర్మన్

గా॥ శ్రీ కాయల వెంకటరెడ్డి (KVR) గారికి

ఇవే మా హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు...


సత్తి సూర్యనారాయణరెడ్డి


సత్తి పద్దారెడ్డి


కర్రి రామచంద్రారెడ్డి


కొవ్వూరి ఈశ్వర్‌రెడ్డి (శేఖర్)


తేతల శ్రీనివాసరెడ్డి


చిర్ల నాగిరెడ్డి


వెలగల వెంకటరెడ్డి


సబ్బెళ్ళ బులివెంకటరెడ్డి (కళ్యాణ్)



జన్మదిన శుభాకాంక్షలు
ఉదయించే సూర్యునివలె దిన దినాభివృద్ధి చెందుతూ...
నీతికి, నిజాయితీకి మారుపేరుగా నిలుస్తూ...
తను నడిచే మార్గంలో మమ్మల్ని ముందుకు నడిపిస్తూ...
మాకు మార్గదర్శకులుగా నిలిచిన
ఆంధ్రప్రదేశ్ మారిటైం బోర్డు చైర్మన్
గౌ॥ శ్రీ కాయల వెంకటరెడ్డి (KVR) గారు
నిండు, నూరేళ్ళు, ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని
వారు మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని మనసారా కోరుకుంటూ...
వారికి ఇవే మా హృదయపూర్వక
జన్మదిన శుభాకాంక్షలు
Happy Birthday to
KVR Sir
సత్తి వీర వెంకట సత్యనారాయణరెడ్డి
చిర్ల శ్రీనివాసరెడ్డి
నల్లమిల్లి సత్యనారాయణరెడ్డి
కొవ్వూరి బాలరెడ్డి
నల్లమిల్లి వెంకటరెడ్డి
సబ్బెళ్ళ రామకృష్ణారెడ్డి
వై. అప్పలరాజు
గొలుగూరి చంద్రశేఖరరెడ్డి
సత్తి వెంకటరెడ్డి
సత్తి విశ్వేశ్వరరెడ్డి
కొవ్వూరి పరమ శివానందరెడ్డి
కొవ్వూరి తాతారెడ్డి
గుడిమెట్ల విజయప్రభాకర్‌రెడ్డి
భానుప్రకాష్
సబ్బెళ్ళ వీరేంద్రనాథ్‌రెడ్డి
నల్లమిల్లి సంజీవ్‌రెడ్డి
కడియాల రామకృష్ణ
తమలంపూడి సోమిరెడ్డి
కర్రి పోతారెడ్డి
మల్లిడి సోమిరెడ్డి
కొవ్వూరి శివనాగిరెడ్డి
కర్రి శ్రీనివాసరెడ్డి
సత్తి దుర్గారెడ్డి
తాడి సుబ్బారెడ్డి
గొలుగూరి వెంకటరెడ్డి
కర్రి అశోక్‌రెడ్డి
వీర్రాజు



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 15
సంచిక: 187

మంగళవారం 27-9-2022

SIMULTANEOUSLY PRINTED AT SRIKAKULAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



రష్యాలోని స్కూల్‌లో కాల్పులు
పూర్వ విద్యార్థి ఘాతుకం..
15 మంది దుర్మరణం - 6లో



మళ్లీ కుప్పకూలిన మార్కెట్లు
954 పాయింట్లు పతనం.. 57,145
పాయింట్లకు చేరిన సెన్సెక్స్ - 9లో

గెహ్లాట్ వర్గం ధిక్కారం!



■ రాజస్తాన్‌లో రాజకీయ ప్రతిష్టంభన ముదురుపాకాన పడింది. అశోక్ గెహ్లాట్ రాజస్తాన్ సీఎం పీఠం వదులుకోవడానికి సుముఖంగా లేకపోవడంతో కాంగ్రెస్ పెద్దలకు ఎటూ పాలుపోవడం లేదు. గెహ్లాట్‌నే సీఎంగా కొనసాగించాలన్న డిమాండ్ నుంచి వెనక్కి తగ్గేందుకు ఆయన వర్గం ఎమ్మెల్యేలు ససేమిరా అంటున్నారు. పరిస్థితిని చక్కదిద్దేందుకు మల్లికార్జున ఖర్గే, అజయ్ మాకెన్‌లు రాజస్తాన్‌కు చేరుకున్నారు. వారు ఏర్పాటు చేసిన సీఎల్పీ సమావేశానికి గెహ్లాట్ వర్గం డుమ్మా కొట్టడంతో అధిష్టానం కన్నెర్ర చేసింది. ఈ మొత్తం వ్యవహారంపై లిఖితపూర్వక నివేదిక ఇవ్వాలని సోనియాగాంధీ ఆదేశించారు.

6లో

కడప స్టీల్‌కు ఇనుప గనుల కేటాయింపు

- అనంతపురం జిల్లా డి.హిరేహాళ్ వద్ద 25 హెక్టార్ల కేటాయింపు
- ఏపీఎండీసీ ద్వారా కడప స్టీల్‌కు ముడి ఇనుము సరఫరా
- ఇనుప ఖనిజం గనుల కేటాయింపునకు ఆమోదం తెలిపిన కేంద్రం.. ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర పరిశ్రమల శాఖ

2లో

పసందైన భోజనం

అంగన్‌వాడీ పిల్లలకు అత్యంత నాణ్యమైన పౌష్టికాహారం

- అంగన్‌వాడీలు, స్కూళ్లలో మధ్యాహ్న భోజనానికి సార్టెక్స్ బియ్యం
- పౌష్టికాహారం కొనుగోళ్లు, పంపిణీపై మార్క్‌ఫెడ్ పైలెట్ ప్రాజెక్ట్
- అంగన్‌వాడీల్లో చిన్నారుల భాష, ఉచ్చారణలపై ప్రత్యేక శ్రద్ధ
- విద్యాశాఖతో కలిసి పీపీ–1, పీపీ–2 పాఠ్యప్రణాళిక అమలు
- ఈ నెలాఖరుకు సూపర్‌వైజర్ పోస్టుల భర్తీ
- అంగన్‌వాడీల పర్యవేక్షణకు యాప్
- దివ్యాంగులకు సచివాలయాల్లోనే సేవలు.. భవిత సెంటర్ల దిశగా అడుగులు.. తాత్కాలిక ధ్రువపత్రాలున్న మనో వైకల్య బాధితులకు డిసెంబర్‌లో పింఛన్లు
- కళ్యాణమస్తుతో బాల్య వివాహాలకు అడ్డుకట్ట
- మహిళా, శిశు సంక్షేమ శాఖపై సమీక్షలో సీఎం జగన్ దిశానిర్దేశం



సాక్షి, అమరావతి: అంగన్‌వాడీ కేంద్రాలకు అత్యంత నాణ్యమైన పౌష్టికాహారాన్ని పంపిణీ చేయాలని, ఇందులో ఏమాత్రం అలక్ష్యం వహించరాదని అధికార యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని అంగన్‌వాడీలు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి సార్టెక్స్ (నాణ్యమైన) బియ్యాన్ని అందించాలని సూచించారు. మహిళా–శిశు సంక్షేమ శాఖ పరిధిలోని అంగన్‌వాడీల నిర్వహణ, పిల్లలకు నాణ్యమైన పౌష్టికాహారం, దివ్యాంగుల సంక్షేమం తదితరాలపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సోమవారం సమీక్ష నిర్వహించారు. అంగన్‌వాడీలకు పౌష్టికాహారం కొనుగోలు, పంపిణీ విధానాలను సమగ్రంగా సమీక్షించారు. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో పైలెట్ ప్రాజెక్ట్‌గా చేపట్టాలని

మిగతా 2వ పేజీలో ▶

నేడు శ్రీవారికి సీఎం జగన్

పట్టువస్త్రాల సమర్పణ

రేపు నంద్యాల జిల్లాలో పర్యటించనున్న ముఖ్యమంత్రి

2లో

తిరుమల–తిరుపతిలో

ఈ–బస్సులు

- 100 ఈ–బస్ సర్వీసులను ప్రవేశపెడుతున్న ఆర్టీసీ
- తొలుత తిరుమల ఘాట్ రోడ్డులో 10 ఈ–బస్సులు.. నేడు అలిపిరిలో ప్రారంభించనున్న సీఎం జగన్

2లో



శ్రీవారి బ్రహ్మోత్సవాలకు శాస్త్రోక్తంగా అంకురార్పణ

తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ కార్యక్రమంలో భాగంగా మాడ వీధుల్లో ఊరేగుతున్న విష్వక్సేనుడు

7లో



స్వర్ణకవచాలంకారంలో
కరుణించిన కనకదుర్గ
ఇంద్రకీలాద్రిపై వైభవంగా దసరా ఉత్సవాలు ప్రారంభం



శైలపుత్రి అలంకారంలో
శ్రీశైల భ్రామరి
భృంగివాహనంపై ఆదిదంపతులు

ఎన్టీఆర్ హంతకులకు ఆయనపై ప్రేమ ఉందా!

- ఎన్టీఆర్‌పై కపట ప్రేమ ప్రదర్శిస్తున్నారు
- సీఎం వైఎస్ జగన్‌కు ఎన్టీఆర్ అంటే గౌరవం
- చంద్రబాబునాయుడులా ద్వేషం లేదు
- అందుకే జిల్లాకు ఆయన పేరు పెట్టారు
- జిల్లా అనేది పెద్దది.. యూనివర్సిటీ చిన్నది
- దేనికి ఎన్టీఆర్ పేరు ఉండాలని అంటే.. జిల్లాకే నా ఓటు
- హెల్త్ యూనివర్సిటీకి వైఎస్ పేరు పెట్టడం సముచితం
- తెలుగు అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి

10లో



డెమొక్రటిక్ ఆజాద్ పార్టీ



■ కాంగ్రెస్ మాజీ నేత, జమ్మూ కశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి గులాం నబీ ఆజాద్ 'డెమొక్రటిక్ ఆజాద్ పార్టీ' పేరిట సోమవారం కొత్త రాజకీయ పార్టీని ప్రారంభించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో 50 శాతం టిక్కెట్లను యువత, మహిళలకే కేటాయిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో ఆర్టికల్ 370 పునరుద్ధరణను ఎన్నికల అంశంగా మార్చబోనని చెప్పారు.

- వివరాలు 6లో



పన్లో పని ఉక్రెయిన్‌పై యుద్ధం చేసినందుకు కూడా సారీ చెప్పండి సార్!

క్లుప్తంగా

28న 'గడప గడపకు మన ప్రభుత్వం'పై సీఎం సమీక్ష

సాక్షి, అమరావతి: 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం జరుగుతున్న తీరును సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 28వ తేదీన సమీక్షించనున్నారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో 28వ తేదీ మధ్యాహ్నం మూడు గంటలకు 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంపై సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం సోమవారం తెలిపింది. వైఎస్సార్ సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులు, శాసనసభ్యులు, నియోజకవర్గ సమన్వయకర్తలను ఈ సమీక్షా సమావేశానికి ఆహ్వానించారు.

నేటి నుంచి 'విజిట్ ఆంధ్రప్రదేశ్' క్యాంపెయిన్

- క్యాంపు కార్యాలయంలో ప్రారంభించనున్న సీఎం జగన్
- ఆప్టా సీఈవో, ఏపీటీడీసీ ఎండీ కన్నబాబు వెల్లడి

సాక్షి, అమరావతి: రాష్ట్ర పర్యాటక అభివృద్ధిలో భాగంగా మంగళవారం నుంచి 'విజిట్ ఆంధ్రప్రదేశ్' క్యాంపెయిన్‌ను నిర్వహిస్తున్నట్టు ఏపీ టూరిజం అథారిటీ (ఆప్టా) సీఈవో, ఏపీ పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) ఎండీ కె.కన్నబాబు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం క్యాంపు కార్యాలయంలో క్యాంపెయిన్ బ్రోచర్లను ఆవిష్కరిస్తారని వెల్లడించారు. సులువుగా పర్యాటక ప్రదేశాలను గుర్తించేందుకు వీలుగా రూపొందించిన 'జీఐఎస్ వెబ్‌పోర్టల్'ను కూడా ప్రారంభిస్తారన్నారు. మరోవైపు తిరుపతి వేదికగా పర్యాటక ప్రతిభా అవార్డుల ప్రదాన కార్యక్రమంలోనూ సీఎం వర్చువల్‌గా పాల్గొంటారని తెలిపారు. ప్రపంచ పర్యాటక సంస్థ పిలుపు మేరకు 'రీథింకింగ్ టూరిజం' నినాదంతో పర్యాటకంపై విస్తృత అవగాహన కల్పించనున్నట్టు పేర్కొన్నారు. ఈ క్రమంలోనే పర్యాటక అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తూ టూరిజం, ట్రావెల్, ఆతిథ్య రంగాల్లో అత్యుత్తమ సేవలు అందించిన వారికి 31 విభాగాల్లో 'స్టేట్ యాన్యువల్ టూరిజం ఎక్సలెన్స్ అవార్డ్'లను ప్రదానం చేస్తామన్నారు.

ఒలింపియన్ జఫ్రీన్‌కు రూ.30 లక్షలు మంజూరు

సాక్షి, అమరావతి: డెఫ్ ఒలింపిక్స్ క్రీడాకారిణి షేక్ జఫ్రీన్‌కు ప్రభుత్వం క్రీడా ప్రోత్సాహకాల కింద రూ.30లక్షలు మంజూరు చేసింది. ఈ విషయాన్ని యువజన సర్వీసులు, క్రీడల శాఖ ముఖ్య కార్యదర్శి జి.వాణీమోహన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ఏడాది బ్రెజిల్‌లో జరిగిన డెఫ్ ఒలింపిక్స్‌లో భారత డెఫ్ టెన్నిస్ జట్టు కెప్టెన్ జఫ్రీన్ కాంస్య పతకం సాధించిన విషయం తెలిసిందే.

• తెలంగాణ

హైదరాబాద్‌లో కుంభవృష్టి

- కేవలం రెండు గంటల్లో 9 సెంటీమీటర్ల వర్షం
- గంటల కొద్దీ నిలిచిపోయిన ట్రాఫిక్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో భారీ వర్షం పడింది. కేవలం రెండు గంటల వ్యవధిలోనే తొమ్మిది సెంటీమీటర్లకుపైగా కుంభవృష్టి కురిసింది. ఒక్కసారిగా కురిసిన భారీ వానతో రహదారులు చెరువులను తలపించాయి. ప్రధాన రహదారులపై కిలోమీటర్ల మేర ట్రాఫిక్ ఎక్కడికక్కడే స్తంభించిపోయింది. వాహనదారులు, ప్రయాణికులు, ఉద్యోగులు గంటల పాటు రోడ్లపై తీవ్రంగా ఇబ్బందిపడ్డారు. పలు లోతట్టు ప్రాంతాలు, బస్తీలు నీటమునిగాయి. రాత్రి 10 గంటల వరకు నాంపల్లిలో 9.5 సెంటీమీటర్ల వర్షం కురిసింది. మెహిదీపట్నం, ఖైరతాబాద్, హస్తినాపురం, రాజేంద్రనగర్, జియాగూడ, కార్వాన్, లంగర్ హౌస్, అత్తాపూర్, గన్‌ఫౌండ్రీ, బంజారాహిల్స్, అబిడ్స్, సరూర్‌నగర్ తదితర ప్రాంతాల్లో కుండపోత వర్షం కురిసింది. గన్‌ఫౌండ్రీలో 8.78, మెహిదీపట్నంలో 8.50, ఖైరతాబాద్ లో 7.80, ఆసిఫ్‌నగర్‌లో 7.75, అలకాపురిలో 7.55, హిమాయత్‌నగర్‌లో 6.60, అంబర్‌పేటలో 6.30 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. కాగా, యాదాద్రి జిల్లా భువనగిరిలో 15.2 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో పారిశ్రామిక పార్కులే కీలకం

- ఏపీఐఐసీ గోల్డెన్ జూబ్లీ లోగో ఆవిష్కరించిన సీఎం జగన్
- ప్రధాన కార్యాలయంలో ఘనంగా ఉత్సవాలు
- ఉత్తమ ఉద్యోగులకు అవార్డులు అందించిన మంత్రి అమర్‌నాథ్



క్యాంపు కార్యాలయంలో ఏపీఐఐసీ 50 ఏళ్ల లోగోను ఆవిష్కరిస్తున్న సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో పారిశ్రామిక పార్కుల పాత్ర కీలకమని, పారదర్శక విధానాలతో పారిశ్రామిక వాడల ప్రగతికి నిరంతరం కృషి చేయాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించారు. ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక వసతుల సంస్థ (ఏపీఐఐసీ) 49 సంవత్సరాలు పూర్తి చేసుకుని 50వ వసంతంలోకి అడుగు పెట్టిన సందర్భంగా ప్రత్యేకంగా రూపొందించిన లోగోను సోమవారం క్యాంపు కార్యాలయంలో సీఎం జగన్ ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రగతిలో ఏపీఐఐసీ కీలక భూమిక పోషిస్తూ ముందుకు సాగాలని సీఎం ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి, ఏపీఐఐసీ వీసీ అండ్ ఎండీ జేవీఎన్ సుబ్రహ్మణ్యం, ఏపీఐఐసీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఏడాదిపాటు నిర్వహించే ఏపీఐఐసీ స్వర్ణోత్సవ వేడుకల వివరాలను ఈ సందర్భంగా అధికారులు ముఖ్యమంత్రికి తెలియచేశారు.

రాష్ట్రంలో శరవేగంగా పారిశ్రామికాభివృద్ధి

మంగళగిరిలోని ప్రధాన కార్యాలయంలో ఏపీఐఐసీ స్వర్ణోత్సవ వేడుకలను పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రారంభించారు. రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధిలో ఏపీఐఐసీ పాత్ర మరువలేనిదని చెప్పారు. ప్రస్తుతం ఏపీఐఐసీ చేతిలో ఉన్న 1.50 లక్షల ఎకరాలను వినియోగించుకుంటూ మరింత పారిశ్రామిక ప్రగతి సాధిస్తామన్నారు. సీఎం జగన్ నాయకత్వంలో రాష్ట్రం పారిశ్రామికంగా శరవేగంగా పురోగమిస్తోందని తెలిపారు. ఏపీఐఐసీలో ఉత్తమ పనితీరు కనపర్చిన ఉద్యోగులకు ఈ సందర్భంగా మంత్రి అవార్డులను అందచేశారు. ఏపీ ఎకనామిక్ బోర్డు (ఏపీఈడీబీ) కొత్తగా రూపొందించిన వెబ్‌సైట్‌ను మంత్రి ఆవిష్కరించారు.

ఏడాది పాటు ఉత్సవాలు

2023 సంవత్సరాన్ని ఏపీఐఐసీ గోల్డెన్ జూబ్లీ ఇయర్‌గా ప్రకటించి ఏడాది పాటు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఏపీఐఐసీ వైస్ చైర్మన్, ఎండీ జవ్వాది సుబ్రమణ్యం తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి ఇప్పటివరకు ఏపీఐఐసీ ద్వారా 21 లక్షల మందికి ఉపాధి కల్పించడంతోపాటు రూ.2.5 లక్షల కోట్ల పెట్టుబడులను తెచ్చినట్లు చెప్పారు. సింగిల్ డెస్క్ విధానంలో భాగంగా ఏపీఐఐసీ ప్రవేశపెట్టిన 14 రకాల ఆన్‌లైన్ సేవలకు మంచి స్పందన వస్తోందని, ఇదే స్ఫూర్తితో ముందుకు సాగుతామన్నారు.

రూ.20 కోట్లతో మొదలై రూ.5,000 కోట్లకు

రూ.20 కోట్లతో ప్రారంభమైన సంస్థ ఇప్పుడు రూ.5,000 కోట్ల స్థాయికి చేరుకుందని ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి తెలిపారు. కార్యక్రమానికి సీఎం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి హాజరై అత్యుత్తమ పనితీరు కనపరచిన ఏపీఐఐసీ ఉద్యోగులకు అవార్డులు అందచేసి అభినందించారు. పరిశ్రమల శాఖ డైరెక్టర్ జి.సృజన, ఏపీ మారిటైమ్ బోర్డు సీఈవో షన్ మోహన్ తదితరులు ఇందులో పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్‌కు హజ్ పవిత్ర జలం అందజేత

మైనార్టీల సమస్యలపై ముఖ్యమంత్రికి వినతి

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని హజ్ కమిటీ చైర్మన్, సభ్యులు, ఎమ్మెల్సీలు సోమవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హజ్ పవిత్ర జలం (జమ్ జమ్ వాటర్)ను సీఎంకు అందజేశారు. హజ్ 2022 యాత్ర ముగిసిన సందర్భంగా పవిత్ర జలాన్ని ముఖ్యమంత్రికి అందజేసి, మైనారిటీలకు సంబంధించి పలు అంశాలను ప్రస్తావించారు. సీఎంను కలిసిన వారిలో హజ్ కమిటీ చైర్మన్ బీఎస్ గౌస్ లాజమ్, ఎమ్మెల్సీలు రుహుల్లా, ఇషాక్ బాషా, హజ్ కమిటీ సభ్యులు మునీర్ బాషా, ఇమ్రాన్, ఇబాదుల్లా, ఖాదర్, ముఫ్తిబాసిత్ తదితరులు ఉన్నారు.

అన్ని సమస్యలపై సీఎం సానుకూలంగా స్పందించారు

సీఎంను కలిసిన అనంతరం బీఎస్ గౌస్ లాజమ్ మాట్లాడుతూ కేంద్ర పౌరవిమానయాన శాఖతో సంప్రదించి ఏపీలో హజ్ టెర్మినల్ ఏర్పాటుకు కృషి చేయాలని, విజయవాడలో హజ్ హౌస్ నిర్మాణానికి ఆరు ఎకరాల భూమి కేటాయించాలని, వైఎస్సార్ జిల్లా కడపలో అసంపూర్తిగా నిలిచిపోయిన హజ్ హౌస్‌ను పూర్తి చేయాలని కోరామని తెలిపారు. హజ్ హౌస్ కార్యకలాపాల కోసం బడ్జెట్‌లో రూ.4.5 కోట్లు కేటాయించాలని, తద్వారా 2023 సంవత్సరంలో హజ్ గురించి రాష్ట్ర వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసే అవకాశం ఉంటుందని సీఎం దృష్టికి తీసుకువెళ్లామని చెప్పారు. వీటన్నింటిని త్వరలోనే నెరవేరుస్తామని సీఎం జగన్ హామీ ఇచ్చారని ఆయన తెలిపారు.



సీఎం జగన్‌కు హజ్ పవిత్ర జలాన్ని అందజేస్తున్న హజ్ కమిటీ చైర్మన్, సభ్యులు, ఎమ్మెల్సీలు

నేడు శ్రీవారికి సీఎం జగన్ పట్టువస్త్రాల సమర్పణ

- రాత్రికి తిరుమలలో బస
- రేపు నంద్యాల జిల్లాలో పర్యటించనున్న సీఎం

సాక్షి, అమరావతి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళ, బుధవారాల్లో తిరుపతి, నంద్యాల జిల్లాల్లో పర్యటించనున్నారు. తిరుమలలో బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీవారికి ఆయన పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. ముఖ్యమంత్రి మంగళవారం మధ్యాహ్నం 3.45 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్ట్ నుంచి బయలుదేరి రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుంటారు. 5.20 గంటలకు తిరుపతి గంగమ్మ తల్లి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొంటారు. తర్వాత అలిపిరిలో తిరుమలకు విద్యుత్ బస్సులను ప్రారంభిస్తారు. అనంతరం తిరుమల చేరుకుని రాత్రి 7.45 గంటలకు బేడి ఆంజనేయస్వామిని దర్శించుకుంటారు. అక్కడి నుంచి బయలుదేరి శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించి స్వామిని దర్శించుకుంటారు. రాత్రికి తిరుమలలోనే బసచేస్తారు.

నంద్యాల జిల్లాలో..

ముఖ్యమంత్రి జగన్ బుధవారం ఉదయం 6.05 గంటలకు తిరుమలలో శ్రీవారిని దర్శించుకుంటారు. అనంతరం నూతనంగా నిర్మించిన పరకామణి భవనాన్ని ప్రారంభిస్తారు. 7.10 గంటలకు టీటీడీ కోసం వైఎస్సార్‌సీపీ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నిర్మించిన లక్ష్మి వీపీఆర్ రెస్ట్‌హౌస్‌ను ప్రారంభిస్తారు. 9.55 గంటలకు రేణిగుంట ఎయిర్‌పోర్ట్‌లో బయలుదేరి ఓర్వకల్లు విమానాశ్రయానికి చేరుకుంటారు. 10.55 గంటలకు నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల చేరుకుని రామ్‌కో సిమెంట్స్ ఫ్యాక్టరీలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 1.05 గంటలకు ఓర్వకల్లు విమానాశ్రయం నుంచి బయలుదేరి గన్నవరం చేరుకుంటారు. 2.20 గంటలకు తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు.

తిరుమల–తిరుపతిలో ఈ–బస్సులు

- ప్రజా రవాణాలో సరికొత్త అధ్యాయానికి ప్రభుత్వం శ్రీకారం
- 100 ఈ–బస్ సర్వీసులను ప్రవేశపెడుతున్న ఆర్టీసీ
- తొలుత తిరుమల ఘాట్ రోడ్డులో 10 ఈ–బస్సులు
- నేడు అలిపిరిలో ప్రారంభించనున్న సీఎం వైఎస్ జగన్
- భారీగా తగ్గనున్న కర్బన ఉద్గారాలు



సాక్షి, అమరావతి: ప్రజా రవాణా రంగంలో సరికొత్త అధ్యాయానికి రాష్ట్ర ప్రభుత్వం నాంది పలుకుతోంది. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఆధ్యాత్మిక కేంద్రమైన తిరుమల–తిరుపతిని కేంద్రంగా చేసుకుని తొలిసారిగా ఎలక్ట్రికల్ బస్సు (ఈ–బస్)లను ఆర్టీసీ ప్రవేశపెడుతోంది. తిరుమల, తిరుపతిలలో 100 ఈ–బస్సులను ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. ఈవే ట్రాన్స్ లిమిటెడ్ సంస్థ సరఫరా చేసిన ఈ–బస్‌ను ఆర్టీసీ ఇప్పటికే విజయవంతంగా ట్రయల్ రన్ నిర్వహించింది. మరో 9 ఈ–బస్సులను మంగళవారం ఉదయానికి తిరుపతికి తీసుకురానుంది. శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొలుత 10 ఈ–బస్సులను మంగళవారం సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. అనంతరం దశల వారీగా డిసెంబర్ నాటికి 100 ఈ–బస్సులను ఆర్టీసీ ప్రవేశపెట్టనుంది.

తిరుమల ఘాట్ రోడ్డులో 50 బస్సులు..

అలిపిరి బస్ డిపో కేంద్రంగా ఆర్టీసీ వీటిని నడపనుంది. కాంట్రాక్టు దక్కించుకున్న ఈవే ట్రాన్స్ లిమిటెడ్ కంపెనీ వీటిని 12 ఏళ్ల పాటు నిర్వహించనుంది. 50 బస్సులను తిరుమల–తిరుపతి ఘాట్ రోడ్డు సర్వీసుల కోసం కేటాయించారు. అలాగే, రేణిగుంట విమానాశ్రయం నుంచి తిరుమలకు 14 బస్సులు, తిరుపతి నుంచి మదనపల్లికి 12, తిరుపతి నుంచి నెల్లూరుకు, కడపకు 12 సర్వీసుల చొప్పున నిర్వహించాలని నిర్ణయించారు.

కాలుష్య నియంత్రణ

జీరో కర్బన ఉద్గారాలను వెదజల్లే వీటితో కాలుష్యాన్ని నియంత్రించవచ్చని అధికారులు చెబుతున్నారు. 100 ఈ–బస్సులవల్ల ఏటా 5,100 మెట్రిక్ టన్నుల కర్బన ఉద్గారాలు తగ్గుతాయంటున్నారు. ఏసీ ఇంద్ర బస్సుకు కిలోమీటర్‌కు రూ.28.75 ఇంధన వ్యయం అవుతుండగా.. ఎలక్ట్రికల్ బస్‌వల్ల కిలోమీటర్‌కు కేవలం రూ.7.70 ఖర్చే అవుతుంది. రానున్న రోజుల్లో 'ఈవీ' బ్యాటరీల ధరలు తగ్గనుండటంతో నిర్వహణ వ్యయం మరింతగా తగ్గుతుందని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు.

పసందైన భోజనం



అంగన్‌వాడీల నిర్వహణ, పిల్లలకు పౌష్టికాహారంపై సమీక్షలో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్

▶ మొదటి పేజీ తరువాయి

సూత్రప్రాయంగా నిర్ణయించారు. సీఎం సమీక్షలో ముఖ్యాంశాలు ఇవీ..

థర్డ్ పార్టీలతో నాణ్యత తనిఖీ

పిల్లలకు అందించే ఆహారం నాణ్యంగా ఉండాలన్న ప్రభుత్వ ఉద్దేశానికి అనుగుణంగా అధికారులు దృష్టి సారించాలి. పౌష్టికాహార పంపిణీలో ఏ చిన్న లోపానికీ తావులేకుండా కట్టుదిట్టమైన విధానాలను అమలు చేయాలి. పూర్తిస్థాయిలో నాణ్యత తనిఖీలు చేసిన తర్వాతే పిల్లలకు అందాలి. ఇందుకోసం థర్డ్ పార్టీలతో తనిఖీలు నిర్వహించేలా చర్యలు చేపట్టాలి. అంగన్‌వాడీల్లో పిల్లల భాష, ఉచ్చారణలపై ఇప్పటి నుంచే ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. పాఠశాల విద్యాశాఖతో కలిసి పకడ్బందీగా పీపీ–1, పీపీ–2 పిల్లలకు పాఠ్యప్రణాళిక అమలు చేయాలి. అంగన్‌వాడీ పిల్లలకు అందించే పాఠ్య పుస్తకాలు అన్నీ బైలింగ్యువల్ టెక్ట్స్‌బుక్స్(ద్వి భాషా పాఠ్య పుస్తకాలు) ఉండాలి.

నిర్వహణ, పరిశుభ్రతకు ప్రత్యేక నిధి

పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్వహణకు ఏర్పాటైన టీఎంఎఫ్, స్కూళ్ల నిర్వహణ కోసం తెచ్చిన ఎస్ఎంఎఫ్ తరహాలోనే అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ ఎస్ఎంఎఫ్, టీఎంఎఫ్‌లు ఏర్పాటు చేయాలి. అంగన్‌వాడీల నిర్వహణ, పరిశుభ్రత కోసం ప్రత్యేక నిధిని నెలకొల్పాలి. అంగన్‌వాడీలు, మరుగుదొడ్ల మరమ్మతుల పనులు చేపట్టాలి. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణలో సమస్యలుంటే ఫిర్యాదు చేసేందుకు ప్రత్యేక నంబర్‌ను అందుబాటులోకి తేవాలి. ఆ నంబర్‌తో ముద్రించిన పోస్టర్లను ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో కచ్చితంగా ప్రదర్శించేలా అంగన్‌వాడీ వర్కర్లకు బాధ్యత అప్పగించాలి. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల (ఎస్‌డీజీ) సాధనపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలి. ఎస్‌డీజీ లక్ష్యాలను చేరుకునే కార్యక్రమాల అమలును పటిష్టంగా పర్యవేక్షించాలి.

కళ్యాణమస్తుతో బాల్య వివాహాల నివారణ

రాష్ట్రంలో బాల్య వివాహాలను పూర్తిగా నివారించాలి. రాష్ట్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిన కళ్యాణమస్తు పథకం బాల్య వివాహాల నివారణలో కీలక పాత్ర పోషిస్తుంది. ఈ పథకం ద్వారా వధూవరులు వివాహ వయసును కచ్చితంగా పాటించేలా నిబంధన విధించినందున బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయవచ్చు. తప్పనిసరిగా టెన్త్ ఉత్తీర్ణత సాధించాలనే నిబంధన వల్ల విద్యను కూడా ప్రోత్సహించినట్లు అవుతుంది.

పర్యవేక్షణకు ప్రత్యేక యాప్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అత్యంత పారదర్శకంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ (గ్రేడ్–2) పోస్టుల భర్తీ నిర్వహిస్తున్నట్లు మహిళా, శిశు సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు పేర్కొన్నారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పోస్టుల భర్తీ ప్రక్రియను ఈ నెలాఖరు నాటికి పూర్తి చేస్తామని తెలిపారు. ఇంటర్వ్యూలు ముగిశాక మార్కుల జాబితాలను వెల్లడిస్తామన్నారు. అవసరమనుకుంటే ఆన్సర్‌షీట్లను పరిశీలించుకునే అవకాశాన్ని సైతం పరీక్షలకు హాజరైన అభ్యర్థులకు కల్పించినట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో సూపర్‌వైజర్ల పర్యవేక్షణతోపాటు అంగన్‌వాడీలకు అక్టోబర్ 1వతేదీ నుంచి ప్రత్యేకంగా యాప్ కూడా అందుబాటులోకి తెచ్చేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. తద్వారా అంగన్‌వాడీల్లో పాలు, ఆహారం సరఫరా మెరుగైన రీతిలో పర్యవేక్షించనున్నారు. సమీక్షలో మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషాశ్రీ చరణ్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్, ముఖ్య కార్యదర్శి ఏఆర్ అనురాధ, మార్క్‌ఫెడ్ కమిషనర్ పీఎస్ ప్రద్యుమ్న, మహిళా, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ ఏ.సిరి తదితరులు పాల్గొన్నారు.

మనో వైకల్య బాధితులకు పెన్షన్లు

మానసిక వైకల్య బాధితులకు వైద్యులు జారీ చేసిన తాత్కాలిక ధ్రువపత్రాల ఆధారంగా పెన్షన్లు మంజూరు చేయాలని సీఎం జగన్ ఆదేశించారు. ప్రభుత్వ పథకాలకు కొత్తగా అర్హత సాధించిన వారికి ఏటా జూలై, డిసెంబర్‌లో లబ్ధి చేకూరుస్తున్నారు. ఈ నేపథ్యంలో సీఎం జగన్ ఆదేశాల మేరకు మానసిక వైకల్య బాధితులకు తాత్కాలిక ధ్రువపత్రాల ఆధారంగా డిసెంబర్‌లో పెన్షన్లు మంజూరు కానున్నాయి.

దివ్యాంగులకు సచివాలయాల్లో సేవలు..

రాష్ట్రంలో దివ్యాంగులకు అవసరమైన సేవలను గ్రామ, వార్డు సచివాలయాల్లోనే అందించేలా ఏర్పాట్లు చేయాలి. దీనివల్ల వారికి వ్యయ ప్రయాసలు తగ్గుతాయి. దివ్యాంగులకు సేవలందించేలా ప్రతి నియోజకవర్గంలో ఒక భవిత సెంటర్ అప్‌గ్రేడ్ దిశగా అడుగులు వేయాలి. రాష్ట్రంలో జువైనల్ హోమ్స్‌లో సౌకర్యాలపై అధ్యయనం చేపట్టి ఏం చేస్తే బాగుంటుందో సూచనలు చేసేందుకు ప్రత్యేకంగా ఐఏఎస్ అధికారిని నియమించాలి.

కడప స్టీల్‌కు ఇనుప గనుల కేటాయింపు

- అనంతపురం జిల్లా డి.హిరేహాళ్ వద్ద 25 హెక్టార్ల కేటాయింపు
- ఏపీఎండీసీ ద్వారా కడప స్టీల్‌కు ముడి ఇనుము సరఫరా
- ఇనుప ఖనిజం గనుల కేటాయింపునకు ఆమోదం తెలిపిన కేంద్రం
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర పరిశ్రమల శాఖ

సాక్షి, అమరావతి: వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు మండలం సమీపంలో ఏర్పాటు చేస్తున్న వైఎస్సార్ స్టీల్ కార్పొరేషన్‌కు అవసరమైన ముడి ఇనుమును ఏపీ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఎండీసీ) సరఫరా చేయనుంది. ఇందుకోసం అనంతపురం జిల్లా డి.హిరేహాళ్ మండలంలోని సిద్ధాపురం తండా, అంతరాగంగమ్మ కొండ ప్రాంతాల్లోని 25 హెక్టార్లను ఏపీఎండీసీకి కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ గని నుంచి తవ్విన ముడి ఇనుమును కడప స్టీల్ ఫ్యాక్టరీకి సరఫరా చేయడానికి కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపినట్లు రాష్ట్ర గనుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది పేర్కొన్నారు. ఈ గనులకు సంబంధించిన సరిహద్దులను సూచిస్తూ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశామని తెలిపారు. వైఎస్సార్ స్టీల్ కార్పొరేషన్‌కు అవసరమైన ముడి ఇనుమును సరఫరా చేసేందుకు మరో రెండు గనులను కేటాయించడానికి చర్యలు తీసుకుంటున్నామని, కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే కేటాయింపు ప్రక్రియ పూర్తి చేస్తామని వివరించారు. వెనుకబడిన రాయలసీమ జిల్లాలో ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో జమ్మలమడుగు మండలంలో ఏటా 3 లక్షల టన్నుల ఉక్కును ఉత్పత్తి చేసే యూనిట్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న సంగతి తెలిసిందే. ప్రత్యక్షంగా, పరోక్షంగా 25,000 మందికి ఉపాధి కల్పించే ఈ స్టీల్ ప్లాంట్‌కు 2019, డిసెంబర్ 23న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారని, ఆ తర్వాత కరోనా రావడంతో పనులు అనుకున్నంత వేగంగా జరగలేదని, ఇప్పుడు కోవిడ్ తగ్గుముఖం పట్టడంతో నిర్మాణ పనులు వేగవంతం చేస్తామని పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథ్ తెలిపారు.

రివర్స్ టెండరింగ్‌తో రూ.44.15 కోట్లు ఆదా

- రూ.1,219 కోట్లతో పీబీసీ విస్తరణ పనులు
- బిడ్లు దాఖలు చేసిన ఎన్‌సీసీఎల్, ఎంఈఐఎల్ కంపెనీలు
- 0.1997 శాతం లెస్‌తో ఎల్–1గా నిలిచిన ఎన్‌సీసీ లిమిటెడ్



హంద్రీ–నీవా ప్రాజెక్టు పుంగనూరు ఉపకాలువ

బి.కొత్తకోట: జలవనరుల శాఖలో రివర్స్ టెండరింగ్‌తో కోట్లు ఆదా అవుతున్నాయి. అన్నమయ్య, చిత్తూరు జిల్లాలో సాగే ఏవీఆర్ హంద్రీ–నీవా సాగునీటి ప్రాజెక్టు రెండోదశలో అంతర్భాగమైన పుంగనూరు ఉపకాలువ విస్తరణ పనులకు ఈనెల ప్రారంభంలో ప్రభుత్వం టెండర్లను ఆహ్వానించింది. ఈనెల 20న ప్రాజెక్టు మదనపల్లె ఎస్ఈ సీఆర్ రాజగోపాల్ కంపెనీల సాంకేతిక అర్హతలను పరిశీలించగా సోమవారం కంపెనీలు దాఖలుచేసిన ప్రైస్ బిడ్‌ను తెరిచారు. ఇందులో హైదరాబాద్‌కు చెందిన నాగార్జున కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ లిమిటెడ్ రివర్స్ టెండరింగ్‌లో లెస్‌కు టెండర్ దాఖలు చేసి ఎల్–1గా నిలిచింది. అన్నమయ్య జిల్లా పెద్దతిప్పసముద్రం మండలం సీవీరామన్నగారిపల్లె నుంచి హంద్రీ–నీవా పుంగనూరు ఉపకాలువ (పీబీసీ)పై కిలోమీటరు 79.600 నుంచి చిత్తూరు జిల్లా పలమనేరు నియోజకవర్గం పెద్దపంజాణి మండలంలో కిలోమీటరు 220.350 వరకు కాలువను విస్తరించే పనులకు ప్రభుత్వం రూ.1,219,93,02,150 అంచనాతో టెండర్లను ఆహ్వానించింది. ఈ పనులు దక్కించుకునేందుకు నాగార్జున కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ లిమిటెడ్, మేఘా ఇంజినీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ టెండర్లు దాఖలు చేశాయి. తొలుత టెండర్లను దాఖలు చేసిన కంపెనీల సాంకేతిక అర్హత, అనుభవం, సామర్థ్యంపై డాక్యుమెంట్లను ఈనెల 20న పరిశీలించగా రెండింటికీ అర్హత ఉన్నట్లు నిర్ధారణైంది. దీంతో సోమవారం మధ్యాహ్నం ప్రైస్‌బిడ్‌ను తెరిచారు. ఇందులో నాగార్జున కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ లిమిటెడ్ అంచనాకంటే 3.42 శాతం అదనంతో రూ.1,261,65,18,283.53కు టెండర్ దాఖలు చేసింది. అనంతరం దీనిపై ఎస్ఈ రాజగోపాల్ రివర్స్ టెండరింగ్ ప్రారంభించి సా.5.30 గంటలకు ముగించారు. ఇందులో రెండు కంపెనీలు పోటీ పడినా చివరికి నాగార్జున కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ ప్రభుత్వ అంచనా విలువకంటే 0.1997 శాతం తక్కువకు అంటే..రూ.1,217,49,40,146.53తో టెండర్ దాఖలుచేసి ఎల్–1గా నిలిచింది. ఈ రివర్స్ టెండర్ నిర్వహణవల్ల ప్రభుత్వానికి రూ.44,15,78,137 ఆదా అయ్యింది. ఇక ఎల్–1గా నిలిచిన కంపెనీకి పనుల అప్పగింత కోసం ప్రభుత్వానికి నివేదిక పంపుతున్నట్లు ఎస్ఈ చెప్పారు.

ఉత్తరాంధ్ర టీడీపీ నాయకులకు ఆత్మగౌరవం లేదు

- వాళ్లు ఒక్క అమరావతి అభివృద్ధినే కోరుకుంటున్నారు
- ఉత్తరాంధ్ర వాసుల మనోభావాలను దెబ్బ తీస్తున్నారు
- పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్



సాక్షి, అమరావతి: టీడీపీ నేతలు ఉత్తరాంధ్ర మనోభావాలను దెబ్బ తీస్తున్నారని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మండిపడ్డారు. సోమవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఉత్తరాంధ్రలో పుట్టిన టీడీపీ నేతలకు ఆత్మగౌరవం లేదని, వారు అదే తీరులో ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి వారు కట్టుబడి లేరన్నారు. ఉత్తరాంధ్రకు ఏ పరిశ్రమా అవసరం లేదని, రాజధాని కూడా వద్దని, ప్రభుత్వం పెట్టాల్సిన రూ.లక్షల కోట్లు కేవలం అమరావతిలోనే పెట్టండని, ఆ అప్పునంతా అందరితో కలిసి తీరుస్తామని ఉత్తరాంధ్ర టీడీపీ బంట్రోతులు మాట్లాడుతున్నారని విమర్శించారు. ఉత్తరాంధ్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా విశాఖలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంపై విషం చిమ్ముతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆ సమావేశంలో మేధావులు ఎవరూ అమరావతిని వ్యతిరేకించలేదని చెప్పారు. అమరావతితో పాటు, విశాఖ, కర్నూలును కూడా రాజధానులుగా అభివృద్ధి చేయాలని కోరారన్నారు. అక్కడి ప్రజలకు ఆత్మగౌరవం ఉన్నట్టే ఉత్తరాంధ్ర వారికీ ఉంటుందని చెప్పారు. ఎప్పుడూ ఉత్తరాంధ్ర నష్టపోతూనే ఉందన్నారు. హైదరాబాద్‌ను కోల్పోయిన తర్వాత అలాంటి పరిస్థితి తలెత్తకుండా అన్ని ప్రాంతాల అభివృద్ధికి సీఎం జగన్ కృషి చేస్తున్నారన్నారు. వికేంద్రీకరణకు మద్దతుగా ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్లనున్నట్లు చెప్పారు. సీఎం నిర్ణయానికి అందరి మద్దతు ఉందని, వెనకడుగు వేసే ప్రసక్తి లేదన్నారు.

ఎందుకు రెచ్చగొడుతున్నారు?

అమరావతి రైతుల పేరుతో జరుగుతున్న పాదయాత్ర సజావుగా సాగేందుకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందని చెప్పారు. కానీ, కార్లు ఎక్కి తొడలు కొట్టమని, చెప్పులు చూపించమని కోర్టు చెప్పిందా అని ప్రశ్నించారు. ఎవరిని రెచ్చగొట్టడానికి ఆ పని చేస్తున్నారని అన్నారు. పాదయాత్ర చేస్తున్నారా లేక తొడల యాత్ర చేస్తున్నారా అని నిలదీశారు. ప్రజల మధ్య నడుస్తూ విద్వేషాలు రెచ్చగొట్టొద్దని చెప్పారు. రాజకీయ అజెండాతో జరుగుతున్న క్యాపిటలిస్ట్ ఉద్యమంలో ఏదైనా జరిగితే చంద్రబాబుదే బాధ్యత అన్నారు. మీరు ఎంత రెచ్చగొడుతున్నా.. సంయమనం పాటించాలని ఉత్తరాంధ్రవాసులను కోరుతున్నామన్నారు. పాదయాత్రను నిజంగా అడ్డుకోవాలనుకొంటే ప్రభుత్వానికి ఎంతోసేపని అన్నారు. విశాఖపట్నంలో అయ్యన్నపాత్రుడు మంత్రిగా ఉన్నప్పుడే గంజాయి సాగు ఎక్కువగా జరిగిందని, వాళ్లు దానిపైనే బతికారని విమర్శించారు. ఇప్పటికైనా చంద్రబాబు బూట్లు నాకే పని మానేయాలని టీడీపీ నేతలకు చెప్పారు.

పారదర్శకంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పోస్టుల భర్తీ

- తప్పుడు కథనాలు.. అసత్య ప్రచారాలొద్దు
- 2013లో చేపట్టాల్సిన భర్తీ ఆలస్యమైంది
- సీఎం ఆదేశాలతో 560 పోస్టుల భర్తీ
- మహిళా శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి స్పష్టీకరణ

సాక్షి, అమరావతి: అంగన్‌వాడీ సూపర్‌వైజర్(గ్రేడ్-2) పోస్టుల భర్తీ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్నామని, తప్పుడు ప్రచారాలను నమ్మొద్దని రాష్ట్ర మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఏఆర్ అనురాధ స్పష్టం చేశారు. పోస్టుల భర్తీపై జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని ఖండిస్తూ ఆమె సోమవారం మీడియాతో మాట్లాడారు. 2013లో చేపట్టిన ఈ పోస్టుల భర్తీ ప్రక్రియను అప్పట్లో పట్టించుకోలేదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వాటి భర్తీకి చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. 560 పోస్టుల భర్తీకి అంగన్‌వాడీ టీచర్లు, సూపర్‌వైజర్లకు అవకాశం ఇచ్చినట్టు చెప్పారు. అర్హులైన వారినుంచి దరఖాస్తులు తీసుకుని పారదర్శకంగా రాతపరీక్ష నిర్వహించి మెరిట్ ఆధారంగా భర్తీచేసేలా పటిష్టమైన చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. ఈ నేపథ్యంలోనే 560 పోస్టులకు 21 వేలకు పైగా దరఖాస్తులొచ్చాయని, వారికి ఈ నెల 18న నాలుగు జోన్లలో మాల్ ప్రాక్టీస్‌కు తావులేకుండా ఓఎంఆర్ షీట్స్ ద్వారా రాతపరీక్షలు నిర్వహించినట్టు తెలిపారు. రాతపరీక్ష 45 మార్కులతోపాటు.. మరో ఐదు మార్కులకు ఇంగ్లిష్‌పై పట్టు ఏ మేరకు ఉందో తెలుసుకునేందుకు వీడియో చేసి పంపాలని నోటిఫికేషన్‌లో పేర్కొన్నట్టు తెలిపారు. రాతపరీక్ష తర్వాత ఒక్కో పోస్టుకు ఇద్దరి(క్వాలిఫైడ్ లిస్ట్)ని ఎంపిక చేసి వారికి సమాచారం అందించినట్టు తెలిపారు. పోస్టుల భర్తీలో రోస్టర్ విధానం, దివ్యాంగుల కోటా వంటి అన్ని నిబంధనలు పాటిస్తున్నట్టు చెప్పారు. ఇంటర్వ్యూలు ముగిశాక మార్కుల జాబితాలు వెల్లడిస్తామన్నారు. పరీక్షలకు హాజరైన అభ్యర్థులు సైతం ఎటువంటి అనుమానం ఉన్నా తమ ఆన్సర్ షీట్లను కూడా పరిశీలించుకునే అవకాశం కల్పిస్తామని స్పష్టం చేశారు. అభ్యర్థుల్లో అపోహలు, అనుమానాలు రేకెత్తించేలా అసత్య వార్తలు, తప్పుడు ప్రచారాలు తగదని ఆమె సూచించారు.

మూడు రోజులు వానలు

బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తన ప్రభావం

సాక్షి, విశాఖపట్నం: కొద్దిరోజుల నుంచి రాష్ట్రంలో చెదురుమదురుగా కురుస్తున్న వర్షాలు మంగళవారం నుంచి విస్తారంగా కురవనున్నాయి. ప్రస్తుతం పశ్చిమ మధ్య బంగాళాఖాతం, దాని పరిసరాల్లో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. ఇది సముద్రమట్టానికి 4.5 కిలోమీటర్ల ఎత్తువరకు విస్తరించి ఉంది. దీని ప్రభావంతో రానున్న మూడు రోజులు కోస్తాంధ్రలో అనేక చోట్ల, రాయలసీమలో ఒకటి రెండు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) సోమవారం రాత్రి విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు వైఎస్సార్ జిల్లా సింహాద్రిపురంలో అత్యధికంగా 8.7 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. మంగళగిరిలో 7.7 సెంటీమీటర్లు, ఎచ్చెర్లలో 7.6, మనుబోలులో 7.4, మారేడుమిల్లిలో 6.1, బాలాయపల్లిలో 5.8, విజయవాడ, గుడివాడల్లో 5.3, రావికమతంలో 4.6, పెదకూరపాడులో 4.6, మామిడికుదురు, బుక్కపట్నం, నూజివీడుల్లో 4.4 సెంటీమీటర్ల చొప్పున వర్షం కురిసింది.

త్వరలో పీడీలకు ప్రిన్సిపాళ్లుగా పదోన్నతి

కర్నూలు (టౌన్): త్వరలోనే డిగ్రీ కళాశాలల ఫిజికల్ డైరెక్టర్లకు ప్రిన్సిపాళ్లుగా పదోన్నతులు కల్పిస్తామని ఉన్నత విద్యాశాఖ కమిషనర్ పోలా భాస్కర్ తెలిపారు. యూనివర్సిటీ స్థాయిలో క్రీడలకు ప్రాధాన్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. సోమవారం కర్నూలులోని సిల్వర్ జూబ్లీ కళాశాలలో అంతర్ రాష్ట్ర ప్రభుత్వ డిగ్రీ కళాశాలల క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. పోలా భాస్కర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో అనేక మంది ఐఏఎస్‌లను, ఎంతో మందిని ఉన్నత విద్యా వంతులుగా తీర్చిదిద్దిన చరిత్ర సిల్వర్ జూబ్లీ కళాశాలకు ఉందన్నారు. రాయలసీమ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఆనందరావు, క్లస్టర్ వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ సాయిగోపాల్, సిల్వర్ జూబ్లీ కళాశాల ప్రిన్సిపాల్ కుమార్ మాట్లాడారు.

ప్యాపిలిలో ఇండోర్ స్టేడియం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో క్రీడా వసతుల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని యువజన సర్వీసులు, క్రీడల ముఖ్య కార్యదర్శి వాణిమోహన్ అన్నారు. ఇందులో భాగంగానే నంద్యాల జిల్లా ప్యాపిలిలో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి రూ.1.19 కోట్లు మంజూరు చేసినట్టు తెలిపారు.



ఏది తప్పో, ఏది ఒప్పో మీ అంతరాత్మ చెబుతూనే ఉంటుంది. తెలియదనడం ఆత్మవంచన!

– చలం

సాక్షి

మంగళవారం, సెప్టెంబర్, 27

పాత వాసనల కొత్త చట్టం?

కాలంతో పాటు మార్పు సహజం. చట్టాలూ మారాల్సిందే. కానీ, టెలికామ్ శాఖ బుధవారం జారీ చేసిన 'భారతీయ టెలికమ్యూనికేషన్ బిల్లు -2022'లో ప్రతిపాదించిన మార్పుల్లో ఉన్న మంచీచెడూ పెద్ద చర్చే రేపుతున్నాయి. ఆధునిక కాలపు 'ఓవర్ ది టాప్' (ఓటీటీ) కమ్యూనికేషన్ సేవలైన వాట్సప్, సిగ్నల్, టెలిగ్రామ్ లాంటి యాప్‌లను కూడా ఇకపై టెలికామ్ సేవల పరిధిలోకే తేవాలనేది ఈ కొత్త బిల్లు కీలక ప్రతిపాదనల్లో ఒకటి. అలాగే, 'టెలికామ్ రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా' (ట్రాయ్) చట్టానికీ మార్పులను ప్రతిపాదించింది. వాటికి ఆమోదముద్ర పడితే, ఇన్నాళ్ళూ సిఫార్సు సంఘంగా టెలికామ్ రంగానికి కావలి కాస్తున్న 'ట్రాయ్' నిర్వీర్యమవుతుంది. కేంద్రానికి ఇలా మరిన్ని అధికారాలు కట్టబెడుతూ, పాత లైసెన్స్ రాజ్యానికి బాట వేస్తున్నారనేది ప్రధాన విమర్శ.

స్థూల జాతీయోత్పత్తిలో 4 శాతం అందించే టెలికామ్ పరిశ్రమకు 3 ప్రత్యేక చట్టాలున్నాయి... ఇండియన్ టెలిగ్రాఫ్ చట్టం – 1885, ఇండియన్ వైర్‌లెస్ టెలిగ్రఫీ చట్టం – 1933, టెలిగ్రాఫ్ వైర్స్ (అన్‌లాఫుల్ ప్రొటెక్షన్) చట్టం – 1950. ఇంటర్నెట్ సహా ఆధునిక సాంకేతికతలెన్నో వచ్చిన వేళ ఈ మూడింటినీ ఏకీకృతం చేసి, వాటి స్థానంలో సమకాలీనమైన కొత్త చట్టం తీసుకురావాలని ప్రయత్నం. అందులో భాగంగా వేలంలో స్పెక్ట్రమ్ కేటాయింపు లాంటి వాటికి చట్టపరమైన అండనివ్వాలని చూశారు. వినియోగదారుల రక్షణపై అధికంగా దృష్టి పెట్టడమూ ప్రస్తుత పరిస్థితుల్లో అభినందనీయమే. అందులో భాగంగానే ఆన్‌లైన్ ఛాట్, ఓటీటీ సేవలను సైతం మిగిలిన చాలావాటితో కలిపి, టెలికామ్ సేవలనే విస్తృత విభాగంలోకి తేనున్నారు. ఒకప్పుడు బ్రాడ్‌క్యాస్ట్ టీవీని బ్రిటీష్ హయాంలో వైర్ టెలిగ్రఫీ ఒక్కటే ఉన్నప్పటి 1885 నాటి టెలిగ్రాఫ్ చట్టపరిధిలోకి తెచ్చారు. అలాగే, ఇప్పుడీ వర్గీకరణతో యూజర్లు భావ వినిమయానికి టెలికామ్ నెట్‌వర్క్‌లను వాడే ఈ యాప్‌లన్నీ కొత్త లైసెన్స్‌రాజ్ కిందకొస్తాయి. దీనివల్ల అతి నియంత్రణ తప్పదు.

ఇప్పటి వరకు ఒక సర్వీస్ ప్రొవైడర్‌కు కొత్త లైసెన్స్ ఇవ్వాలంటే, టెలికామ్ శాఖ కచ్చితంగా 'ట్రాయ్' అభిప్రాయం తీసుకోవాలి. అది 'ట్రాయ్' చట్టంలోని నిబంధన. కానీ, కొత్త బిల్లుతో ఆ అవసరం ఉండదు. అలాగే, టెలికామ్ శాఖకు తగిన సిఫార్సు చేయడానికి అవసరమైన సమాచారాన్నీ, పత్రాలనూ ప్రభుత్వాన్ని అడిగి తీసుకొనే అధికారం ఇప్పటి దాకా 'ట్రాయ్'కి ఉంది. కొత్త బిల్లుతో అదీ కొండెక్కనుంది. 'ట్రాయ్' సిఫార్సులను అంగీకరించకున్నా, మార్పు కోరుకున్నా ఆ సిఫార్సులను టెలికామ్ శాఖ పునఃపరిశీలనకు పంపాలనేది ఇప్పుడున్న నిబంధన. కొత్త బిల్లు దానికీ చెల్లుచీటీ ఇవ్వనుంది. ఒక్కముక్కలో 'ట్రాయ్'ని ఉత్సవ విగ్రహంలా కూర్చోబెడతారన్న మాట!

అయితే, పరిశ్రమకు సంబంధించిన కొన్ని అంశాలకు ఈ కొత్త టెలికామ్ బిల్లు స్పష్టతనిచ్చింది. ఏదైనా టెలికామ్ సంస్థ దివాళా తీస్తే, దాని అధీనంలోని స్పెక్ట్రమ్ కేంద్రానికి చెందుతుందా, బ్యాంకులకు చెందుతుందా అనేది ప్రస్తుతం స్పష్టత లేదు. దివాళా తీస్తే, ఆ స్పెక్ట్రమ్ తిరిగి కేంద్రం చేతిలోకి రావాలని కొత్త బిల్లులో టెలికామ్ శాఖ ప్రతిపాదించింది. అసాధారణ పరిస్థితుల్లో లైసెన్స్‌దార్ల అప్పుల్ని మాఫీ చేసేందుకూ, ఉపశమనం కల్పించేందుకూ కేంద్రానికి అధికారం కట్టబెట్టింది. మరోపక్క ఇప్పటి దాకా టెలికామ్ ఫండ్ ఆపరేటర్ల సవరించిన స్థూల ఆదాయంపై 5 శాతం యూనివర్సల్ సర్వీస్ లెవీ విధిస్తున్నారు. ఆ 'యూనివర్సల్ సర్వీస్ నిర్బంధ నిధి'ని ఇకపై 'టెలికమ్యూనికేషన్ అభివృద్ధి నిధి' (టీడీఎఫ్)గా మార్చాలని ఆలోచన. టీడీఎఫ్‌తో అంతగా సేవలు లేని పట్టణ ప్రాంతాలను మెరుగుపరచాలనీ, పరిశోధన – అభివృద్ధికి ఖర్చు చేయాలనీ ప్రతిపాదన.

నిజానికి, జాతీయ వనరులైన ఎయిర్‌వేవ్స్‌ను అపరిమితంగా పంచుకోవడం కుదరదు గనక భద్రతా కారణాల రీత్యా 1991 అనంతర కాలంలోనూ టెలికామ్ రంగం నియంత్రిత మార్కెట్టే. ఇప్పుడు కొత్తగా పుంజుకున్న ఆన్‌లైన్ మార్కెట్లను స్వేచ్ఛగా వదిలేద్దామంటే, జూమ్ సహా వివిధ యాప్‌లు పాటిస్తున్న కస్టమర్ల సమాచార సేకరణ దేశానికి చిక్కులు తేవచ్చు. ఈ అనివార్యతలతో కొత్త ప్రతిపాదనలు వచ్చాయి. అయితే, చాలాభాగం డిజిటల్ యాప్స్ ఐటీ నిబంధనల్ని పాటిస్తున్నాయి. నిరుడు కొత్త డిజిటల్ ఇండియా బిల్లు రూపొందిస్తూ, కొన్ని మార్గదర్శకాలనూ ఇచ్చారు. ఒకవేళ సమగ్ర చట్టపరిధి అవసరమనుకుంటే పరస్పర సంబంధమున్న ఐటీ, వ్యక్తిగత గోప్యత, టెలికామ్, డిజిటల్ సేవల ప్రతిపాదనలన్నీ సర్కారు ఒకేసారి జనం ముందుకు తేవాలి. అన్నిటినీ కలిపి పరిశీలించి, విశ్లేషించుకొనే వీలుంటుంది.

ఇవాళ దేశంలో ప్రతి ఒక్కరి చేతిలోని మొబైల్ ఫోనే ఇంటర్నెట్‌కు సింహద్వారం. టెలికామ్ లింకులే డిజిటల్ ఇండియా స్వప్నానికి రాచమార్గం. అందుకే, నిబంధనలు అస్పష్టంగా ఉంటే వర్తమాన పరిస్థితుల్లాగ గందరగోళం రేగుతుంది. అలాగని అతి కఠిన చట్టం చేస్తే, ఆర్థిక వ్యవస్థలోని సైబర్ విజృంభణ చిక్కుల్లో పడుతుంది. శాంతి భద్రతల పేరిట వివిధ యాప్‌లలోని ఛాట్‌లను అడ్డగించడానికీ, అవసరాన్ని బట్టి ఇంటర్నెట్‌ను నిలిపివేయడానికీ తాజా బిల్లు వీలు కల్పిస్తోంది. గోప్యత భద్రత, భావప్రకటన స్వేచ్ఛలపై తాజా రాజ్యాంగ పరిణామాల్ని కూడా విస్మరించి, 2022 నాటి చట్టాన్నీ 1885 చట్టం స్ఫూర్తితోనే రూపొందిస్తే కష్టం. ఏ చట్టమైనా అటు పరిశ్రమకూ, ఇటు యూజర్లకూ స్నేహశీలంగా ఉండాలి. ప్రభుత్వ విధానాలు ప్రజలకు సాధికారత నివ్వాలి. ప్రతిపాదిత టెలికామ్ బిల్లులో మార్పుచేర్పులకు అదే దిక్సూచి కావాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీశుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు
ఆశ్వయుజ మాసం, **తిథి:** శు.విదియ రా.2.41 వరకు
తదుపరి తదియ, **నక్షత్రం:** హస్త ఉ.7.32 వరకు, తదుపరి చిత్ర
వర్జ్యం: ప.3.32 నుండి 5.08 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.15 నుండి 9.05 వరకు, తదుపరి రా.10.41 నుండి 11.29 వరకు
అమృతఘడియలు: రా.1.11 నుండి 2.45 వరకు.

సూర్యోదయం : 5.52
సూర్యాస్తమయం: 5.52
రాహుకాలం : ప. 3.00 నుంచి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుంచి 10.30 వరకు

'రాజుగారు' ఒక ఆశాకిరణం

విశ్లేషణ



దేవీందర్ శర్మ

వాతావరణ మార్పు నుండి జెనిటిక్ ఇంజనీరింగ్ వరకు, వాయు కాలుష్యం నుండి ప్లాస్టిక్ ముప్పు వరకు మానవాళి బాధ్యత వహించవలసిన అనేక చర్చనీయాంశాలను బ్రిటిష్ సింహాసనాన్ని కొత్తగా అధిష్ఠించిన ఛార్లెస్ ఏనాడో తన ప్రాధాన్యాలుగా చేసుకున్నారు. జీవావరణానికి హితంగా ఉండేలా తన అలవాట్లను మార్చుకున్నారు. రసాయన రహిత వ్యవసాయాన్ని ప్రోత్సహించాల్సిన ఆవశ్యకత గురించి మాట్లాడడమే కాక, పునరుత్పాదక వ్యవసాయం కోసం ఒక స్వచ్ఛంద సంస్థను కూడా నెలకొల్పారు. పర్యావరణ పరిరక్షణపై ఆయనకున్న దృఢమైన నిబద్ధత ఆయనను కేవలం ఉత్సవ చక్రవర్తిగా ఉంచకపోవచ్చు. ప్రపంచంలో నిస్పృహలు పెరుగుతున్న సమయంలో ఈ కొత్త రాజు కొత్త రాచరిక పాత్రను సులభంగా పోషించగలరు.

మనోహరమైన చిద్విలాసాలు, ప్రజాసమూహాలకు అభివాదాలు, కార్యక్రమాల ప్రారంభోత్సవాలు.. ఇటువంటి సాధారణ కర్తవ్యాల వరకే రాచరికాలు పరిమితమై ఉన్న తరుణంలో బ్రిటిష్ సింహాసనాన్ని అధిష్ఠించిన మూడవ ఛార్లెస్ రాజు తన సొంతవైన ఆలోచనలతో, సున్నితమైన వ్యక్తిత్వంతో, భూగ్రహాన్ని రక్షించాలన్న ప్రబలమైన కాంక్షతో 'హరిత చక్రవర్తి'గా అవతరించగలరన్న ఆశలు రేకెత్తిస్తున్నారు. ''ఆయన తన ఇరవైల ప్రారంభంలో భవిష్యత్ కాలుష్య దుష్ప్రభావాలపై ప్రభావవంతమైన ప్రసంగాలు చేశారు. తన మధ్యవయస్సులో ఆర్థిక, పర్యావరణ, సామాజిక అంశాల మధ్య సమతూకం సాధించే అత్యున్నత స్థాయి సుస్థిరతలకు చొరవ చూపారు. ఈ ఏడాది జనవరిలో తన 73 ఏళ్ల వయసులో వాతావరణ మార్పును నియంత్రించేందుకు అత్యవసర చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి, వ్యాపార దిగ్గజాలకు స్పష్టమైన పిలుపు నిచ్చారు'' అని 'టైమ్' పత్రిక రాసింది. రానున్న కాలంలో కానున్న రాజుగా మొన్నటి వరకు ఆయన సాగించిన ప్రయాణాన్ని ఈ నాలుగు మాటల్లో ఆ పత్రిక సముచిత పరిచింది. బ్రిటన్ రాజైన వెంటనే, బ్రిటిష్ పార్లమెంటును ఉద్దేశించి ప్రసంగిస్తున్నప్పుడు 'చరిత్ర నాపై మోపిన బాధ్యత ఎంత బరువైనదో తెలుస్తోంది' అని ఛార్లెస్ అన్నారు. తనెంతో శ్రద్ధ వహిస్తూ వచ్చిన స్వచ్ఛంద కార్యకలాపాలకు, ఇతర విధులకు ఇకపై తన సమయాన్ని, శక్తిని కేటాయించడం మునుపటి స్థాయిలో సాధ్యం కాదని స్పష్టం చేశారు.

అయితే ఆయన యోగ్యతలను, పర్యావరణ పరిరక్షణపై ఆయనకున్న దృఢమైన నిబద్ధతను గుర్తెరిగిన చరిత్ర ఆయన్ని కేవలం ఉత్సవ చక్రవర్తిగా ఉంచగలదని నేను భావించడం లేదు. ఎలిజబెత్ రాణి అంత్యక్రియలకు ఐరోపా దేశాల రాచరిక కుటుంబాల నుంచి హాజరైన వారిలో జపాన్ చక్రవర్తి దంపతులు సహా అందరూ అనామకంగా ఉన్న రాజులు, రాణులే. వారందరిలోనూ ఉన్న సారూప్యం ఒక్కటే. వారిలో ఎవరి జీవితాలూ సునిశితమైన గమనింపులతో గడుస్తున్నవి కావు. వారు తమ మనోభావాలను బయటి వ్యక్తం చేసేవారు కాదు కనుక ప్రజా జీవనంలో వారి గురించి మాట్లాడటానికి ఉన్నది చాలా తక్కువ. పైగా అది వారు ఎంపిక చేసుకుని, అనుసరిస్తున్న జీవనశైలి కూడా. కానీ ఛార్లెస్ అలా కాదు. తన మనోభావాలను వెల్లడించడానికి ఆయన ఏనాడూ సంకోచించలేదు. అది వ్యతిరేకమైన ఫలితాన్నే ఇచ్చినా ధైర్యంగా నిలబడి ఉన్నారు. ఉదాహరణకు ఆయన నిశ్చితాభిప్రాయాలు ఇలా వ్యక్తం అయ్యేవి : 'రసాయనాల వాడకం వ్యవసాయానికి వినాశకరంగా పరిణమిస్తుంది. అనేక విధాలుగా భారీ నష్టాన్ని కలిగిస్తుంది. కాలుష్య కారకాలైన ఉద్గారాలు విపరీతంగా వెలువడతాయి' అనేవారు. లేదా, 'చిన్న పొలాలు కనుమరుగైతే అది బ్రిటిష్ గ్రామీణ ప్రాంతాల హృదయాన్నే చీల్చివేస్తుంది' అని చెప్పేవారు. విధ్వంసక వ్యవసాయం, మత్స్య పరిశ్రమలకు రాయితీలు అనే అంశాలు తరచు ఆయన మాటల్లో వెల్లడయేవి. రసాయన రహిత



వ్యవసాయాన్ని ప్రోత్సహించాల్సిన ఆవశ్యకత గురించి మాట్లాడడమే కాకుండా, పునరుత్పాదక వ్యవసాయం కోసం ఒక స్వచ్ఛంద సంస్థను కూడా నెలకొల్పారు.

జీవావరణానికి హితంగా ఉండేలా తన అలవాట్లను మార్చుకున్నారు. మాంసాహారాన్ని దాదాపుగా త్యజించారు. పశుగణాభివృద్ధి అవసరాన్ని తగ్గిస్తే ఉద్గారాలను నియంత్రించవచ్చు అన్న ఆలోచనే ఆయన్ని శాకాహారం వైపు మళ్లించింది. పాల ఉత్పత్తులను తీసుకోవడాన్ని కూడా ఛార్లెస్ తగ్గించారు. 'కాప్‌–26' సదస్సుకు ముందు ఆయన తన ఆస్టన్ మార్టిన్ కారును బయో–ఇథనాల్‌తో నడుపుతున్నట్లు వెల్లడించడం అత్యంత ప్రాధాన్యం సంతరించుకుందని 'ది గార్డియన్' ఒక వార్తాకథనం రాసింది. ఇంగ్లిష్ వైట్ వైన్ అవశేషాలు, జున్ను తయారీలోని పాల విరుగుడుల మిశ్రమమే ఆ బయో–ఇథనాల్. దాని ద్వారా ఛార్లెస్ తన ప్రజలకు ఒక స్పష్టమైన ఆచరణాత్మక సందేశాన్ని అందిస్తున్నారు. 'మీ వంతుగా ఉద్గారాలను తగ్గించండి, తద్వారా పర్యావరణాన్ని రక్షించడంలో ప్రధాన పాత్ర పోషించండి' అన్నదే ఆ సందేశం.

వాతావరణ మార్పు నుండి జెనిటిక్ ఇంజనీరింగ్ వరకు, వాయు కాలుష్యం నుండి ప్లాస్టిక్ ముప్పు వరకు, సేంద్రియ వ్యవసాయం నుండి ప్రైవేట్ అంతరిక్ష పరిశోధన వరకు... బాధ్యత వహించవలసిన అనేక చర్చనీయాంశాలను ఛార్లెస్ ఏనాడో తన ప్రాధాన్యాలుగా చేసుకున్నారు. దీనిని ఎలాగైనా పిలవండి. విపరీతం అనండి, అతిమోహం అనండి. ఒకటి మాత్రం వాస్తవం. ఆయన బాగా చదివినవారు. విషయంపై అవగాహన లేకుంటే, ఆధిపత్య కథనాలను సవాలు చేయడం అంత సులభమేమీ కాదు. అది కూడా డబ్బు మూటలతో పెద్ద పెద్ద కంపెనీలు ఆ కథనాలకు మద్దతు ఇస్తున్నప్పుడు! దీనిని బట్టి ఆయన తన పాలనను ఎలా నిర్వహిస్తారు, తన కొత్త పాత్రను ఎలా మలుచుకుంటారు అనేవి ఆధారపడి ఉంటాయని భావిస్తున్నాను. అంతకంటే కూడా ఆయన తను ఎలా గుర్తుండి పోవాలని అనుకుంటున్నారో అది కూడా కీలక పాత్ర వహిస్తుంది.

నేను బాగా ఇష్టపడే మరొక చక్రవర్తి కూడా ఈ సందర్భంలో గుర్తుకు వస్తున్నారు. థాయ్‌లాండ్ రాజు భూమిబోల్ అదుల్యాతేజ్ 1946లో సింహాసనాన్ని అధిష్ఠించిన తర్వాత 70 సంవత్సరాలు పరిపాలించారు. ప్రజల అభివృద్ధి అవసరాలను అర్థం చేసుకోవడానికి ప్రత్యక్షంగా వారితో సమయం గడపడం అనే ఆయన మానవీయ దృక్పథానికి విద్యార్థిగా ఉండగా నేను ఆకర్షితుడనయ్యాను. ఒక రాజుగా ఆయనకు అంత చేయవలసిన అవసరం లేదు. కానీ ఆర్థిక శ్రేయస్సు, ప్రజా సంక్షేమంపై ఆయన ఆసక్తి చివరికి ఆయన ఓ 'సమృద్ధ ఆర్థిక వ్యవస్థ' సిద్ధాంతాన్ని అభివృద్ధి చేయడానికి దోహదపడింది. 1997లో ఆసియా ఆర్థిక సంక్షోభం సమయంలో ఉన్నప్పుడు టెలివిజన్ ప్రసంగంలో ఆయన ఇలా అన్నారు: ''దేశం పులిగా మారాలని దేశ ప్రజలు పిచ్చిగా కోరుకుంటున్నారు. పులిగా ఉండటం ముఖ్యం కాదు. దేశం సమృద్ధ ఆర్థిక వ్యవస్థను కలిగి ఉండటం ముఖ్యం. సమృద్ధిగా అంటే, మనల్ని మనం పోషించుకోవడానికి తగినంతగా.'' ఈ మాటలు ప్రస్తుతం భారత్‌కు కూడా వర్తిస్తాయి.

ఏదేమైనా అభివృద్ధి చక్రానికి స్థిరత్వపు ఇరుసు లాంటి ఆ 'సమృద్ధ ఆర్థిక వ్యవస్థ' సిద్ధాంతం నేడు థాయ్‌లాండ్‌లోని 23 వేల గ్రామాల్లో ఆచరణలో ఉంది. ఎగుమతులపై దృష్టి పెట్టడానికి బదులు, స్వయం సమృద్ధిని నిర్మించడం అనే భావనపై ఆ సిద్ధాంతం ఆధారపడి ఉంది. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. మట్టి పునరుత్పత్తి, సూక్ష్మక్రిమి కణాల సేకరణలతో పాటు అనేక అభివృద్ధి ప్రణాళికల కోసం కృషి చేసిన థాయ్ రాజును ఐక్యరాజ్య సమితి 2006లో తన మొదటి 'మానవాభివృద్ధి అవార్డు'కు ఎంపిక చేసింది. ఆయనకు ప్రపంచంలోని మొట్టమొదటి, ఏకైక 'అభివృద్ధి రాజు'గా గుర్తింపు ముద్ర వేస్తూ, ఆనాటి సమితి ప్రధాన కార్యదర్శి కోఫీ అన్నన్... ''థాయ్‌లాండ్‌లోని పేద, అత్యంత బలహీన వర్గాల ప్రజల చెంతకు.. వారి స్థితి, జాతి లేదా మతంతో సంబంధం లేకుండా థాయ్ రాజు వెళ్లారు. వారి జీవితాలను వారే తమ చేతుల్లోకి తీసుకునే సాధికారతను వారికి ఇచ్చారు'' అని కీర్తించారు.

అనేక విధాలుగా ఛార్లెస్ కూడా తనను కేంద్ర స్థానంలో నిలబెట్టే ఒక వారసత్వాన్ని పంచుకున్నారు. ప్రపంచానికి ఇప్పుడు సుస్థిరతపై దృష్టిని మళ్లించగల కొన్ని తెలివైన స్వరాల అవసరం ఉంది. పర్యావరణ పరిరక్షణతో పాటు, అసమానతలు మరింత పెరిగేందుకు దారితీసిన ఆర్థిక మాంద్యంపై కచ్చితంగా ఆయన దృష్టి సారించాలి. ఎలాంటి రాజకీయ వివాదాలలోకీ వెళ్లకుండా, నిస్పృహలు పెరుగుతున్న ఈ సమయంలో ఆశలను పెంపొందించేందుకు ఈ కొత్త రాజు ఒక కొత్త రాచరిక పాత్రను సులభంగా పోషించగలరని నేను విశ్వసిస్తున్నాను.

వ్యాసకర్త ఆహార, వ్యవసాయ రంగ నిపుణులు
ఈ–మెయిల్: hunger55@gmail.com
('ది ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఆశీస్సులు కురవాలి



ట్విట్టర్‌లో నా ప్రియమైన మిత్రులందరికీ నవరాత్రి శుభాకాంక్షలు. దుర్గామాత ఈ పది రోజులూ మీ ఇళ్లను సందర్శించి, తన ఆశీస్సులను మీపై కురిపించు గాక. జై దుర్గా మాత.

– హేమమాలిని, ప్రముఖ నటి

ధరకే ఆదరణ



స్టాండప్ కమెడియన్స్‌కి నేనెప్పుడూ చెబుతుంటాను... అన్ని షోలకు ఒకేలా కాకుండా.. కొన్నిచోట్ల తక్కువ ధరకు కూడా టిక్కెట్‌లు విక్రయించడం అవసరమని! మంచి/వినూత్న వినోదం కంటే కూడా చౌకగా దొరికే వినోదానికే ప్రేక్షకుల ఆదరణ ఎక్కువ.

– మనన్ దేశాయ్, వక్త

మీకైనా ఏం లాభం?



ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికనే నెపంతో ఎఫ్‌–16 ఫైటర్ జెట్‌లను పాకిస్థాన్‌కు విక్రయించేందుకు అమెరికా 450 మిలియన్ డాలర్ల ఒప్పందం కుదుర్చుకుంది. అది అమెరికాకు సైతం ఎలాంటి ప్రయోజనాన్నీ చేకూర్చలేదని భారత విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ నీళ్లు నమలకుండా అనడం బాగుంది. అదీ వారి గడ్డపై నిలబడి!

– మంజూర్ భట్, ఏసియా న్యూస్‌వీక్ ఎడిటర్

పైలట్ నడపగలరు



గెహ్లోత్ అంతరంగిక అధికార ముఠా సభ్యులు కనుక సచిన్ పైలట్ సీఎంగా ఉండకూడదనుకుంటే గెహ్లోత్‌ని కాంగ్రెస్ అధ్యక్షుడిగా నిలబెట్టకూడదు. ఆయనకు బదులుగా పైలట్‌ను పోటీకి దింపాలి. పైలట్ పీసీసీ చీఫ్‌గా ఇప్పటికే తనను తాను నిరూపించుకున్నారు. కనుక ఢిల్లీలో చక్కగా పని చేయగలరు.

– ఆయుష్ భట్, కశ్మీరీ పండిట్

అవకాశం కోల్పోయారు



డెమోక్రటిక్ ఆజాద్ పార్టీ! కచ్చితంగా ఇది ఆకట్టుకునే పేరైతే కాదు. తన పార్టీకి ఇలాంటి పేరు పెట్టుకున్న కారణంగా కుటుంబ పాలన ఆధిపత్యానికి దూరంగా ఉన్నానని చెప్పుకునే అవకాశాన్ని గులామ్ నబీ ఆజాద్ కోల్పోయినట్లే ఉంది! వ్యక్తి పేరుతో ఆవిర్భవించిన పార్టీ ఎల్లప్పుడూ ఒకటీ, రెండు సీట్లకే పరిమితమై ఉంటుంది.

– అజర్ హుసేన్ తాంత్రే, టీచర్

మాన్పలేని గాయం



గెహ్లోత్ తనకు వ్యతిరేకంగా జరిపించిన తిరుగుబాటు సచిన్‌ను తీవ్రంగా బాధిస్తున్నట్లు లోపలి వాళ్లు చెబుతున్నారు. ఇక ఆయన.. పైనుంచి వచ్చే ఆదేశాల కోసం ఎదురుచూడక పోవచ్చు. సోనియా గాంధీ మాటలు సైతం సచిన్ గాయాన్ని మాన్పలేవు. ప్రస్తుతం ఆయనకు బీజేపీ, లేదా ఆప్‌లలో ఏదో ఒకటి మంచి ఎంపిక కావచ్చు.

– అజింక్యా వ్యవహారే, పొలిటికల్ ఎనలిస్ట్

బీబీసీ వివక్ష!



నేను ఇటలీ ఎన్నికలకు సంబంధించిన బీబీసీ కవరేజీని ఒక గంట సేపు చూశాను. ఆ గంటలో ఇటలీ నియంత ముస్సోలినీని దాదాపు 30సార్లు ప్రస్తావించారు. ప్రధాని అభ్యర్థి జార్జియా మెలోనీని అతడితో పోల్చారు. ఆమెకు వ్యతిరేకంగా మాట్లాడే నిపుణులను మాత్రమే డిబేట్‌లో కూర్చోబెట్టారు. ఒక్కరు కూడా మెలోనీకి మద్దతుగా లేరు.

– మారియో, జర్నలిస్ట్

ఇన్‌బాక్స్

దివిసీమ గాంధీ

మండలి వెంకట కృష్ణారావు అవనిగడ్డ నుంచి 1972లో ఏకగ్రీవంగా ఎన్నికైన శాసన సభ్యుడు, గాంధేయవాది. రాజకీయ విలువల్లో, భాషాభిమానంలో ఆయనకు వారసులు – మాజీ రాష్ట్రమంత్రి మండలి బుద్ధ ప్రసాద్. కృష్ణారావు 1926 ఆగస్టు 4న కైకలూరు మండలం పల్లెవాడలో జన్మించారు. వీరి స్వస్థలం నాగాయలంక మండలంలోని భావదేవరపల్లి.

మండలి కృషి వల్లే దివిసీమలోని నిరుపేదలకు బంజరు భూములను పంచే కార్యక్రమం ప్రారంభమైంది. 15 వేల ఎకరాల భూములను పేదలకు పంచారు. 1974లో ఆయన విద్యా, సాంస్కృతిక వ్యవహారాల మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. 1975 రాక్షస నామ సంవత్సర ఉగాది నాడు ప్రథమ ప్రపంచ తెలుగు మహాసభలను హైదరాబాద్‌లో నిర్వహించారు. నిర్వహణ కమిటీకి మండలి కార్యనిర్వాహక అధ్యక్షునిగా వ్యవహరించారు. 'అంతర్జాతీయ తెలుగు కేంద్రం' సంస్థను 1975లో నాటి భారత రాష్ట్రపతి ఫక్రుద్దీన్ అలీ అహమ్మద్ ప్రారంభించారు. మండలి ఈ సంస్థకు ప్రథమ అధ్యక్షులుగా వ్యవహరించారు. ప్రథమ ప్రపంచ తెలుగు మహాసభల కార్యనిర్వాహక అధ్యక్షులుగా, అంతర్జాతీయ తెలుగు కేంద్రం ప్రథమ అధ్యక్షులుగా వ్యవహరించిన మండలి కృషిని గుర్తించి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అంతర్జాతీయ తెలుగు కేంద్రం పేరును 'మండలి వెంకట కృష్ణారావు అంతర్జాతీయ తెలుగు కేంద్రం'గా మార్చారు. దివిసీమలోని పులిగడ్డ – పెనుమూడి వంతెనకు మండలి పేరు పెట్టారు. 'దివిసీమ గాంధీ'గా ప్రజల మన్ననలు అందుకున్న మండలి 1997 సెప్టెంబర్ 27న మరణించారు. 'బాధలలో ఉన్న వారిని మనమే వెళ్లి ఓదార్చాలని' వారు ఆచరించి చెప్పిన మాటలు దివిసీమ ప్రజలకు భగవద్గీతలా వినిపిస్తూనే ఉంటాయి.



మండలి వెంకట కృష్ణారావు

– డా. జి. వి. ప్రమోద్ కుమార్, పైడిమెట్ట
(నేడు మండలి వెంకట కృష్ణారావు 25వ వర్ధంతి)

ఈ ఎన్నికల సారం ఏమిటి?

కామెంట్



కరణ్ థాపర్

కాంగ్రెస్ పార్టీకి కొత్త అధ్యక్షుడి ఎన్నిక ప్రక్రియ ప్రారంభమైంది. నామినేషన్లు వేయడం మొదలై పోయింది. సెప్టెంబర్ 30 వరకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతుంది. ఒకరికి మించి అభ్యర్థులు పోటీ పడినట్లయితే, అధ్యక్ష ఎన్నిక అక్టోబర్ 17న జరుగుతుంది. 19వ తేదీన ఫలితాన్ని ప్రకటిస్తారు. ఈ అధ్యక్ష ఎన్నిక భారతదేశానికి చెందిన పురాతన పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరిస్తుందా అన్నదే కీలకమైన ప్రశ్న. వామపక్షాన్ని మినహాయిస్తే, కాంగ్రెస్ చేపట్టిన ఈ ప్రయత్నం నిస్సందేహంగా ఇతర రాజకీయ పార్టీల కంటే ఎంతో ముందుచూపుతో కూడిందనే చెప్పాలి. అయితే కాంగ్రెస్ పార్టీ తన సొంత రాజ్యాంగం అవసరాలను నెరవేర్చనుందా లేదా వాటినుంచి తప్పించుకుంటుందా?

మొదటగా ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే, అధ్యక్షుడిని ఎలక్టోరల్ కాలేజీ ఎన్నుకోవడమే. ఇందులో అన్ని రాష్ట్రాల ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(పీసీసీ) ప్రతినిధులు ఉంటారు. పార్టీ రాజ్యాంగం నిర్దేశించినట్లుగా, ఈ ఎలక్టోరల్ కాలేజీని మండల (సమితి) స్థాయి కాంగ్రెస్ కమిటీలు (బ్లాక్ కాంగ్రెస్ కమిటీ–బీసీసీ) ఎన్నుకుని ఉండాలి. లేదా కాంగ్రెస్ శాసనసభా పక్ష ప్రతినిధులు ఎన్నుకుని ఉండాలి. ఇదే ఇప్పుడు సమస్య. ఎందుకంటే పార్టీ రాజ్యాంగంలోని ఆర్టికల్–11 ఎ (ఎ) 1 చెప్పినట్లుగా, ప్రతి మండల స్థాయి కాంగ్రెస్ కూడా రహస్య బ్యాలెట్ ద్వారా ఒక పీసీసీ ప్రతినిధిని ఎన్నుకోవలసి ఉంటుంది. అలాంటి ప్రతినిధే పీసీసీలో సభ్యుడై ఉండాలి. అలాగే శాసనసభా పక్షం తప్పక తమ ప్రతినిధులను ఎన్నుకోవలసి ఉంటుందని ఆర్టికల్–11 ఎ (ఇ) నిర్దేశించింది. అయితే ఈ రెండు ప్రకరణలలో దేన్నీ కాంగ్రెస్ పార్టీ నెరవేర్చలేదు.

ఒక అండమాన్ నికోబార్ దీవులు మినహా, ప్రతి ఇతర మండల స్థాయి కాంగ్రెస్ కమిటీ కూడా తన ప్రతినిధిని ఏకాభిప్రాయంతో, ఏకగ్రీవంగా ఎన్నుకుంటుందని కాంగ్రెస్ పార్టీ కేంద్ర ఎన్నికల అథారిటీ చైర్మన్ మధుసూదన్ మిస్త్రీ చెబుతున్నారు. కానీ కొన్ని సందర్భాల్లో



ప్రధాన కార్యదర్శులు వారిని నామినేట్ చేయడానికి ప్రయత్నించారు. అలాగే శాసనసభ పక్షాలు కూడా తమ ప్రతినిధిని అలాగే ఎన్నుకుంటాయని చెబుతూనే, పార్టీ సీనియర్ కార్యనిర్వాహకులు వారిని నియమిస్తారని కూడా మిస్త్రీ సూచిస్తున్నారు.

ఏకగ్రీవంగా ప్రతినిధులను ఎన్నుకుంటారు కాబట్టి వారి కోసం ఎన్నికలు నిర్వహించవలసిన అవసరం లేదనీ, కాబట్టే ప్రతినిధుల ఎన్నికలు నిర్వహించమనీ మధుసూదన్ మిస్త్రీ స్పష్టపరిచారు. కానీ కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగం ఎన్నిక అవసరమని చెబుతున్న ప్పుడు ఏకాభిప్రాయం అనేది ఆ ప్రమాణాన్ని పాటించడం లేదు. ఏకాభిప్రాయం అనేది బహిరంగంగా లేదా రహస్యంగా ఆదేశాల ద్వారా కిందిస్థాయి వరకూ చేరుతుంది. 'ఢిల్లీ'లోని నాయకత్వం ఒక నిర్దిష్ట వ్యక్తిని కావాలని కోరుకుంటే, ఏకాభిప్రాయాన్ని దానికి అనుగుణంగా మలుస్తారు. ఇప్పుడు, బీసీసీ స్థాయిలో ఏం జరుగుతుందో, అదే పీసీసీ స్థాయిలో కూడా పునరావృత మవుతుంది. అదే అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) స్థాయిలోనూ జరుగుతుంది. పీసీసీ చీఫ్‌లను నియమించేందుకు, ఏఐసీసీ ప్రతినిధులను నామినేట్ చేయడానికి నూతన కాంగ్రెస్ అధ్యక్షుడికి అధికారం కల్పిస్తూ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీలు తీర్మానాలు చేస్తాయి. మరోసారి ఇది పార్టీ రాజ్యాంగాన్ని ఉల్లంఘించడమే అవుతుంది. రాజ్యాంగంలో రూపొందించిన నియమాలు పీసీసీలు తమ అధ్యక్షుడిని ఎన్నుకోవడానికే ప్రాధాన్యం ఇస్తున్నాయి. ఏఐసీసీని ఎంచుకోవడంలో కూడా ఇదే నిజం కావాలి.

ఇక కీలకమైన వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సభ్యులను ఏఐసీసీ సభ్యులు ఎన్నుకుంటున్నందున మీకు ఆ వివరాలు కూడా చెప్పనివ్వండి. ఇతర విభాగాల సభ్యులకు తోడుగా... ఆర్టికల్–13 ఎ (ఎ) ప్రకారం– ఒక్కసారి మాత్రమే ఓటు బదిలీ చేయగలిగే వ్యవస్థకు అనుగుణంగా దామాషా ప్రాతిపదికన... తమలోని సభ్యులను తామే ఎన్నుకున్న పీసీసీ సభ్యుల సంఖ్యలో 'ఎనిమిదో వంతు' సభ్యులు ఏఐసీసీలో ఉంటారు. కానీ ఈ ప్రక్రియ జరగనప్పుడు, ఏఐసీసీ సభ్యులను కాబోయే అధ్యక్షుడు నామినేట్ చేస్తారు. అంటే వీరు కీలక వర్కింగ్ కమిటీకి చెందిన 12 మంది సభ్యులను ఎన్నుకోవడం అనేది రిగ్గింగ్ జరిగినట్లుగా భావించాల్సి ఉంటుంది.

కాబట్టి ఇప్పుడు రాబోతున్న ఫలితం ఏమిటి? కాంగ్రెస్ అధ్యక్షుడిని ఎన్నుకోవడానికి స్వేచ్ఛాయుతమైన, న్యాయబద్ధమైన ఎన్నిక జరగవచ్చు కానీ ఎలక్టోరల్ కాలేజీని సరిగా ఎన్నుకోకపోయి ఉండవచ్చు. మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీని ఎన్నుకునే విభాగాన్ని నామినేట్ చేస్తారు. పార్టీ రాజ్యాంగం ప్రకారం వీరిని ఎన్ను కోవాలి. కాబట్టి పార్టీ అంతర్గత ప్రజాస్వామికీకరణతో ముగియాల్సిన ప్రక్రియ బాధాకరంగా దాన్ని ఎంతమాత్రమూ పాటించకపోవడంతో ముగిసిపోతుంది. ఇతర పార్టీల ఆచరణ కంటే ఈ ఎన్నిక విషయంలో కాంగ్రెస్ ఎక్కువే చేసి వుండొచ్చు. అయినా కూడా ఆ పార్టీ రాజ్యాంగం కోరుకుంటున్న దానికంటే ఇది చాలా తక్కువ అనే చెప్పాలి.

ఇప్పుడు, కాంగ్రెస్ పార్టీ బహిరంగంగా చర్చించడానికి ఇష్టపడని కొన్ని ప్రశ్నలను మీకు మీరే సంధించుకోండి. నిబంధనలకు అనుగుణంగా మీరు వ్యవహరించకపోతే మీ రాజ్యాంగానికి అర్థం ఏమిటి? మండల, జిల్లా, ప్రదేశ్ కమిటీ స్థాయుల్లో ముందస్తుగా ఎన్నికలు నిర్వహించవలసిన ప్రక్రియను పాటించకపోయినట్లయితే, కొత్త అధ్యక్షుడిని ఎన్నుకోవడంలో అర్థం ఏముంది?

ఇక్కడ ఆలోచించాల్సిన విషయం మరొకటి ఉంది. అక్టోబర్ 17న కాంగ్రెస్ అధ్యక్షుడి ఎన్నిక తప్పకపోతే, ఢిల్లీలోని అధిష్ఠానం ఫలానా వ్యక్తిని ఎంచుకోవాలంటూ తాను కోరుకుంటున్న అభ్యర్థిని సూచిస్తూ సందేశం పంపుతుందా? ఇలా జరిగే అవకాశాన్ని నిరోధించే అధికారం తనకు లేదని కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల అథారిటీ చైర్మన్ మధుసూదన్ మిస్త్రీ చెబుతున్నారు. మరి స్వేచ్ఛగా, న్యాయబద్ధంగా ఎన్నికను నిర్వహించడం ఇలాగేనా? ఇది విజేత విశ్వసనీయతను పలుచన చేయడం లేదా?

కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష ఎన్నిక జరగనున్నందున ఈ అంశాలను మదిలో ఉంచుకోండి. అధ్యక్ష ఎన్నిక ఎంత అర్థవంతంగా జరుగు తుందో చెప్పడానికి ఇదొక మార్గం మరి!

వ్యాసకర్త సీనియర్ పాత్రికేయులు

వాగులో కొట్టుకుపోయి ముగ్గురు విద్యార్థినుల మృతి

- అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఘటన
- మృతులు బాపట్ల జిల్లా వాసులు


సోకులేరు వ్యూపాయింట్

మోతుగూడెం : అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం లక్కవరం సమీపంలోని సోకులేరు వాగులో కొట్టుకుపోయిన ముగ్గురు విద్యార్థినులు మృతిచెందారు. బాపట్ల జిల్లా వేటపాలెంలోని శ్రీహనుజ్ఞ పాఠశాలకు చెందిన 20(ఆరుగురు బాలికలు, 14 బాలురు) మంది విద్యార్థులు, ప్రిన్సిపాల్, ముగ్గురు ఉపాధ్యాయులు, పిల్లల బంధువులు ఓ కారు, వ్యాన్‌లో ఐదు రోజుల విహార యాత్రకు 25న బయలు దేరారు. భద్రాచలంలో రామాలయాన్ని సందర్శించి, మారేడుమిల్లి, అన్నవరం, విశాఖపట్నం, అరకు అందాలను తిలకించి 29న విహార యాత్రను ముగించాలనుకున్నారు. ఆదివారం భద్రాచలం రామాలయాన్ని, పర్ణశాల తదితర ప్రాంతాలను సందర్శించి రాత్రి భద్రాచలంలోనే బస చేశారు. సోమవారం ఉదయం సోకులేరు వాగు వ్యూపాయింట్‌కు బయలుదేరారు. వారిలో ముగ్గురు విద్యార్థినులు సువర్ణ కమల(15), సూరిన గీతాంజలి(14), గుమ్మడి జయశ్రీ(15) వాగులోకి దిగి కొట్టుకుపోయారు. అక్కడ ఉన్న వారు రక్షించే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. మోతుగూడెం ఎస్‌ఐ సత్తిబాబు.. సిబ్బంది సాయంతో మృతదేహాలను వెలికితీశారు. చింతూరు ఏఎస్పీ మహేశ్వరరెడ్డి, సీఐ అప్పలనాయుడు ఘటన స్థలాన్ని పరిశీలించారు. విహారయాత్రకు వచ్చిన విద్యార్థులందరూ పదో తరగతి చదువుతున్నారు.

ఏఎన్‌యూకు గ్రీన్ యూనివర్సిటీ అవార్డు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయానికి అంతర్జాతీయ స్థాయిలో గ్రీన్ యూనివర్సిటీ అవార్డు లభించింది. ఇండో–అమెరికన్ గ్రీన్ స్కూల్ నెట్‌వర్క్, నేషనల్ ఇండిపెండెంట్ స్కూల్ అలయెన్స్, న్యూయార్క్ క్లెమైట్ వీక్ సంయుక్తంగా ఇటీవల నిర్వహించిన '6వ న్యూయార్క్ గ్రీన్ స్కూల్ కాన్ఫరెన్స్–2022'లో ఏఎన్‌యూకు ఈ అవార్డును ప్రకటించారు. అమెరికాలో జరిగిన కాన్ఫరెన్స్‌కు ఏఎన్‌యూ వీసీ ఆచార్య పి.రాజశేఖర్ వర్చువల్‌గా హాజరై యూనివర్సిటీ నివేదికను ప్రజంటేషన్ చేశారు. యూనివర్సిటీలో పాలిథిన్ నిషేధం, వేస్ట్ వాటర్ మేనేజ్‌మెంట్, గార్డెన్స్ నిర్వహణ, ఈ–ఆఫీస్ వినియోగం, పరిశుభ్రమైన నీరు, గాలి తదితర అంశాలను వివరించారు. వీటి ఆధారంగా ఏఎన్‌యూకు గ్రీన్ యూనివర్సిటీ అవార్డును ప్రకటించారు. ఏఎన్‌యూ గత ఏడాది జాతీయ స్థాయిలో గ్రీన్ యూనివర్సిటీ ర్యాంకును సాధించగా, ఈ సంవత్సరం అంతర్జాతీయ స్థాయిలో ర్యాంకు పొందింది. ఈ సందర్భంగా సోమవారం ఏఎన్‌యూలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వీసీ మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థుల సమష్టి కృషితోనే అంతర్జాతీయ స్థాయిలో అవార్డు సాధ్యమైందని తెలిపారు. యూనివర్సిటీ ర్యాంకింగ్స్ కో–ఆర్డినేటర్‌ను వీసీ సన్మానించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ బి.కరుణ, సీడీసీ డీన్ డాక్టర్ కె.మధుబాబు, రీసెర్చ్ సెల్ కో–ఆర్డినేటర్ ఆచార్య ఎల్.ఉదయకుమార్, ఫిజికల్ ఎడ్యుకేషన్, ఇంజనీరింగ్, ఫార్మసీ, ఆర్కిటెక్చర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ డాక్టర్ పాల్‌కుమార్, ఆచార్య శ్రీనివాసరెడ్డి, ఆచార్య ప్రమీలారాణి, ఆచార్య సిద్ధయ్య, ఐఎస్సీ డైరెక్టర్ డాక్టర్ చెన్నారెడ్డి, దూరవిద్యా కేంద్రం డైరెక్టర్ డాక్టర్ బి.నాగరాజు, డిగ్రీ పరీక్షల కో–ఆర్డినేటర్ డాక్టర్ వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.


యూనివర్సిటీ ర్యాంకుల కో–ఆర్డినేటర్ డాక్టర్ భవనం నాగకిషోర్‌ను సన్మానిస్తున్న వీసీ ఆచార్య పి.రాజశేఖర్, రిజిస్ట్రార్ బి.కరుణ తదితరులు

'ఏకలవ్య' క్రీడాపోటీలు ప్రారంభం

- 22 క్రీడాంశాల్లో పోటీలు
- 28 ఏకలవ్య పాఠశాలల నుంచి పాల్గొంటున్న 1,680 మంది విద్యార్థులు

అరకులోయ రూరల్: అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అరకులోయ మండల కేంద్రంలో సోమవారం రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు ప్రారంభమయ్యాయి. పాడేరు గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కొండలరావు జ్యోతి వెలిగించి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండురోజులు జరిగే ఈ పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 28 ఏకలవ్య పాఠశాలలకు చెందిన సుమారు 1,680 మంది విద్యార్థులు పాల్గొంటున్నట్లు తెలిపారు. గిరిజన క్రీడా విభాగం కోఆర్డినేటర్ శ్యాంసుందర్ మాట్లాడుతూ కబడ్డీ, రన్నింగ్, ఖోఖో, వాలీబాల్, చెస్, ఆర్చరీ, సైక్లింగ్, క్రికెట్, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్ తదితర 22 క్రీడల్లో పోటీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ప్రతిభ చూపిన 487 మందిని జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్టు తెలిపారు. జాతీయ స్థాయిలో ఆడే క్రీడాకారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా శిక్షణ ఇస్తాయన్నారు. డిసెంబర్ 15 నుంచి 22 వరకు నాగార్జున యూనివర్సిటీ, ఆంధ్రా లయోలా కళాశాలల మైదానాల్లో జరిగే జాతీయ స్థాయి క్రీడాపోటీల్లో వీరు పాల్గొంటారని చెప్పారు. సీఐ జి.డి.బాబు, అకడమిక్ మానిటరింగ్ అధికారి రఘునాథ్, ఎంఈవో భారతిరత్నం, అరకులోయ స్పోర్ట్స్ స్కూల్ ప్రిన్సిపాల్ మూర్తి, సర్పంచ్ దాసుబాబు తదితరులు పాల్గొన్నారు.


క్రీడాపోటీల్లో విల్లు ఎక్కుపెట్టిన విద్యార్థులు

జాతీయ ప్రాజెక్టు అంటూ నిర్వాసితులకు మొండిచేయి

ప్రధాని మోదీపై సీపీఎం నేత బీవీ రాఘవులు మండిపాటు


కూనవరంలో నిర్వాసితుల సభలో మాట్లాడుతున్న బీవీ రాఘవులు

కూనవరం (అల్లూరి సీతారామరాజు జిల్లా): పోలవరం జాతీయ ప్రాజెక్టును ప్రకటించి.. నిర్వాసితులను పట్టించుకోవడం లేదని ప్రధాని నరేంద్ర మోదీపై సీపీఎం కేంద్ర పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు మండిపడ్డారు. పోలవరం నిర్వాసితుల పోరుబాట కార్యక్రమంలో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం మండల పరిధిలోని కోతులగుట్టలో సోమవారం రాఘవులు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అంబానీ, అదానీలాంటి వాళ్లకు రూ.14 లక్షల కోట్లు దోచిపెట్టిందని ధ్వజమెత్తారు. ఇటీవల అంబానీకి రూ.75 వేల కోట్లు ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం.. నిర్వాసితులకు రూ.30 వేల కోట్లు ఇస్తే పునరావాసానికి సరిపోయేదన్నారు. పోలవరం జాతీయ ప్రాజెక్టు అని చెబుతున్న కేంద్రం ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కూడా అందులోనే ఇమిడి ఉందన్న విషయాన్ని విస్మరించిందని ఆరోపించారు. గోదావరి వరదల్లో ముంపునకు గురైన గ్రామాలపైన నిపుణుల కమిటీ వేసి అధ్యయనం చేయాలని కోరారు. ఏ స్థాయిలో ఏయే గ్రామాలు మునిగాయన్నది ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలన్నారు. పలుమార్లు ఢిల్లీ వెళ్లిన సీఎం జగన్.. నిర్వాసితులు, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీకి సంబంధించి కేంద్రంపై ఒత్తిడి చేయడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని పక్షాలను కలుపుకొని ఢిల్లీ వెళ్లి కేంద్రంపై ఒత్తిడి చేయాలని కోరారు. ప్రభుత్వం కోరితే ఢిల్లీకి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ మిడియం బాబురావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం, బి.వెంకటేశ్వరరావు, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి మచ్చ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతపై టీడీపీ ఎంపీటీసీ దాడి

- ఇనుప గొట్టంతో తలపై కొట్టడంతో తీవ్ర గాయాలు
- బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మందపల్లిలో ఘటన

కొత్తపేట: వైఎస్సార్‌సీపీ నేతపై టీడీపీ ఎంపీటీసీ దాడి చేసిన ఘటన బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం మందపల్లిలో సోమవారం జరిగింది. మందపల్లి గ్రామ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ఆ గ్రామ సర్పంచ్ సాదు వెంకటలక్ష్మి భర్త సాదు చెంచయ్యపై అదే గ్రామానికి చెందిన టీడీపీ ఎంపీటీసీ సభ్యుడు సిద్ధంశెట్టి వీర వెంకట సత్యనారాయణ దాడి చేసి గాయపరిచారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై వి.మణికుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం మధ్యాహ్నం సాదు చెంచయ్య మందపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద మనబడి నాడు – నేడు పథకం కింద మంజూరైన టాయ్‌లెట్స్ నిర్మాణ పనులు చేయిస్తున్నారు. ఈ క్రమంలో అక్కడికి వెళ్లిన ఎంపీటీసీ సభ్యుడు సిద్ధంశెట్టి వీర వెంకట సత్యనారాయణ పనులు ఆపండి అంటూ హుకుం జారీ చేశారు. అంతేకాకుండా పనులు చేయిస్తున్న చెంచయ్యతో ఘర్షణకు దిగారు. ఈ క్రమంలో పక్కనే ఉన్న ఇనుప గొట్టంతో చెంచయ్య తలపై కొట్టారు. దీంతో ఆయన తలకు తీవ్రగాయాలయ్యాయి. కింద పడిపోవడంతో చేతికి కూడా దెబ్బలు తగిలాయి. దీంతో అక్కడ పనిచేస్తున్నవారు గాయపడిన చెంచయ్యను వెంటనే కొత్తపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.


కొత్తపేట ప్రభుత్వాస్పత్రిలో చెంచయ్యను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పరామర్శ

చెంచయ్యపై టీడీపీ ఎంపీటీసీ వీర వెంకట సత్యనారాయణ దాడి చేసిన విషయాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. ఈ ఘటనను ఎమ్మెల్యే ఖండించారు. ఫోన్‌లో చెంచయ్యను పరామర్శించారు. వైద్యులకు ఫోన్ చేసి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. కాగా కొత్తపేట ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న సాదు చెంచయ్యను పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు పరామర్శించారు.

మంత్రి విశ్వరూప్‌కు గుండె శస్త్రచికిత్స విజయవంతం

ముంబైలో ఓపెన్ హార్ట్ సర్జరీ

అమలాపురం టౌన్ : రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్‌కు ముంబైలోని ఏషియన్ హార్ట్ ఇనిస్టిట్యూట్ ఆస్పత్రిలో సోమవారం నిర్వహించిన గుండె శస్త్రచికిత్స విజయవంతమైంది. ఆయనకు గుండెలో ఆరు చోట్ల వాల్వులు బ్లాక్ అయ్యాయి. దీంతో వైద్యులు ఓపెన్ హార్ట్ సర్జరీ చేశారు. ఉదయం 9 నుంచి రాత్రి 7 గంటల వరకూ ఈ శస్త్రచికిత్స జరిగిందని మంత్రి విశ్వరూప్ కుమారుడు కృష్ణారెడ్డి తెలిపారు. మంత్రి శస్త్రచికిత్స విజయవంతం కావాలని.. ఆయన తొందరగా కోలుకోవాలని అమలాపురం నియోజకవర్గంతో పాటు కోనసీమలోని పలు ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ నేతలు, అభిమానులు దేవాలయాలు, చర్చిలు, మసీదుల్లో ప్రార్థనలు చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురంలో పార్టీ నాయకులు, అభిమానులు మోటార్ సైకిళ్ల ర్యాలీగా వెళ్లి పలు ఆలయాల్లో పూజలు నిర్వహించారు. మసీదులు, చర్చిలో ఆయా మత పెద్దలతో ప్రార్థనలు చేయించారు.

స్నానానికి వెళ్లిన తాత, మనవడి మృతి

విజయనగరం జిల్లాలో విషాదం


మృతి చెందిన రాము, గౌతమ్ (ఫైల్)

రేగిడి : విజయనగరం జిల్లా రేగిడి మండలం లచ్చాయపురంలో ఆదివారం సాయంత్రం స్నానానికి వెళ్లిన తాత, మనవడు మృతి చెందిన ఘటన ఆలస్యంగా తెలిసింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన బోర రాము(60), ఈశ్వరమ్మ దంపతులు కూలీలు. వీరి కుమారుడు గణపతి, కోడలు పద్మ పొట్టకూటి కోసం రాజమండ్రి వెళ్లి అక్కడ బెడ్ టైలరింగ్ చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి గౌతమ్(10), ప్రదీప్ అనే ఇద్దరు కుమారులున్నారు. వీరిలో గౌతమ్ ఐదో తరగతి, ప్రదీప్ మూడో తరగతి రాజమండ్రిలోనే చదువుతున్నారు. దసరా సెలవులివ్వడంతో కుమారులిద్దరినీ తీసుకుని గణపతి, పద్మలు లచ్చారాయపురం వచ్చారు. తాతతో కలిసి మనవళ్లిద్దరూ భవానీదీక్షధారణ చేపట్టారు. తాతతో కలిసి వీరు స్నానం కోసం దగ్గర్లోని పెద్ద చెరువుకు వెళ్లారు. అక్కడ గట్టుపై ప్రదీప్ కూర్చుని ఉండగా.. తాత రాము తన పెద్ద మనవడు గౌతమ్‌ను స్నానం చేయించేందుకు చెరువులోకి దించే ప్రయత్నంలో పట్టుతప్పడంతో గౌతమ్ ఊబిలోకి జారిపోయాడు. మనవడిని కాపాడే ప్రయత్నంలో రాము కూడా ఊబిలోకి కూరుకుపోయాడు. గట్టుపై ఉన్న ప్రదీప్ కేకలు వేయడంతో సమీపంలోని రైతులొచ్చి చెరువులో వెతికారు. రాత్రంతా గాలించడంతో ఇద్దరి మృతదేహాలు లభ్యమయ్యాయి. ఒకేసారి తాత, మనవడు మృతిచెందడంతో గ్రామంలో విషాదం అలముకుంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సతీష్ ధావన్ వల్లే మేటి సంస్థగా ఇస్రో

ఇస్రో మాజీ చైర్మన్ డాక్టర్ కె.రాధాకృష్ణన్

సూళ్లూరుపేట: అత్యంత సాంకేతికతతో కూడిన అంతరిక్ష ప్రయోగాలు చేయడానికి శ్రీకారం చుట్టిన మొదటితరం శాస్త్రవేత్త ప్రొఫెసర్ సతీష్ ధావన్ అని ఇస్రో మాజీ చైర్మన్, స్పేస్ కమిషన్ సభ్యులు డాక్టర్ కె.రాధాకృష్ణన్ కొనియాడారు. ప్రొఫెసర్ సతీష్ ధావన్ 101వ జయంతిని సోమవారం తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని షార్ కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ అధ్యక్షతన జరిగింది. ముందుగా సతీష్ ధావన్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.రాధాకృష్ణన్ మాట్లాడుతూ.. భారత అంతరిక్ష ప్రయోగాలను తొలితరం శాస్త్రవేత్త డాక్టర్ విక్రమ్ సారాబాయ్ బుడి బుడి అడుగులతో నడిపిస్తే.. సతీష్ ధావన్ వాటికి నడక, మాటలు నేర్పించారని కొనియాడారు. దీంతో నేడు ప్రపంచంలోనే ఇస్రో బలీయమైన సంస్థగా ఎదిగిందన్నారు. ఆయన ఆలోచనల్లో నుంచి పుట్టినవే పీఎస్ఎల్వీ, జీఎస్ఎల్వీ రాకెట్‌లు అని తెలిపారు. సౌండింగ్ రాకెట్‌ల స్థాయి నుంచి గ్రహాంతర ప్రయోగాలు చేసే స్థాయికి చేరామంటే అది సతీష్ ధావన్ ఘనతేనని చెప్పారు. ఈ కార్యక్రమంలో షార్ కంట్రోలర్ శ్రీనివాసులురెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

భూ సర్వేను స్వాగతిస్తున్నాం..

ఏపీఆర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు

శ్రీకాకుళం పాతబస్టాండ్: రాష్ట్ర ప్రభుత్వం రైతుల భూములకు భద్రత కల్పిస్తూ చేపట్టిన భూ సర్వేను రెవెన్యూ సర్వీసుల సంఘం సంపూర్ణంగా స్వాగతిస్తోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెవెన్యూ సర్వీసుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ అమరావతి జేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు ప్రశంసించారు. ఆయన సోమవారం శ్రీకాకుళంలోని రెవెన్యూ వసతి గృహంలో మీడియాతో మాట్లాడారు. వందేళ్లుగా భూ సర్వే జరగకపోవడం వల్ల రైతులు, రెవెన్యూ సిబ్బంది ఇబ్బంది పడుతున్నారని, ఈ సమస్యలకు సర్వే పరిష్కారం చూపిస్తుందన్నారు. ప్రస్తుతం ఒక్కో గ్రామంలో భూ సర్వేకు ఇచ్చిన 71 రోజుల సమయం సరిపోవడం లేదన్నారు. గతంలో 100 రోజుల సమయం ఉండేదని, అంతకు ముందు పైలట్ ప్రాజెక్ట్‌లో ఒక గ్రామానికి ఆరు నెలల సమయం ఇచ్చారని తెలిపారు. రాష్ట్రంలో 17,564 గ్రామాలున్నాయని, ఇప్పటి వరకు 1060 గ్రామాల్లో పూర్తి స్థాయిలో సర్వే జరిగిందని వివరించారు. సర్వే సక్రమంగా.. తప్పుల్లేకుండా చేసేందుకు రీసర్వేకు గడువు పెంచాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో నెట్ సదుపాయం కూడా కల్పించాలన్నారు. కోవిడ్ సమయంలో చనిపోయిన కుటుంబాల వారికి కారుణ్య నియామకాలు చేపట్టాలని, అవసరమైన ప్రభుత్వ శాఖల్లో సూపర్ న్యూమరరీ పోస్టులను కల్పించి ఉద్యోగాలివ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏపీ రెవెన్యూ సర్వీసుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పప్పల వేణుగోపాల్, జిల్లా అధ్యక్షుడు కంచరాన శ్రీరాములు, కార్యదర్శి రాజు తదితరులు పాల్గొన్నారు.


మీడియాతో మాట్లాడుతున్న బొప్పరాజు

బాబు, పవన్ వల్లే కాపులు నష్టపోయారు

- కులమతాలకు అతీతంగా సీఎం వైఎస్ జగన్ పాలన
- కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషగిరి

దాబా గార్డెన్స్ (విశాఖ దక్షిణ): చంద్రబాబు, పవన్ కల్యాణ్ వల్ల కాపులు నష్టపోయారని కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషగిరి చెప్పారు. విశాఖపట్నంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కులాల మధ్య చిచ్చుపెట్టే నైజం చంద్రబాబుదేనని ధ్వజమెత్తారు. గతంలో బాబు పాలన మొత్తం అలాగే సాగిందన్నారు. ముఖ్యంగా కాపుల మధ్య చంద్రబాబు చిచ్చుపెట్టారని మండిపడ్డారు. బాబు హయాంలో కాపులు పూర్తిగా నష్టపోయారన్నారు. అలాగే జనసేన వల్ల కాపులు నష్టపోతున్నారని తెలిపారు. కాపుల కోసం ఉద్యమిస్తానని, కాపులదే జనసేన అని పవన్ కల్యాణ్ చెప్పగలరా? అని ప్రశ్నించారు. సీఎం వైఎస్ జగన్ పాలనలో 46.62 లక్షల మంది కాపులకు న్యాయం జరిగిందన్నారు. నవరత్న పథకాలతోపాటు ప్రత్యేకంగా కాపు నేస్తం పథకం కూడా పెట్టారన్నారు. విశాఖలో రూ.30 కోట్లు విలువ చేసే 50 సెంట్ల భూమిని కాపు భవనం కోసం ఇచ్చారన్నారు. త్వరలోనే కాపులకు సంబంధించి వెబ్‌సైట్‌ను ఆవిష్కరించనున్నట్టు తెలిపారు. కులమతాలు, పార్టీలకతీతంగా సీఎం వైఎస్ జగన్ పాలన సాగిస్తున్నారని కొనియాడారు. అన్ని కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేసి సమన్యాయం చేశారని గుర్తు చేశారు. మూడు రాజధానులకు కాపుల మద్దతు ఉంటుందని చెప్పారు. ప్రతిపక్ష నాయకులు ఔట్‌డేటెడ్ అయిపోయారని ఎద్దేవా చేశారు. అమరావతి రైతుల పేరిట చేస్తున్న యాత్రలో తొడలు కొట్టేవారు..మీసాలు తిప్పేవారు అందరూ పెయిడ్ ఆర్టిస్ట్‌లేనని మండిపడ్డారు. ఆ యాత్ర ఒక సామాజికవర్గం కోసం చేస్తున్న యాత్రేనని తేల్చిచెప్పారు.

అబే అంత్యక్రియల కోసం జపాన్‌కు ప్రధాని మోదీ



న్యూఢిల్లీ: జపాన్ దివంగత ప్రధాని షింజో అబే అంత్యక్రియల్లో పాల్గొనేందుకు ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం రాత్రి టోక్యో బయలుదేరి వెళ్లారు. మంగళవారం అంత్యక్రియల అనంతరం జపాన్ ప్రధాని ఫ్యుమియో కిషిడా, అబే భార్య అకీతో మోదీ భేటీ అవుతారు. మూణ్నెల్ల క్రితం జరిగిన ఎన్నికల ప్రచార కార్యక్రమంలో అబేను ఓ వ్యక్తి తుపాకీతో కాల్చి చంపడం తెలిసిందే.

క్లుప్తంగా...

జాక్వెలిన్‌కు బెయిల్



న్యూఢిల్లీ: రూ.200 కోట్ల మనీలాండరింగ్ కేసులో బాలీవుడ్ నటి జాక్వెలిన్ ఫెర్నాండెజ్‌కు ఢిల్లీ కోర్టు సోమవారం మధ్యంతర బెయిల్ ఇచ్చింది. ఈ కేసులో ప్రధాన నిందితుడైన ఆర్థిక నేరగాడు సుఖేశ్ చంద్రశేఖర్‌తో జాక్వెలిన్‌కు సాన్నిహిత్యం, అతని నుంచి విలాసవంత కార్లు, ఖరీదైన బహుమతుల పొందిందంటూ జాక్వెలిన్‌పై ఈడీ అభియోగాలు మోపడం తెల్సిందే. మరో బాలీవుడ్ నటి నోరా ఫతేహీ కూడా సుఖేశ్ నుంచి పలు కార్లు, ఖరీదైన గిఫ్టులు పొందినట్టు ఇటీవలే ఈడీ వాంగ్మూలంలో ఒప్పుకుంది.

త్వరలో సొంత వేదికపై ప్రత్యక్ష ప్రసారాలు: సుప్రీం

న్యూఢిల్లీ: కేసుల విచారణను ప్రత్యక్ష ప్రసారం చేసేందుకు త్వరలో సొంత వేదికను సిద్ధం చేసుకుంటామని సుప్రీంకోర్టు పేర్కొంది. సీజేఐ జస్టిస్ యూయూ లలిత్, న్యాయమూర్తులు జస్టిస్ ఎస్.రవీంద్రభట్, జస్టిస్ జేబీ పార్థివాలాల ధర్మాసనం సోమవారం ఈ మేరకు స్పష్టం చేసింది. లైవ్–స్ట్రీమింగ్ కోసం కోర్టు ప్రస్తుతం యూట్యూబ్‌ను వినియోగించుకుంటుండటం తెలిసిందే. కోర్టు ప్రొసీడింగ్స్ కాపీరైట్ హక్కులు యూట్యూబ్‌కు దఖలు పడతాయంటూ బీజేపీ మాజీ నేత కేఎన్ గోవిందాచార్య తరఫు లాయర్ విరాగ్ గుప్తా వ్యక్తం చేసిన ఆందోళనపై ధర్మాసనం స్పందించింది. ''యూట్యూబ్ తాత్కాలిక ఏర్పాటే కాపీరైట్ హక్కుల రక్షణ బాధ్యత మాదే'' అని తెలిపింది.

చెరువులోకి దూసుకెళ్లిన ట్రాక్టర్... యూపీలో 10 మంది మృతి

లక్నో/సిమ్లా: ఉత్తరప్రదేశ్‌లో లక్నో జిల్లా సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో 10 మంది చనిపోయారు. 37 మంది గాయపడ్డారు. 47 మందితో ఆలయానికి వెళ్తున్న ట్రాక్టర్ అదుపు తప్పడంతో ట్రాలీ తిరగబడి రోడ్డు పక్కనే ఉన్న చెరువులోకి దూసుకెళ్లిందని అధికారులు చెప్పారు. మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.4 లక్షల చొప్పున పరిహారం ప్రకటించింది.

హిమాచల్‌లో ఏడుగురు...

హిమాచల్ ప్రదేశ్‌లో కుల్లు జిల్లాలో ఆదివారం రాత్రి టెంపో ట్రావెలర్ వాహనం లోయలో పడి ఏడుగురు పర్యాటకులు చనిపోయారు. 10 మంది గాయపడ్డారు.

50కి 'బంగ్లాదేశ్' పడవ మృతులు...

ఢాకా: బంగ్లాదేశ్‌లో ఆదివారం పడవ మునిగిన ప్రమాదంలో మృతుల సంఖ్య 50కి చేరింది. బోదేశ్వరి ఆలయానికి సామర్థ్యానికి మించి 80 మందికి పైగా భక్తులతో వెళ్తున్న పడవ కొరొటొవా నదిలో మునిగిపోవడం తెలిసిందే. ఆదివారం 25 మృతదేహాలు, సోమవారం మరో 25 దొరికాయి.

పాస్‌పోర్ట్ కోసం... ఆన్‌లైన్‌లోనే పీసీసీ దరఖాస్తు

న్యూఢిల్లీ: పాస్‌పోర్ట్ మంజూరులో పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్ (పీసీసీ) జారీ జాప్యాన్ని నివారించేందుకు కేంద్ర హోం శాఖ కొత్త విధానాన్ని ప్రకటించింది. ఇక దేశవ్యాప్తంగా ఉన్న అన్ని పోస్టాఫీస్ పాస్‌పోర్ట్ సేవా కేంద్రాల్లో పాస్‌పోర్ట్ దరఖాస్తుదారులే నేరుగా పీసీసీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఫలితంగా పాస్‌పోర్ట్ కార్యాలయం అధికారులు వివరాలను స్థానిక పోలీసులకు పంపించి వాకబు చేసే అవసరం తగ్గి సమయం ఆదా అవుతుంది. ఈ నెల 28వ తేదీ నుంచి ఇది అమల్లోకి రానుంది.

ప్రతిపక్షాలు చేతులు కలపడం ఖాయం: నితీశ్

న్యూఢిల్లీ: 2024 లోక్‌సభ ఎన్నికల్లో ప్రతిపక్షాలు చేతులు కలుపుతాయని బిహార్ సీఎం, జేడీ(యూ) అగ్రనేత నితీశ్ కుమార్ చెప్పారు. పలు పార్టీల నాయకులతో తాను మాట్లాడుతూనే ఉన్నానని, అంతా ఒక్కతాటిపైకి వస్తారని సోమవారం తెలిపారు. కాంగ్రెస్‌ను తీవ్రంగా వ్యతిరేకించే తృణమూల్ కాంగ్రెస్ పార్టీ, ఆమ్ ఆద్మీ పార్టీ కూడా కొత్త కూటమిలో భాగస్వాములవుతాయన్నారు.

10 యూట్యూబ్ చానళ్లలో 45 వీడియోలు బ్లాక్: కేంద్రం

న్యూఢిల్లీ: మతాల నడుమ చిచ్చు పెట్టడమే లక్ష్యంగా తప్పుడు వార్తలను, మార్ఫ్‌డ్ వీడియోలను ప్రసారం చేసే యూట్యూబ్ చానళ్లపై కఠిన చర్యలు తప్పవని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ హెచ్చరించారు. నిబంధనలను ఉల్లంఘించిన 10 యూట్యూబ్ చానళ్లలోని 45 వీడియోలను బ్లాక్ చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. ఓ వర్గం ప్రజల మత హక్కులను ప్రభుత్వం హరిస్తోందంటూ ఆ వీడియోల్లో ఉందని సోమవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

లోకం చుట్టేద్దాం

పర్యాటకానికి మళ్లీ మంచి రోజులు

నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం



- కరోనా తర్వాత క్రమంగా గాడిలో
- ఎకో టూరిజం వైపు జనం మొగ్గు

నిత్యం ఒత్తిళ్ల నడుమ బిజీ బిజీగా సాగే రొటీన్‌గా బతుకుల్లో అప్పుడప్పుడూ కాస్త కొత్తదనం నింపేవి టూర్లే. కరోనాతో కుదేలైన పర్యాటక రంగం కొన్నాళ్లుగా తిరిగి కళకళలాడుతోంది. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా పలు దేశాలు రీ థింకింగ్ టూరిజం పేరుతో టూరిస్టులను ఆకర్షించే ప్రయత్నాల్లో ఉన్నాయి...

కరోనాతో తీవ్రంగా నష్టపోయిన ప్రధాన రంగాల్లో పర్యాటకం ఒకటి. రెండేళ్ల పాటు లాక్‌డౌన్లు, అంతర్జాతీయ రాకపోకలపై నిషేధాలతోనే సరిపోయింది. దాంతో పర్యాటకమే ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న శ్రీలంక వంటి దేశాలు ఆర్థికంగా చితికిపోయాయి. సాధారణ పరిస్థితులు నెలకొంటుండటంతో సెప్టెంబర్ 27న ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని 'రీ థింకింగ్ టూరిజం' థీమ్‌తో పలు దేశాలు ముమ్మరంగా ప్రమోట్ చేస్తున్నాయి. టూరిస్టులు ఇష్టపడే ప్రాంతాలను గుర్తించి అభివృద్ధి చేయడం, కాస్త అలా తిరిగి వస్తే నిత్య జీవిత ఒత్తిళ్ల నుంచి బయట పడవచ్చంటూ ప్రచారం చేయడంపై దృష్టి పెట్టాయి. పర్యాటక రంగంలో ప్రపంచ దేశాల్లో ఫ్రాన్స్‌కు తిరుగు లేదని ఎన్నో సర్వేలు తేల్చాయి. 2019లో ఏకంగా 9 కోట్ల మంది అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించింది. దేశ జీడీపీలో 8% వాటా పర్యాటక రంగానిదే. కరోనా వేళ ఫ్రాన్స్‌కు టూరిస్టులు సగానికి సగం తగ్గిపోయారు. మళ్లీ ఈ ఏడాది ఆ దేశానికి టూరిస్టుల తాకిడి పెరిగింది. తర్వాతి స్థానాల్లో స్పెయిన్, అమెరికా, జర్మనీ, స్విట్జర్లాండ్, సింగపూర్ తదితరాలున్నాయి. టాప్ 10 దేశాల్లో యూరప్, ఆసియా పసిఫిక్ దేశాలే ఎక్కువగా ఉండటం విశేషం!

ఎటు చూసినా ఎకో టూరిజమే

ఎకో టూరిజం. సింపుల్‌గా చెప్పాలంటే ప్రకృతి సౌందర్యంలో లీనమైపోవడం. కాంక్రీట్ అడవుల్లో నిత్యం రణగొణధ్వనుల మధ్య బతికేవారు అప్పుడప్పుడూ ప్రకృతి అందాల మధ్య రిలాక్సవడం. ఉద్యానవనాలు, అడవులు, సముద్ర తీర ప్రాంతాల సందర్శన, కొండలు గుట్టలు ట్రెక్కింగ్, ఆయా ప్రాంతాల సంస్కృతిని తెలుసుకోవడంపై ప్రజలు ఆసక్తి చూపుతుండటంతో అన్ని దేశాలూ ఎకో టూరిజం అభివృద్ధిపై దృష్టి పెట్టాయి. మారుమూలల్లోని ప్రాకృతిక అందాలని టూరిస్ట్ స్పాట్లుగా తీర్చిదిద్దితే ఇటు ఆదాయం రావడంతో పాటు పేదరికంలో మగ్గుతున్న స్థానికుల బతుకులూ బాగుపడతాయి. ఐస్‌ల్యాండ్, కోస్టారికా, పెరు, కెన్యా, అమెజాన్ అడవులతో అలరారే బ్రెజిల్ వంటివి ఎకో టూరిజానికి పెట్టింది పేరు. ప్రపంచ ఎకో టూరిజం మార్కెట్ 2019లో 9 వేల కోట్ల డాలర్లు. 2027 నాటికి 11 వేల కోట్ల డాలర్లకు చేరొచ్చని అంచనా.

- సాక్షి, నేషనల్ డెస్క్

కరోనా ఎఫెక్ట్

- వరల్డ్ ట్రావెల్ అండ్ టూరిజం కౌన్సిల్ ప్రకారం పర్యాటక రంగాన్ని కరోనా ఘోరంగా దెబ్బ తీసింది.
- 2019తో పోలిస్తే 2020లో అంతటా ఏకంగా 74% పర్యాటకులు తగ్గిపోయారు!
- ప్రపంచవ్యాప్తంగా పర్యాటక రంగం 4.5 లక్షల కోట్ల డాలర్ల మేర నష్టపోయింది.
- దేశీయ పర్యాటకులు 45% తగ్గారు.
- అంతర్జాతీయంగా చూసుకుంటే పర్యాటకుల సంఖ్య ఏకంగా 69.4% తగ్గింది.
- 6.2 కోట్ల ఉద్యోగాలు పోయాయి.

భారత్.. పర్యాటక హబ్

- పర్యాటక రంగ పురోగతికి భారత్ పకడ్బందీ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.
- సుస్థిర, బాధ్యతాయుత పర్యాటకమే లక్ష్యంగా కేంద్ర పర్యాటక, సాంస్కృతిక మంత్రి జి.కిషన్ రెడ్డి ఇటీవల ధర్మశాల డిక్లరేషన్ ఆమోదించారు.
- పర్యాటక రంగ వృద్ధితో విదేశీ మారక నిల్వలు పెరిగి దేశం ఆర్థికంగా సుసంపన్నంగా మారుతుంది.
- 2030 నాటికి పర్యాటక ఆదాయం జీడీపీలో 10 శాతానికి పెంచడం, 2.5 కోట్ల విదేశీ పర్యాటకులను రప్పించడం, 14 కోట్ల ఉద్యోగాలు కల్పించడం లక్ష్యం.

పర్యాటకానిది పెద్ద పాత్ర

- పర్యాటక రంగానికున్న ప్రాధాన్యం అంతా ఇంతా కాదు. ప్రపంచ స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ)లో 10% వాటా దీనిదే!
- ప్రపంచ ఎగుమతుల్లో 7% పర్యాటకుల కోసమే జరుగుతున్నాయి.
- ప్రతి 10 ఉద్యోగాల్లో ఒకటి పర్యాటక రంగమే కల్పిస్తోంది.
- 2019లో అత్యధికంగా ఫ్రాన్స్‌ను 9 కోట్ల మంది సందర్శించారు. 8.3 కోట్లతో స్పెయిన్, 7.9 కోట్ల పర్యాటకులతో అమెరికా తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.
- పర్యాటక రంగం 2019లో ప్రపంచవ్యాప్తంగా 33.3 కోట్ల ఉద్యోగాలు కల్పించింది. కరోనా దెబ్బకు 2020లో ఇది ఏకంగా 2.7 కోట్లకు తగ్గిపోయింది.
- 2019లో భారత జీడీపీలో పర్యాటక రంగానిది 6.8% వాటా. 2020 నాటికి 4.7 శాతానికి తగ్గింది.
- 2019లో 1.8 కోట్ల మంది భారత్‌ను సందర్శిస్తే 2020లో 60 లక్షలకు పడిపోయింది.
- 2020 నాటికి దేశ పర్యాటక రంగం 8 కోట్ల ఉద్యోగాల కల్పించింది.

అన్యాయంపై పోరాటానికే.. జోడో యాత్ర: రాహుల్



పాలక్కడ్ (కేరళ): కుబేరుల లక్షల కోట్ల రుణాలను మాఫీ చేస్తూ, రైతులు, చిన్న వ్యాపారులను రుణాల పేరిట వేధిస్తున్న మోదీ అవినీతి సర్కార్‌పై పోరాటమే భారత్ జోడో యాత్ర అని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. సోమవారం యాత్ర 19వ రోజు పాలక్కడ్ జిల్లా కొప్పమ్‌లో పార్టీ మద్దతుదారులు, గిరిజన యువతతో రాహుల్ భేటీ అయ్యారు. బీజేపీ సర్కారు తెర తీసిన రెండు రకాల హిందుస్తాన్ పాలనను దేశం సహించబోదన్నారు. గిరిజన వైద్యాన్ని కేంద్రం ఆయుష్‌లో భాగం చేయాలని, గిరి పుత్రుల స్కూల్, కాలేజీ డ్రాపౌట్స్ తగ్గించేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని గిరిజనులు రాహుల్‌తో అన్నారు.

నామినేషన్ రోజు నా సత్తా చూస్తారు: థరూర్




పాలక్కడ్(కేరళ): కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికలో అభ్యర్థులను ఎదుర్కొనే సత్తా తనకుందని తిరువనంతపురం ఎంపీ శశి థరూర్ ధీమా వ్యక్తంచేశారు. ''దేశం నలుమూలల నుంచి నాకున్న భారీ మద్దతును నామినేషన్ రోజు మీరే చూస్తారు. ఇప్పటికే నేతలతో భేటీల ప్రక్రియ మొదలుపెట్టా. నాకు మద్దతిచ్చేందుకు అభ్యంతరం లేదని పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ, రాహుల్, ప్రియాంక నాతో అన్నారు'' అని చెప్పారు. కేరళలో జోడో యాత్రలో ఉన్న రాహుల్‌ను సోమవారం పట్టాంబిలో థరూర్ కలిశారు.

గెహ్లోట్ వర్గం ధిక్కారం!

ముదురుపాకాన రాజస్తాన్ సంక్షోభం

- అధిష్టానానికే ఎమ్మెల్యేల షరతులు
- సోనియా కన్నెర్ర, నివేదికకు ఆదేశం



జైపూర్/న్యూఢిల్లీ: రాజస్తాన్‌లో రాజకీయ ప్రతిష్టంభన ముదురుపాకాన పడింది. రాష్ట్రంలో నాయకత్వ మార్పు కోసం కాంగ్రెస్ అధిష్టానం చేసిన ప్రయత్నం కాస్తా బెడిసికొట్టి సంక్షోభంగా మారింది. పార్టీ అధ్యక్ష ఎన్నిక వేళ తలనొప్పులను మరింతగా పెంచుతోంది. అధ్యక్ష బరిలో దింపాలని భావించిన సీనియర్ నాయకుడు అశోక్ గెహ్లోట్ రాజస్తాన్ సీఎం పీఠం వదులుకోవడానికి సుముఖంగా లేకపోవడంతో పార్టీ పెద్దలకు ఎటూ పాలుపోవడం లేదు. సీఎంగా కొనసాగుతూనే అధ్యక్ష పదవికి పోటీ చేస్తానని గెహ్లోట్ భీష్మించుకున్నారు. ఒకరికి ఒకే పదవి నిబంధన ఈ విషయంలో వర్తించదని ఆయన వాదిస్తున్న సంగతి తెలిసిందే. ఫలితాలు వచ్చేదాకా గెహ్లోట్‌నే సీఎంగా కొనసాగించాలన్న డిమాండ్‌పై వెనక్కు తగ్గేందుకు ఆయన వర్గం ఎమ్మెల్యేలు కూడా ససేమిరా అంటున్నారు. ఈ క్రమంలో వారంతా అధిష్టానాన్నే ధిక్కరించేలా వ్యవహరించి గట్టి షాకిచ్చారు! గెహ్లోట్ స్థానంలో ఆయన రాజకీయ ప్రత్యర్థి సచిన్ పైలట్‌ను సీఎం చేయాలన్న అధిష్టానం యోచనను వ్యతిరేకిస్తూ 108 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో ఏకంగా 82 మంది ఆదివారం స్పీకర్‌కు రాజీనామా సమర్పించడం తెలిసిందే. పరిస్థితిని చక్కదిద్దేందుకు మల్లికార్జున ఖర్గే, అజయ్ మాకెన్‌లను ఆదివారం రాత్రి హుటాహుటిన రాజస్తాన్‌కు పరిశీలకులుగా పంపిన అధిష్టానానికి మింగుడు పడని రీతిలో మరిన్ని షాకులు తగిలాయి. ఎమ్మెల్యేలు కనీవినీ ఎరగని స్థాయిలో ధిక్కార స్వరం విన్పించారు. దీనిపై బీజేపీ కూడా వ్యంగ్యాస్త్రాలు విసిరింది. పార్టీ నుంచి నేతల నిష్క్రమణ, వరుసగా ఓటములు తదితరాలతో ఇప్పటికే కుదేలైన కాంగ్రెస్ అధిష్టానం ఈ సంక్షోభాన్ని ఎలా పరిష్కరిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. ఈ పరిణామాలతో గెహ్లోట్ కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నిక బరిలోకి దిగడం అనుమానంగా మారింది. అధిష్టానానికి విశ్వాసపాత్రులైన మల్లికార్జున ఖర్గే, దిగ్విజయ్‌సింగ్, కమల్‌నాథ్, సుశీల్‌కుమార్ షిండే, ముకుల్ వాస్నిక్, కుమారి సెల్జా పేర్లు విన్పిస్తున్నాయి. తాను పోటీ చేయబోనని దిగ్విజయ్ ఇప్పటికే ప్రకటించడం తెలిసిందే. కమల్‌నాథ్ కూడా సోమవారం అదే మాట చెప్పారు.

పరిశీలకులకు గెహ్లోట్ వర్గం షాకులు

సీఎం గెహ్లోట్ నివాసంలో ఖర్గే, మాకెన్ ఆదివారం రాత్రి అత్యవసరంగా సీఎల్పీ సమావేశం ఏర్పాటు చేశారు. కానీ గెహ్లోట్ వర్గం ఎమ్మెల్యేలంతా దాన్ని బహిష్కరించడంతో వారు దిమ్మెరపోయారు! చాలాసేపు ఎదురు చూసినా ఎమ్మెల్యేలు రాకపోవడంతో భేటీని రద్దు చేసుకోవాల్సి వచ్చింది. చివరికి ఒక్కొక్కరిగా వచ్చి తమతో సమావేశం కావాల్సిందిగా ఆదేశించినా ఎమ్మెల్యేలు పట్టించుకోలేదు. పైగా అదే సమయంలో వారంతా కలిసి ఓ మంత్రి ఇంట్లో విడిగా సమావేశమయ్యారు! ''గెహ్లోట్‌ను తప్పిస్తే ప్రభుత్వ మనుగడే ప్రమాదంలో పడుతుంది. రాష్ట్రంలో కాంగ్రెస్ కూడా చిక్కుల్లో పడుతుంది'' అంటూ వ్యాఖ్యలు చేశారు. దీనితాలూకు వీడియో కూడా మీడియాకు లీకైంది! అనంతరం నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొనాల్సి ఉందంటూ ఎమ్మెల్యేలంతా తమ తమ నియోజకవర్గాలకు వెళ్లిపోయారు! అనంతరం ఎమ్మెల్యేల తరఫున మంత్రులు శాంతి ధరీవాల్, మహేశ్ జోషి, ప్రతాప్ సింగ్ పరిశీలకులతో భేటీ అయ్యారు. ''సీఎం ఎవరనే దానిపై అక్టోబర్ 19 తర్వాత కాంగ్రెస్ కొత్త అధ్యక్షుడే నిర్ణయం తీసుకోవాలి. రెండేళ్ల క్రితం పైలట్ తిరుగుబాటు సమయంలో ప్రభుత్వానికి విధేయులుగా నిలిచిన ఎమ్మెల్యేల నుంచే సీఎంను ఎన్నుకోవాలి. ఒక్కో ఎమ్మెల్యేలతో విడిగా కాకుండా అందరితో కలిసే మీరు భేటీ అవాలి'' అంటూ షరతుల చిట్టాను వారి ముందుంచారు. ముందుగా ఎమ్మెల్యేల అనుమానాలను అధిష్టానం నివృత్తి చేయాలని చీఫ్ విప్ మహేశ్ జోషి కూడా డిమాండ్ చేశారు. ఎవరిని సీఎం చేసినా అభ్యంతరం లేదంటూనే, అది తమకు అంగీకారయోగ్యంగా ఉండాల్సిందేనంటూ కుండబద్దలు కొట్టారు. దాంతో విస్తుపోవడం ఖర్గే, మాకెన్ వంతయింది. ఈ వరుస భంగపాట్ల నేపథ్యంలో వారిద్దరూ సోమవారం ఉదయమే హస్తినకు తిరుగుముఖం పట్టారు. అధినేత్రి సోనియాగాంధీ నివాసానికి వెళ్లి జరిగిందంతా వివరించారు. దాంతో ఆగ్రహించిన సోనియా మొత్తం ఉదంతంపై లిఖితపూర్వక మంగళవారానికల్లా నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. గెహ్లోట్‌తో సన్నిహిత సంబంధాలున్న మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, సీనియర్ నాయకుడు కమల్‌నాథ్‌ను హుటాహుటిన ఢిల్లీకి పిలిపించారు. ఆయన సోనియాతో గంటపాటు భేటీ అయ్యారు. గెహ్లోట్‌ను రాజీకి రప్పించేందుకు కమల్‌నాథ్‌ను నియోగించవచ్చంటున్నారు.

తీర్మానంలో షరతులా: మాకెన్

గెహ్లోట్ వారసున్ని నిర్ణయించే అధికారాన్ని పార్టీ చీఫ్‌కు కట్టబెడుతూ సీఎల్పీ భేటీలో ఏకవాక్య తీర్మానం ఆమోదింపజేయాలని ఖర్గే, మాకెన్ తలపోయగా, అధ్యక్షునిగా ఎన్నికయ్యేదాకా గెహ్లోట్ సీఎంగా కొనసాగుతారంటూ అందులో చేర్చాలని ఆయన వర్గం ఎమ్మెల్యేలు పట్టుబట్టారు. ఇది క్రమశిక్షణ రాహిత్యమేనంటూ మాకెన్ మండిపడ్డారు. సోనియాతో భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ''తీర్మానమంటే కేవలం ఏకవాక్యంతో ఉంటుంది. అంతే తప్ప షరతులతో కూడిన తీర్మానాలు కాంగ్రెస్ చరిత్రలో ఎన్నడూ లేవు. సీఎల్పీ భేటీకి డుమ్మా కొట్టి విడిగా సమావేశం కావడం క్షమించరాని విషయం'' అంటూ ఆగ్రహించారు. ''సీఎంగా తీర్మానాన్ని ప్రవేశపెట్టాల్సింది గెహ్లోటే. తర్వాత అధ్యక్ష పదవికి పోటీ పడేదీ ఆయనే. గెలిస్తే తను సీఎంగా కొనసాగాలో లేదో నిర్ణయించేదీ ఆయనే. ఇది కాన్‌ఫ్లిక్ట్ ఆఫ్ ఇంట్రెస్ట్ అవదా?'' అంటూ మండిపడ్డారు.



పండుగలు ఐక్యతకు ప్రతీకలు



మైసూరు దసరా ఉత్సవాలను ప్రారంభించిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

మైసూరు: మైసూరు ఉత్సవాలు దేశ ఘన సాంస్కృతిక వైభవాన్ని చాటిచెప్పేవని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అన్నారు. దసరా వంటి పండుగలు సమాజంలో ఐక్యతను పెంచుతాయని, భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకలుగా నిలుస్తాయని చెప్పారు. ప్రఖ్యాత మైసూరు దసరా ఉత్సవాలను సోమవారం ఆమె ప్రారంభించారు. చాముండి కొండపై మైసూరు రాచవంశీకుల ఆరాధ్యదైవం చాముండేశ్వరి విగ్రహంపై పూలు చల్లుతూ వేద మంత్రోచ్చరణల మధ్య ఉత్సవాలను ప్రారంభించారు. అంతకుముందు ఆలయంలో విశేష పూజలు చేశారు. ఇటీవలి కాలంలో మైసూరు దసరా ఉత్సవాల్లో పాల్గొన్న రాష్ట్రపతి ముర్మునే.

మైసూరు పట్టుచీరలో రాష్ట్రపతి

ఈ సందర్భంగా రాష్ట్రపతి మైసూరులో తయారైన తెలుపు రంగు బంగారు జరీ గీతల అంచుతో కూడిన పట్టుచీరను ధరించారు. ఆమె కోసం దీన్ని ప్రత్యేకంగా నేయించినట్లు అధికారులు తెలిపారు. స్థానిక బుడకట్టు గిరిజన కళాకారుల నృత్యాలను ఆమె ఆసక్తిగా తిలకించారు.

విద్యుత్‌కాంతులతో మైసూరు

కరోనా నేపథ్యంలో మైసూరులో శరన్నవరాత్రి ఉత్సవాలు రెండేళ్లు సాదాసీదాగా జరిగాయి. ఈ నేపథ్యంలో జానపద కళా రూపాలతో కర్ణాటక సాంస్కృతిక వైభవాన్ని చాటేలా ఈసారి 9 రోజులపాటు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మైసూరు ప్యాలెస్, వీధులు, భవనాలు, కూడళ్లను విద్యుద్దీపాలతో అలంకరించింది. మైసూరులోని ప్రముఖ్య రాజప్రాసాదాలైన అంబా విలాస్ ప్యాలెస్, జగన్మోహన్ ప్యాలెస్ వంటి 8 చోట్ల 290 సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనుంది.

డెమొక్రటిక్ ఆజాద్ పార్టీ

కొత్త పార్టీ ప్రారంభించిన గులాం నబీ



జమ్మూ: కాంగ్రెస్ మాజీ నేత గులాం నబీ ఆజాద్ సోమవారం తన కొత్త పార్టీని ప్రకటించారు. దానికి 'డెమొక్రటిక్ ఆజాద్ పార్టీ' అని పేరు పెట్టారు. కశ్మీర్‌లో ఏ క్షణమైన ఎన్నికలు రానున్నందున పార్టీ కార్యకలాపాలను వెంటనే ప్రారంభిస్తామన్నారు. 50 శాతం టిక్కెట్లను యువత, మహిళలకే కేటాయిస్తామని చెప్పారు. గాంధీ ఆలోచనలు, ఆశయాలే తమ పార్టీ సిద్ధాంతాలన్నారు. జమ్మూకశ్మీర్‌లో శాంతిని బలోపేతం చేయడం, సాధారణ పరిస్థితులను నెలకొల్పడంపైనే ప్రధానంగా దృష్టి కేంద్రీకరిస్తామని వివరించారు. ఆర్టికల్ 370 విషయంలో పీడీపీ సహా ఇతర పార్టీలు తనపై చేస్తున్న విమర్శలను ఆజాద్ తిప్పికొట్టారు. ''దాని పునరుద్ధరణ అసాధ్యమని నేనెప్పుడూ చెప్పలేదు. ప్రధాని మోదీని ఒప్పించలేకపోయాననే చెప్పా. ఆర్టికల్ 370పై మోదీని, కేంద్ర హోం మంత్రి అమిత్ షాలను ఎవరైనా ఒప్పించాలనుకుంటే స్వాగతిస్తా. వారివద్ద నాకంత పలుకుబడి లేదు. ఆర్టికల్ 370 రద్దు, జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక హోదా నిర్ణయంపై అక్టోబర్ 10 సుప్రీంకోర్టు విచారణ చేపట్టనుండడం మంచి పరిణామం'' అని అన్నారు.

రష్యాలో స్కూల్లో కాల్పులు...

15 మంది దుర్మరణం

- పూర్వ విద్యార్థి ఘాతుకం
- మృతుల్లో 11 మంది చిన్నారులే



కాల్పుల అనంతరం ఆత్మహత్య చేసుకున్న హంతకుడు

మాస్కో: రష్యాలోని ఓ పాఠశాలలో పూర్వ విద్యార్థి సోమవారం దారుణానికి పాల్పడ్డాడు. రెండు పిస్టళ్లతో విచక్షణారహితంగా కాల్పులకు దిగి 11 మంది చిన్నారులు సహా 15 మందిని పొట్టన పెట్టుకున్నాడు. తర్వాత కాల్చుకుని చనిపోయాడు. ఈ కాల్పుల్లో మరో 22 మంది చిన్నారులు గాయపడ్డారు. ఉడుముర్షియా రీజియన్‌లోని ఉరాల్ పర్వతాల పశ్చిమాన ఉన్న ఇజెవిస్క్ సిటీలో ఈ దారుణం చోటుచేసుకుంది. ''హంతకుని పేరు ఆర్టెమ్ కజన్‌స్తేవ్ (34). స్వస్తిక్, నాజీ గుర్తులున్న నల్ల టీ షర్ట్ వేసుకున్నాడు. అతని నేర చరిత్ర ఇంకా తెలియదు. ఎందుకు కాల్పులు జరిపాడు? అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది'' అని ఉడుముర్షియా గవర్నర్ అలెగ్జాండర్ బ్రెచలోవ్ చెప్పారు. ఈ స్కూల్లో ఒకటి నుంచి 11వ తరగతి వరకు విద్య బోధిస్తారు. అర్టెమ్ గతంలో ఇక్కడి మానసిక చికిత్సాలయంలో పేరు రిజిస్టర్ చేసుకున్నాడని నిఘా దర్యాప్తులో తేలింది. కాల్పుల ఘటనపై రష్యా అధ్యక్షుడు పుతిన్ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు.

భూమికి అతి సమీపానికి బృహస్పతి

మళ్లీ చూడాలంటే 107 ఏళ్లు ఆగాల్సిందే



వాషింగ్టన్: సౌర మండలంలో అతి పెద్ద గ్రహమైన బృహస్పతి సోమవారం భూమికి అతి సమీపానికి, అంటే 59 కోట్ల కిలోమీటర్ల దూరంలోకి వచ్చింది. ఫలితంగా సోమవారం సాయంత్రం 5.29 నుంచి మంగళవారం తెల్లవారుజాము 5.30 దాకా ఆకాశంలో అత్యంత ప్రకాశవంతంగా కన్పించి కనువిందు చేసింది. బృహస్పతి భూమికి ఇంత దగ్గరికి రావడం గత 59 ఏళ్లలో ఇదే మొదటిసారి. మళ్లీ ఇంత సమీపానికి రావాలంటే 2129 దాకా ఆగాల్సిందే. 53 ఉపగ్రహాలున్న బృహస్పతి సూర్యుడి చుట్టూ ఒక్కసారి తిరగడానికి ఏకంగా 11 ఏళ్లు తీసుకుంటుంది!

రష్యాలో గబ్బిలాల్లో కొత్త వైరస్



వాషింగ్టన్: సార్స్–కోవ్–2.. అంటే కోవిడ్–19 మహమ్మారి ప్రపంచ వ్యాప్తంగా సృష్టించిన కల్లోలాన్ని ఎవరూ మర్చిపోలేదు. లక్షల మంది ప్రాణాలను బలితీసుకుంది. తొలుత చైనాలో పుట్టినట్లు భావిస్తున్న ఈ వైరస్ ప్రభావం ఇంకా తగ్గలేదు. అచ్చంగా కోవిడ్–19 లాంటి వైరస్‌ను రష్యాలోని గబ్బిలాల్లో పరిశోధకులు గుర్తించారు. ఇది గబ్బిలాల నుంచి మనుషులకు సోకుతుందని చెబుతున్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న కరోనా వైరస్ నియంత్రణ వ్యాక్సిన్లు ఈ కొత్త వైరస్‌పై ఏమాత్రం ప్రభావం చూపలేవని అంటున్నారు. అమెరికాలోని వాషింగ్టన్ స్టేట్ యూనివర్సిటీ పరిశోధకుల బృందం రష్యా గబ్బిలాలపై అధ్యయనం నిర్వహించింది. వీటిలో ఖోస్టా–2 అనే వైరస్‌లో స్పైక్ ప్రొటీన్లను గుర్తించారు. ఇవి మనుషుల్లోని కణాల్లోకి చొచ్చుకుపోయి, విషపూరితం చేస్తాయని తేల్చారు. కరోనా వైరస్‌లలో (సార్బీకోవైరస్‌లు) ఖోస్టా–2, సార్స్–కోవిడ్–2 అనేవి ఒకే ఉప కేటగిరీకి చెందినవని పరిశోధకులు చెప్పారు. అధ్యయనం వివరాలను ప్లాస్ పాథోజెన్స్ పత్రికలో ప్రచురించారు. కేవలం సార్స్–కోవ్–2 వంటి వేరియంట్లను నియంత్రించడానికి కాదు, సార్బీకో వైరస్‌ల నుంచి రక్షణ కల్పించే యూనివర్సల్ వ్యాక్సిన్లను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని సైంటిస్ట్ మైఖేల్ లెట్కో చెప్పారు. ఖోస్టా–2 వైరస్ వ్యాపిస్తే మనుషులకు తీవ్ర అనారోగ్యం ముప్పుందని గుర్తించారు. కోవిడ్–19, ఖోస్టా–2 లాంటి వైరస్‌లు ప్రొటీన్ స్పైక్‌ల సాయంతో మనుషులపై దాడి చేస్తాయి.

తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో మంగళవారం ప్రారంభం కానున్న బ్రహ్మోత్సవాలకు సోమవారం శాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు. శ్రీవారి సేనాధిపతి విష్వక్సేనుడు మాడవీధుల్లో ఊరేగుతూ ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం అర్చకులు, వేదపండితులు మృత్సంగ్రహణం చేశారు. ఆ మట్టిని తొమ్మిది పాలికల్లో ఉంచి వాటిలో నవధాన్యాలను చల్లారు. దీంతో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ ఘట్టం పూర్తయింది. ఈ కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి దంపతులు, ఈవో ఏవీ ధర్మారెడ్డి దంపతులు, బోర్డు సభ్యులు మారుతీప్రసాద్, రాములు, సీవీఎస్వో నరసింహకిషోర్, శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో రమేష్‌బాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఇంద్రకీలాద్రిపై వైభవంగా..

ప్రారంభమైన దసరా ఉత్సవాలు.. తొలిరోజు స్వర్ణకవచాలంకారంలో దర్శనం



గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ దంపతులకు అమ్మవారి చిత్రపటం అందిస్తున్న అధికారులు



జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా దంపతులకు ప్రసాదాలు అందిస్తున్న కలెక్టర్, ఆలయ అధికారులు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజున కనక దుర్గమ్మ.. స్వర్ణ కవచాలంకృత దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున మూడు గంటలకు వేద పండితులు, అర్చకుల సుప్రభాత సేవతో శరన్నవరాత్రి ఉత్సవాలకు అంకురార్పణ జరిగింది. శాస్త్రోక్తంగా బాలభోగ నివేదన చేసిన అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. ఉదయం 9 నుంచి రాత్రి 10 గంటల వరకు అమ్మవారిని దర్శించుకునే అవకాశం కల్పించారు. తొలి రోజే పెద్ద సంఖ్యలో భక్తులు రావడంతో ఇంద్రకీలాద్రి కోలాహలంగా మారింది. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తులతో నిర్వహించిన నగరోత్సవం భక్తులకు కనువిందుచేసింది.

అమ్మవారి సేవలో గవర్నర్ దంపతులు

గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ దంపతులు సోమవారం దుర్గమ్మను దర్శించుకున్నారు. వారికి దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, కలెక్టర్ ఢిల్లీరావు, సీపీ టీకే రాణా, ఆలయ ఈవో భ్రమరాంబ స్వాగతం పలికారు. గవర్నర్ మాట్లాడుతూ అమ్మవారిని దర్శించుకుంటే సకల శుభాలు కలుగుతాయన్నారు. దుర్గమ్మను హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా సతీసమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు సీజే తెలిపారు.

నేడు బాలాత్రిపురసుందరిగా..



బెజవాడ ఇంద్రకీలాద్రిపై నిర్వహిస్తున్న దసరా మహోత్సవాల్లో రెండో రోజైన ఆశ్వయుజ శుద్ధ విదియ(మంగళవారం) నాడు శ్రీ బాలా త్రిపురసుందరీదేవిగా కనకదుర్గమ్మ భక్తులకు దర్శనమిస్తారు. దసరా ఉత్సవాలలో భక్తులకు పూర్ణఫలం అందించే అలంకారమే శ్రీ బాలాత్రిపుర సుందరీదేవి.

శైలపుత్రిగా శ్రీశైల భ్రామరి



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో దేవీ శరన్నవరాత్రులు వైభవంగా ప్రారంభమయ్యాయి. సోమవారం ఉదయం వేదమంత్రోచ్చారణల మధ్య శ్రీశైల దేవస్థాన ధర్మకర్తల మండలి అధ్యక్షుడు రెడ్డివారి చక్రపాణిరెడ్డి, ఈవో ఎస్.లవన్న, ధర్మకర్తల మండలి సభ్యులు, అర్చకులు, వేదపండితులు దసరా మహోత్సవాల ప్రారంభపూజలు నిర్వహించారు. అనంతరం భ్రమరాంబాదేవి ఉత్సవమూర్తిని శైలపుత్రిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను భృంగివాహనంపై ఆశీనుల్ని చేసి హారతులిచ్చారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. శైలపుత్రిగా అలంకృత అయిన అమ్మవారిని, భృంగివాహనాధీశులైన స్వామిఅమ్మవార్లను భక్తజనం దర్శించి తరించారు.

క్లుప్తంగా


అమరేశ్వరుని దర్శించుకున్న జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి



అమరావతి: ప్రముఖ శైవక్షేత్రమైన అమరావతిలో వేంచేసియున్న శ్రీ బాలచాముండికా సమేత అమరేశ్వరుని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి దంపతులు సోమవారం రాత్రి దర్శించుకున్నారు. అమరేశ్వరునికి, బాలచాముండేశ్వరి అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం జస్టిస్ శ్రీనివాసరెడ్డి దంపతులకు వేద పండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేష వస్త్రంతోపాటు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఎయిమ్స్ నీటి సమస్యను పరిష్కరించండి

- టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు



సాక్షి, అమరావతి: సీఎం జగన్ వైద్య రంగంపై బొంకుడు ప్రకటనలు మాని మంగళగిరి ఎయిమ్స్‌లో నీటి సమస్యను పరిష్కరించాలని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు విమర్శించారు. రాష్ట్రంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన మంగళగిరి ఎయిమ్స్‌కు కనీసం నీటి సరఫరా చేయలేని ప్రభుత్వాన్ని ఏమనాలని సోమవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. అతి తక్కువ ధరలో పేదలకు సూపర్ స్పెషాలిటీ సేవలు అందించే ఆస్పత్రికి నీళ్లు ఇవ్వలేనందుకు ప్రభుత్వం సిగ్గు పడాలన్నారు. మూడేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎయిమ్స్ కోసం ఏం చేసిందో చెప్పాలని కోరారు. తమ హయాంలో ఎయిమ్స్‌కు భూములు ఇచ్చి, వసతులు కల్పించి వైద్య సేవలకు ఈ ప్రతిష్టాత్మక సంస్థను సిద్ధం చేశామని తెలిపారు. అలాంటి సంస్థ పెరిగిన తమ అవసరాల కోసం అదనంగా నీటి వనరులను సమాకూర్చాలని లేఖలు రాసినా పరిష్కరించకపోవడం రాష్ట్ర ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని విమర్శించారు. రాష్ట్రంలో మెడికల్ కాలేజీలు అన్నీ తామే తెచ్చామని అసెంబ్లీలో సైతం అసత్యాలు చెప్పుకున్న ముఖ్యమంత్రి... తాను ఉంటున్న మున్సిపాలిటీ నుంచి ఆస్పత్రికి నీళ్లెందుకు ఇవ్వలేకపోతున్నారని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే ఎయిమ్స్‌కు అవసరమైన అన్ని అదనపు మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు.

ఎయిమ్స్‌కు మంగళగిరి మున్సిపాలిటీ నీరందిస్తోంది

- మంచినీటి సమస్య శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు
- కేంద్ర సహాయ మంత్రి నారాయణస్వామి స్పష్టీకరణ

సాక్షి, అమరావతి: మంగళగిరిలోని ఎయిమ్స్‌కు స్థానిక మున్సిపాలిటీ తాత్కాలికంగా మంచినీటిని సరఫరా చేస్తోందని, శాశ్వత ప్రాతిపదికన అందించేలా ప్రభుత్వం గట్టి చర్యలు చేపట్టిందని కేంద్ర సామాజిక న్యాయం, సాధికారిత శాఖ సహాయ మంత్రి ఎ.నారాయణస్వామి స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఎస్సీల అభివృద్ధి కార్యాచరణ ప్రణాళిక అమలుపై అమరావతిలోని సచివాలయంలో సోమవారం ఆయన సమీక్ష నిర్వహించారు. అనంతరం నారాయణస్వామి మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీ కార్యాచరణ ప్రణాళికలను వ్యవసాయ అనుబంధ శాఖలు, విద్య, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, స్త్రీ, శిశు సంక్షేమం, గృహ నిర్మాణం, గ్రామీణాభివృద్ధి, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం తదితర శాఖలు అమలు చేస్తున్న తీరు సంతృప్తికరంగా ఉందని చెప్పారు. రాష్ట్రంలోని శ్రీకాకుళం జిల్లా ఉద్దానం, ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు ప్రాంతాల్లో కిడ్నీ సమస్యలతో బాధపడేవారిలో ఎక్కువగా గిరిజనులే ఉన్నారన్నారు. కేంద్ర సామాజిక న్యాయం, సాధికారిత శాఖ అదనపు కార్యదర్శి సురేంద్ర సింగ్, రాష్ట్ర సాంఘిక, బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జి.జయలక్ష్మి, సంచాలకులు కె.హర్షవర్దన్ పాల్గొన్నారు.

రాజశ్యామల ఉపాసన కేంద్రం విశాఖ శారదాపీఠం

- పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి
- శారదాపీఠంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం
- బాలాత్రిపురసుందరీదేవిగా రాజ శ్యామల అమ్మవారు దర్శన



అమ్మవారికి పూజలు చేస్తున్న స్వరూపానందేంద్ర సరస్వతి స్వామి

సింహాచలం: తెలుగు రాష్ట్రాల్లో రాజశ్యామల అమ్మవారిని ఆరాధించే ఏకైక ఉపాసన కేంద్రంగా విశాఖ శ్రీశారదాపీఠం ఖ్యాతిగాంచిందని, రాజశ్యామల అమ్మవారి ఆరాధనతో ఎంతోమంది ఉన్నత స్థాయికి చేరుకున్నారని పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి చెప్పారు. విశాఖ జిల్లా చినముషిడివాడలోని శారదాపీఠంలో శరన్నవరాత్రి మహోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి ఈ మహోత్సవాలకు అంకురార్పణ చేశారు. ఈ సందర్భంగా స్వరూపానందేంద్ర సరస్వతి మాట్లాడుతూ రాజశ్యామల అమ్మవారిని ఏకాంతంగాను, అంతర్లీనంగాను ఉపాసించాలంటే అది కేవలం విశాఖ శ్రీశారదాపీఠంలోనే సాధ్యమని చెప్పారు. అమ్మవారి ఉత్సవాల్లో పాల్గొనే వారు అదృష్టవంతులవుతారన్నారు. స్వాత్మానందేంద్ర సరస్వతి మాట్లాడుతూ సాధారణ రోజుల్లోకన్నా నవరాత్రి ఉత్సవాల్లో అమ్మవారిని ఆరాధిస్తే వేయిరెట్లు ఫలితం సిద్ధిస్తుందని చెప్పారు. ఈవేడుకల్లో లోకకల్యాణార్థం చండీహోమం, చండీ పారాయణం, చతుర్వేద పారాయణం, రాజశ్యామల హోమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. జగన్మాత రాజశ్యామల అమ్మవారి ప్రీతికోసం శ్రీచక్రానికి నవావరణార్చన చేస్తున్నట్లు చెప్పారు. శరన్నవరాత్రి ఉత్సవాల అంకురార్పణ పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. తొలుత మహాగణపతిపూజ, చండీహోమం, రాజశ్యామల హోమాన్ని నిర్వహించే పండితులు దీక్షాధారణ చేశారు. తొలిరోజు సోమవారం శారదా స్వరూప రాజశ్యామల అమ్మవారు బాలాత్రిపురసుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

బ్రహ్మోత్సవాలకు పటిష్ట భద్రత: డీజీపీ



భద్రత ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీజీపీ

తిరుపతి క్రైం: కరోనా అనంతరం.. రెండేళ్ల తర్వాత భక్తుల మధ్య నిర్వహించే శ్రీవారి బ్రహ్మోత్సవాలకు పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేసినట్లు డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి చెప్పారు. ఆయన సోమవారం తిరుమలలోని మాడవీధులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మంగళవారం తిరుమలలో ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి గట్టి బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. బ్రహ్మోత్సవాలు ముగిసే వరకు రెండు ఘాట్‌రోడ్లను, తిరుమలను పోలీసులు జల్లెడ పడతారని, ఆక్టోపస్ సిబ్బంది ప్రత్యేక నిఘా ఉంటుందని చెప్పారు. బ్రహ్మోత్సవాలకు మొత్తం నాలుగు వేల మందితో భద్రత నిర్వహిస్తామని చెప్పారు. భక్తుల మధ్య తొక్కిసలాట లేకుండా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించినట్లు తెలిపారు. తిరుమల మొత్తం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, వాటిని కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. తిరుమలలో 38 పాయింట్లలో పార్కింగ్ ఏర్పాట్లు చేశామన్నారు.

వేదాలు మస్తిష్కంలో ఉండాలి

తుమ్మలగుంట వేద విద్యార్థులతో త్రిదండి చిన్నజీయర్‌స్వామి

తిరుపతి రూరల్: వేదాలు పుస్తకంలో కాదు మస్తిష్కంలో ఉండాలని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్‌స్వామి చెప్పారు. ఆయన సోమవారం తిరుపతి సమీపంలోని తుమ్మలగుంటలో స్థానిక ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఏర్పాటుచేసిన వేద పాఠశాలను సందర్శించారు. వేద విద్యార్థులతో మమేకమైన స్వామి వేద పఠనం, వేదాల ఆవశ్యకతను సమగ్రంగా వివరించారు. కంప్యూటర్ కంటే వేగంగా పనిచేసే మానవుని మేధస్సును తక్కువగా వినియోగించడం వల్ల చాలాభాగం పనికిరాకుండా పోతోందన్నారు. వేదాల్లో 1,131 శాఖలు ఉండేవని, కాలక్రమేణా 1,120 శాఖలు మరుగునపడి 11 శాఖలు మాత్రమే వినియోగంలో ఉన్నాయని చెప్పారు. మనిషికి భాష, వేషం ప్రధానమైన అంశాలన్నారు. ఎవరి నియమాలను వారు సక్రమంగా అనుసరించాలని సూచించారు. శ్రీవేంకటేశ్వరస్వామి అనుగ్రహం ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి మెండుగా ఉందని, అందువల్లే వేదాల పరిరక్షణ చేస్తూ సకల సౌకర్యాలతో వేద పాఠశాల నిర్వహిస్తున్నారని కొనియాడారు. వేదవిద్యను ఇతరులతో పంచుకోవాలని, అప్పుడే జ్ఞానం పెరుగుతుందని చెప్పారు. ఎలాంటి విద్యను అయినా వల్లించడం వల్ల మేధస్సు పెరుగుతుందన్నారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ వేద పాఠశాల నిర్వహణ స్వామి ఆశీస్సులతోనే జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ ఉన్నత వేదాధ్యయనాలసంస్థ ప్రత్యేక అధికారి విభీషణశర్మ, రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం పీఆర్వో విజయరాఘవన్, కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వరరెడ్డి, తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పాల్గొన్నారు.



చిన్నజీయర్‌స్వామికి స్వాగతం పలుకుతున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

కల్యాణ వెంకన్న సేవలో చిన్నజీయర్‌స్వామి

తుమ్మలగుంట వచ్చిన చిన్నజీయర్‌స్వామికి ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, ప్రభుత్వ విప్, తుడా చైర్మన్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. కల్యాణ వెంకన్న స్వామిని దర్శించుకున్న జీయర్‌స్వామిని చెవిరెడ్డి ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కరించారు.

ఎయిమ్స్‌కు చుక్కలు చూపింది చంద్రబాబే

- బాబు హయాంలో అభివృద్ధి గురించే పట్టించుకోలేదు
- అయినా ఈనాడుకు చీమ కుట్టినట్లు లేదు
- సీఎం జగన్ ఎయిమ్స్ అభివృద్ధికి కృషి చేస్తున్నారు
- ఇప్పుడు ప్రభుత్వంపై రామోజీ రావు దుష్ప్రచారం చేస్తున్నారు
- ఎయిమ్స్ కోరినంత నీటిని ఉచితంగా నిత్యం సరఫరా చేస్తున్నాం
- త్వరలో శాశ్వత నీటి సరఫరా పనులు ప్రారంభమవుతాయి
- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని



మాట్లాడుతున్న మంత్రి విడదల రజనీ, పక్కన వైద్య శాఖ ముఖ్య కార్యదర్శి రవిచంద్ర

సాక్షి, అమరావతి: చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు మంగళగిరి ఎయిమ్స్‌కు చుక్కలు చూపించారని, ఆ సంస్థ అభివృద్ధి గురించి పట్టించుకున్న పాపాన పోలేదని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. అయినా ఆనాడు ఈనాడుకు చీమకుట్టినట్లైనా లేదన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక ఎయిమ్స్ అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్నారని, అయినా ఈనాడు రామోజీరావు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. మంత్రి సోమవారం మంగళగిరిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఏదైనా సంస్థను ఏర్పాటు చేసేటప్పుడు మంచి నీరు, కరెంటు, రోడ్లు, డ్రెయినేజీ లాంటి మౌలిక వసతులు కల్పిస్తారని, గత టీడీపీ ప్రభుత్వం ఇందుకు విరుద్ధంగా వ్యవహరించిందని చెప్పారు. 2014 – 19 మధ్య కేంద్ర ప్రభుత్వం ఎయిమ్స్ ఏర్పాటుకు భవనాలు నిర్మిస్తుంటే అప్పటి సీఎం చంద్రబాబు అటువైపు కన్నెత్తి చూడలేదని చెప్పారు. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎయిమ్స్‌కు సరిపడా మంచి నీరందించేందుకు తాత్కాలికంగా చేయాల్సిందంతా చేస్తూనే, శాశ్వతంగా నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రోజుకు మూడు లక్షల లీటర్ల నీరు కావాలని ఎయిమ్స్ నుంచి మొదట్లో అభ్యర్థన వచ్చిందన్నారు. ఆమేరకు రోజుకు 3.20 లక్షల లీటర్ల నీటిని మంగళగిరి–తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ నుంచి ఉచితంగా సరఫరా చేస్తున్నామని తెలిపారు. మరో లక్ష లీటర్ల నీటిని కూడా అందుబాటులో ఉంచామన్నారు. ఎయిమ్స్ విస్తరణలో భాగంగా రోజుకు అదనంగా మరో 3 లక్షల లీటర్లు అవసరమని కోరగా, ఈ నీటిని విజయవాడ కార్పొరేషన్ నుంచి అదనంగా అందజేస్తున్నామన్నారు. అందుకయ్యే ఖర్చంతా ప్రభుత్వమే భరిస్తోందన్నారు. ఎయిమ్స్ నీటి సమస్యకు శాశ్వత పరిష్కారంలో భాగంగా రూ. 7.74 కోట్లతో ఆత్మకూరు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నుంచి రోజుకు 25 లక్షల లీటర్ల నీటిని సరఫరా చేసేందుకు టెండర్లు పిలిచామన్నారు. ఇందుకు జూలై 26న జీవో సం.534 విడుదల చేశామన్నారు. అతి త్వరలోనే పనులు కూడా ప్రారంభమవుతాయని తెలిపారు. విద్యుత్ సరఫరాకు రూ. 35 కోట్లతో 132 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేశామన్నారు. ఎయిమ్స్‌కు జాతీయ రహదారి నుంచి, మంగళగిరి నుంచి నేరుగా రెండు ప్రధాన రహదారులు నిర్మించామన్నారు. సైన్ బోర్డులు కూడా ఏర్పాటు చేశామన్నారు. ఇందుకు రూ.10 కోట్లకు పైనే ఖర్చయిందన్నారు. ఎయిమ్స్‌లో పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభమయ్యేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుందని తెలిపారు. 2014–19 మధ్య ఎయిమ్స్‌కు చుక్కలు చూపిన బాబు సర్కార్‌పై ఒక్క వార్త కూడా రాయని రామోజీరావు... తమ ప్రభుత్వం మంచి చేస్తున్నా అబద్ధాలు రాయడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో వైద్య శాఖ ముఖ్య కార్యదర్శి రవిచంద్ర కూడా పాల్గొన్నారు.

ఆర్థిక అభివృద్ధికి చేయూత

- మంత్రి మేరుగు నాగార్జున

వేమూరు: మహిళల ఆర్థిక అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం వైఎస్సార్ చేయూత కార్యక్రమాన్ని అమలు చేస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున చెప్పారు. బాపట్ల జిల్లా అమర్తలూరులో సోమవారం వైఎస్సార్ చేయూత పథకం కింద మహిళలకు ఆయన చెక్కు పంపిణీ చేశారు. సీఎం వైఎస్ జగన్ చిత్ర పటానికి మంత్రి, మహిళలు క్షీరాభిషేకం చేశారు. నాగార్జున మాట్లాడుతూ వైఎస్సార్ చేయూత పథకం కింద మహిళల అకౌంట్లలో మూడో ఏడాది డబ్బులు జమ చేసినట్లు తెలిపారు.



సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి మహిళల క్షీరాభిషేకం

వైఎస్సార్ విగ్రహాన్ని తాకే దమ్ముందా?

- టీడీపీకి మాజీ మంత్రి కురసాల కన్నబాబు సవాల్

కాకినాడ రూరల్: తాము అధికారంలోకి వస్తే వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలన్నింటినీ బంగాళాఖాతంలో పడేస్తామంటున్న టీడీపీ నేతలకు దమ్ముంటే వైఎస్సార్ విగ్రహాన్ని తాకి చూడాలని మాజీ మంత్రి కురసాల కన్నబాబు సవాల్ చేశారు. ప్రజలు 2019లోనే టీడీపీని బంగాళాఖాతంలోకి విసిరేశారని చెప్పారు. తూర్పు గోదావరి జిల్లా టీడీపీ ఇన్‌చార్జి, మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, ఆ పార్టీ నాయకులు చాలా ఎక్కువగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు తదితరులతో కలసి కన్నబాబు సోమవారం కాకినాడలో మీడియాతో మాట్లాడారు. 'టీడీపీ అధికారంలో ఉండగా విజయవాడలో కుట్రపూరితంగా కంట్రోల్ రూమ్ సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహాన్ని క్రేన్లతో తొలగించడంతో మీ బతుకు 23 సీట్లకే పరిమితమైంది. వైఎస్సార్ అంటే వ్యక్తి కాదు.. ఈ రాష్ట్రంలో ఒక శక్తి. ఎన్టీఆర్‌పై నిజంగానే అభిమానం ఉంటే 14 ఏళ్లు అధికారంలో ఉన్న చంద్రబాబు ఒక్క జిల్లాకైనా ఆయన పేరు పెట్టారా? హెల్త్ యూనివర్సిటీ పేరు మార్చారని మొసలికన్నీరు కారుస్తున్న చంద్రబాబు పోలవరం, ఆరోగ్యశ్రీ పేర్లను మార్చలేదా? పాదయాత్ర పేరుతో ప్రాంతీయ విద్వేషాలను చంద్రబాబు రేకెత్తిస్తున్నారు. మహిళలు తొడ కొట్టడం ఏమిటీ..' అని కన్నబాబు అన్నారు.



వైఎస్సార్‌తో ఎన్టీఆర్‌కు పోలికేలేదు

- సీఎంగా రెండుసార్లు వెన్నుపోట్లు పొడిపించుకున్న నేత ఎన్టీఆర్
- పాదయాత్ర పేరుతో ప్రజలను రెచ్చగొడుతున్న టీడీపీ
- మంత్రి దాడిశెట్టి రాజా ఫైర్

తొండంగి: పేదలకు సంక్షేమం అందించి దేశ చరిత్రలో గొప్ప ముఖ్యమంత్రిగా పేరొందిన దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి.. ముఖ్యమంత్రి పదవిలో ఉండగా రెండుసార్లు వెన్నుపోట్లు పొడిపించుకున్న ఎన్టీఆర్‌కు ఎలాంటి పోలికేలేదని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. కాకినాడ జిల్లా తొండంగి మండలంలో నాడు–నేడు కింద రూ.3.10 కోట్లతో నిర్మించిన పీహెచ్‌సీ భవనాలను సోమవారం ఎంపీ వంగా గీతతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో మంత్రి మాట్లాడారు. వారం రోజులుగా రాష్ట్రంలో రాజశేఖర్‌రెడ్డితో ఎన్టీ రామారావును పోలుస్తూ చర్చలు జరుగుతున్నాయని.. తన అభిప్రాయం ప్రకారం వారిద్దరికీ ఎలాంటి పోలికా లేదన్నారు. ముఖ్యమంత్రిగా ఉండగా నాదెండ్ల భాస్కరరావుతోనూ, అల్లుడు చంద్రబాబుతోనూ వెన్నుపోట్లు పొడిపించుకుని చేతగాని అసమర్థునిగా ఎన్టీఆర్ చరిత్రలో నిలిచారన్నారు. ఇక ప్రస్తుత సీఎం వైఎస్ జగన్ నాడు–నేడు ద్వారా విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యతనిచ్చి కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా అభివృద్ధి చేస్తున్నారన్నారు.



పీహెచ్‌సీ భవనం ప్రారంభిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

పాదయాత్ర ముసుగులో వెకిలివేషాలు

అమరావతి రైతుల రూపంలో అమరావతి రియల్ ఎస్టేట్ మేళం రాష్ట్రంలో ప్రతీ నియోజకవర్గం తిరుగుతోందన్నారు. చంద్రబాబునాయుడు ఈ మేళాన్ని ప్రతీ నియోజకవర్గంలో తిప్పుతూ చిల్లరగా వ్యంగ్యంగా తొడలు కొడుతూ ప్రజల మనోభావాలు దెబ్బతినే విధంగా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. వారెన్ని వెకిలి వేషాలు వేసినా ప్రజలంతా సంయమనంతో భరిస్తున్నారన్నారు. ప్రజల ఆకాంక్ష మేరకు రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఆ దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అడుగులేస్తున్నారన్నారు.

జంబలకిడిపంబ పార్టీగా టీడీపీ

- అందులో ఆడవాళ్లు తొడలు కొడతారు, మగవాళ్లు ఏడుస్తారు
- రాష్ట్రంలో చంద్రబాబు నెగ్గేదిలేదు.. జగనన్న తగ్గేదిలేదు
- రాష్ట్ర పర్యాటక మంత్రి ఆర్‌కే రోజా



మాట్లాడుతున్న మంత్రి ఆర్కే రోజా, వేదికపై మంత్రులు ఆదిమూలపు సురేష్, అంజద్ బాషా

యర్రగొండపాలెం: తెలుగుదేశం పార్టీలో ఆడవాళ్లు తొడలు కొడతారు, మగాళ్లు ఏడుస్తారని.. అది జంబలకిడిపంబ పార్టీలా తయారైందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, క్రీడల శాఖ మంత్రి ఆర్కే రోజా ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో అలజడి సృష్టించటానికే రైతుల పేరుతో టీడీపీ పాదయాత్ర చేయిస్తోందని.. రైతులు ఎక్కడైనా వాకీటాకీలు, ఐఫోన్లు పెట్టుకుని తొడలు కొట్టడం చూశారా అని ప్రశ్నించారు. ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రూ.2కోట్లతో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ క్రీడా వికాస కేంద్రాన్ని సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభకు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అధ్యక్షత వహించారు. ఉప ముఖ్యమంత్రి షేక్ అంజాద్‌బాషా, జెడ్పీ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ పాల్గొన్నారు. మంత్రి రోజా మాట్లాడుతూ.. ఇచ్చిన హామీలను సీఎం జగన్ నిజాయితీగా నెరవేరుస్తుంటే దుష్టచతుష్టయం జగనన్నపై విషం చిమ్ముతోందని ఆమె మండిపడ్డారు. ఇప్పటికైనా టీడీపీ నీచరాజకీయాలు మాని ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టాలని ఆమె హితవు పలికారు. పచ్చ ఛానళ్లు, పచ్చ పత్రికలు చంద్రబాబుకు, లోకేశ్‌కు వత్తాసు పలుకుతూ, ప్రజలకు మేలుచేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని ఇంటికి పంపించాలని, చంద్రబాబును ముఖ్యమంత్రి చేయాలని పగటి కలలు కంటున్నాయని విమర్శించారు. వారి కలలకు ఫుల్‌స్టాప్ పెట్టాలంటే చంద్రబాబుకు అక్కాచెల్లెళ్లు కొట్టే దెబ్బ వారికి అబ్బా అనిపించేలాగా ఉండాలన్నారు. ఈసారి కుప్పంలో కూడా టీడీపీ గెలిచే పరిస్థితిలేదని రోజా అన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రతి నియోజకవర్గంలో ఎగిరేది వైఎస్సార్‌సీపీ జెండానేనని ఆమె అన్నారు.

బాబు చేయలేనిది జగన్ చేశారు

ఏ రాష్ట్రంలో చేయని విధంగా వైఎస్ జగన్ సుపరిపాలన చేశారు కాబట్టే తాము కాలర్ ఎగరేసి వెళ్తున్నామని రోజా ధీమాగా చెప్పారు. 'రాబోయే ఎన్నికల్లో నీవు నెగ్గేదిలేదు, జగనన్న తగ్గేదిలేదని'' ఆమె చంద్రబాబును ఉద్దేశించి వ్యాఖ్యానించారు. 30 ఏళ్లలో చంద్రబాబు చేయలేనిది మూడేళ్లలో జగన్ చేసిచూపించి దేశంలోనే బెస్ట్ సీఎంగా నిలిచారన్నారు. ఇక 29 గ్రామాల కోసం 26 జిల్లాలకు అన్యాయం చేయటానికి జగనన్న ఒప్పుకోరని, అన్ని ప్రాంతాలు అభివృద్ధి చేయాలన్నదే తమ ప్రభుత్వం లక్ష్యమని రోజా స్పష్టంచేశారు. సభలో కలెక్టర్ దినేష్‌కుమార్‌తోపాటు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



మారథాన్‌లో కిప్‌చోగె కొత్త ప్రపంచ రికార్డు

కెన్యా దిగ్గజ అథ్లెట్, ఒలింపిక్ చాంపియన్ ఎలీడ్ కిప్‌చోగె మారథాన్‌లో తన పేరిట కొత్త ప్రపంచ రికార్డును లిఖించుకున్నాడు. ప్రతిష్టాత్మక బెర్లిన్ మారథాన్‌లో 37 ఏళ్ల కిప్‌చోగె 42.195 కిలోమీటర్ల దూరాన్ని 2 గంటల 1 నిమిషం 9 సెకన్లలో పూర్తి చేసి కొత్త ప్రపంచ రికార్డు సృష్టించాడు. 2018 బెర్లిన్ మారథాన్‌లోనే 2 గంటల 1 నిమిషం 39 సెకన్లతో తానే నెలకొల్పిన ప్రపంచ రికార్డును కిప్‌చోగె సవరించాడు.



మళ్లీ భారత నంబర్‌వన్‌గా అంకిత

గతవారం కొరియా ఓపెన్‌లో ప్రిక్వార్టర్ ఫైనల్ చేరిన భారత అగ్రశ్రేణి క్రీడాకారిణి అంకిత రైనా మహిళల టెన్నిస్ సంఘం (డబ్ల్యూటీఏ) తాజా ర్యాంకింగ్స్‌లో పురోగతి సాధించింది. సోమవారం విడుదల చేసిన ఈ ర్యాంకింగ్స్‌లో 29 ఏళ్ల అంకిత 55 స్థానాలు ఎగబాకి 274వ ర్యాంక్‌కు చేరుకుంది. అంతేకాకుండా వారం వ్యవధిలోనే మళ్లీ భారత నంబర్‌వన్ ర్యాంకర్‌గా నిలిచింది. వారంరోజులపాటు భారత నంబర్‌వన్‌గా నిలిచిన కర్మన్‌కౌర్ ఒక స్థానం పడిపోయి 323వ ర్యాంక్‌లో నిలిచింది.

30 నుంచి ఆలిండియా ఫిడే రేటింగ్ చెస్ టోర్నీ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర చెస్ సంఘం (టీఎస్‌సీఏ) ఆధ్వర్యంలో ఈనెల 30 నుంచి అక్టోబర్ 4 వరకు హైదరాబాద్ ఆలిండియా ఫిడే రేటింగ్ చెస్ టోర్నీ జరగనుంది. సఫిల్‌గూడలోని డీఏవీ పబ్లిక్ స్కూల్‌లో ఈ టోర్నీని నిర్వహిస్తారు. విజేతకు రూ. 40 వేలు ప్రైజ్‌మనీ అందజేస్తారు. టాప్–65లో నిలిచిన వారందరికీ నగదు పురస్కారాలు ఉంటాయి. తొమ్మిది రౌండ్లపాటు జరిగే ఈ టోర్నీలో ఎవరైనా పాల్గొనవచ్చు. ఆసక్తిగలవారు 7337578899 లేదా 7337399299 ఫోన్ నంబర్లలో నిర్వాహకులను సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలి. ఎంట్రీలను ఈనెల 27వ తేదీలోపు ఖరారు చేయాలని, స్పాట్ ఎంట్రీలను స్వీకరించబోమని టీఎస్‌సీఏ అధ్యక్షుడు కేఎస్ ప్రసాద్ తెలిపారు.

ముహూర్తం ఖరారు

అక్టోబర్ 18న బీసీసీఐ ఎన్నికలు

ముంబై: ప్రపంచ క్రికెట్‌లో అత్యంత ధనిక బోర్డులో ఎన్నికలకు నగారా మోగింది. భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ)లోని పదవుల కోసం అక్టోబర్ 18న ఎన్నికలు జరపనున్నట్లు బోర్డు ఎన్నికల అధికారి ప్రకటించారు. అదే రోజు బీసీసీఐ వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం) కూడా నిర్వహిస్తారు. భారత ఎలక్షన్ కమిషన్ మాజీ చీఫ్ కమిషనర్ ఏకే జోటి దీనికి ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తున్నారు. నోటిఫికేషన్ జారీ చేసిన ఆయన ఈ వివరాలను ఇప్పటికే బీసీసీఐ పరిధిలోని రాష్ట్ర క్రికెట్ సంఘాలకు అందించారు. వీరంతా తమ సంఘం తరఫు నుంచి ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థుల వివరాలను బోర్డుకు పంపించాలని ఆయన కోరారు. గతంలో ఎన్నికల ప్రక్రియలో వివాదాలు నెలకొన్న నేపథ్యంలో ప్రస్తుతం అమలులో ఉన్న అన్ని నిబంధనల ప్రకారం అర్హత ఉన్నవారే బరిలోకి దిగాలని కూడా ఎన్నికల అధికారి ప్రత్యేకంగా సూచించారు. బోర్డు నియమావళి ప్రకారం ఐదు కీలకమైన ఆఫీస్ బేరర్ పదవులకు (అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి, కోశాధికారి) ఎన్నికలు జరుగుతాయి. దీంతో పాటు ఒక అపెక్స్ కౌన్సిల్ సభ్యుడిని, ఇద్దరు గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులను కూడా ఎన్నుకుంటారు. అక్టోబర్ 11, 12 తేదీల్లో దరఖాస్తులు స్వీకరించనుండగా... 18న ఎన్నికలు జరిపి అదే రోజు ఫలితాలు ప్రకటిస్తారు. ఇప్పటికే బీసీసీఐ ఎన్నికల ప్రక్రియ ముగియాల్సి ఉన్నా... వివిధ అంశాలపై సుప్రీం కోర్టు నుంచి స్పష్టత కోరుతూ బోర్డు ఇప్పటి వరకు ఆగింది. ఇటీవల సుప్రీం కోర్టులో దీనికి సంబంధించి కీలక ఆదేశాలు రావడంతో మార్గం సుగమమైంది. ప్రస్తుత బీసీసీఐ అధ్యక్ష, కార్యదర్శులుగా ఉన్న సౌరవ్ గంగూలీ, జై షా అదే పదవుల కోసం బరిలో ఉంటారా... లేక వీరిలో ఒకరు ఐసీసీ వైపు వెళ్లి కొత్త వారు ఆ పదవిలో వస్తారా వేచి చూడాలి.



గంగూలీ
జై షా

హార్దిక్‌కు విశ్రాంతి దీపక్ హుడాకు గాయం

ఆల్‌రౌండర్ షహబాజ్ అహ్మద్‌కు చోటు


షహబాజ్

న్యూఢిల్లీ: దక్షిణాఫ్రికాతో రేపటి నుంచి జరగాల్సిన మూడు టి20 మ్యాచ్‌ల సిరీస్‌లో పాల్గొనేందుకు ముందుగా ఎంపిక చేసిన భారత జట్టులో రెండు మార్పులు చోటు చేసుకున్నాయి. ఆస్ట్రేలియాతో జరిగిన సిరీస్‌లో ఆడిన ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యాకు దక్షిణాఫ్రికాతో సిరీస్ కోసం విశ్రాంతి ఇవ్వగా... దీపక్ హుడా వెన్నెముక గాయంతో దూరమయ్యాడు. కరోనా నుంచి ఇంకా కోలుకోకపోవడంతో మొహమ్మద్ షమీ దక్షిణాఫ్రికాతో సిరీస్‌కు అందుబాటు ఉండటంలేదు. హార్దిక్ పాండ్యా స్థానంలో బెంగాల్ ఆల్‌రౌండర్ షహబాజ్ అహ్మద్‌ను, దీపక్ హుడా స్థానంలో శ్రేయస్ అయ్యర్‌ను దక్షిణాఫ్రికాతో సిరీస్‌కు ఎంపిక చేశారు. 27 ఏళ్ల షహబాజ్ అహ్మద్ ఈ ఏడాది ఐపీఎల్ టోర్నీలో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు తరఫున నిలకడగా రాణించిన ఆకట్టుకున్నాడు. షహబాజ్ 16 మ్యాచ్‌లు ఆడి 219 పరుగులు సాధించి నాలుగు వికెట్లు తీశాడు. బుధవారం తిరువనంతపురంలో భారత్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య తొలి టి20 మ్యాచ్ జరగనుంది. మరోవైపు అక్టోబర్ 1 నుంచి 5 వరకు రాజ్‌కోట్‌లో జరిగే ఇరానీ కప్ మ్యాచ్‌లో సౌరాష్ట్రతో పోటీపడే రెస్టాఫ్ ఇండియా జట్టుకు ఆంధ్ర క్రికెటర్ హనుమ విహారి కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు.

కార్తీక్‌కు అవకాశం ఇవ్వడం అవసరం

కెప్టెన్ రోహిత్ శర్మ వ్యాఖ్య

సాక్షి, హైదరాబాద్: ఆసియా కప్ నుంచి ఆస్ట్రేలియాతో జరిగిన సిరీస్ వరకు ఒకే స్థానం కోసం కీపర్ దినేశ్ కార్తీక్, రిషభ్ పంత్ మధ్య పోటీ కొనసాగుతోంది. ఆసియా కప్‌లో పంత్‌కు అవకాశం దక్కగా, ఆసీస్‌తో మూడు మ్యాచుల్లోనూ కార్తీక్ బరిలోకి దిగాడు. వీరిద్దరు కలిసి ఒక మ్యాచ్ ఆడారు. అయితే మూడు మ్యాచ్‌లు కలిపినా కార్తీక్ మొత్తం ఆడింది 7 బంతులే. అందుకే ప్రపంచకప్‌కు ముందు అతనికి మరింత ఎక్కువ అవకాశాలు ఇవ్వాలని భారత కెప్టెన్ రోహిత్ శర్మ భావిస్తున్నాడు. ఇదే విషయాన్ని అతను ఆస్ట్రేలియాతో సిరీస్ నెగ్గిన అనంతరం స్పష్టం చేశాడు. 'ప్రపంచకప్‌కు ముందు వీరిద్దరు కూడా సాధ్యమైనన్ని ఎక్కువ మ్యాచ్‌లు ఆడాలని నేను కోరుకుంటున్నా. అయితే పంత్‌తో పోలిస్తే కార్తీక్ మరింత ఎక్కువ సేపు క్రీజ్‌లో గడపడం అవసరం. ఈ సిరీస్‌లో అతనికి దాదాపుగా బ్యాటింగ్ అవకాశమే రాలేదు. అందుకే అతడిని ఎక్కువగా ఆడిస్తున్నాం' అని రోహిత్ వ్యాఖ్యానించాడు. రాబోయే దక్షిణాఫ్రికా సిరీస్‌లో కూడా వీరిద్దరు విషయంలో ఎలాంటి వ్యూహం అనుసరిస్తానో ఇప్పుడే చెప్పలేనని రోహిత్ అన్నాడు. 'ప్రత్యర్థి జట్టు బౌలింగ్‌ను బట్టి మా ప్రణాళిక ఉంటుంది. ఎడంచేతి వాటం బ్యాటర్ అవసరమైతే పంత్‌ను, కుడిచేతి వాటం బ్యాటర్ అవసరమైతే కార్తీక్‌ను ఆడిస్తాం. పరిస్థితిని బట్టి ప్రణాళికలు ఉంటాయి. అయితే అందరినీ తగిన విధంగా వాడుకుంటాం. వరల్డ్‌కప్‌కు ముందు చాలా తక్కువ మ్యాచ్‌లే ఉన్నాయని తెలుసు. కానీ ఆడేది 11 మందే కదా' అని రోహిత్ చెప్పాడు.



'అప్పటికే పలుమార్లు హెచ్చరించాం'

రనౌట్ వివాదంపై దీప్తి శర్మ వివరణ

కోల్‌కతా: మూడో వన్డేలో ఇంగ్లండ్ చివరి బ్యాటర్ చార్లీ డీన్‌ను భారత బౌలర్ దీప్తి శర్మ రనౌట్ చేసిన తీరు వివాదంపై మ్యాచ్ ముగిసిన తర్వాత తీవ్ర చర్చ జరిగింది. దీప్తి బంతి వేయకముందే డీన్ క్రీజ్ దాటడంతో నిబంధనల ప్రకారం దీప్తి ఆమెను రనౌట్ చేసినా... మరోసారి క్రీడాస్ఫూర్తి అంశం ముందుకు వచ్చింది. దీనిపై కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ఇప్పటికే వివరణ ఇచ్చినా దీప్తి శర్మ కూడా స్పందించింది. రిటైర్ అయిన పేసర్ జులన్ గోస్వామితో పాటు దీప్తికి స్వదేశం తిరిగొచ్చిన అనంతరం కోల్‌కతా విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. 'రనౌట్ విషయంలో మేం వ్యూహంతో సిద్ధమయ్యాం. మేం ఎన్నిసార్లు హెచ్చరించినా ఆమె మళ్లీ మళ్లీ క్రీజ్ దాటి ముందుకు వెళ్లింది. ఆ విషయాన్ని అంపైర్లకు కూడా చెప్పాం. అయినా ఆమె తీరు మార్చుకోలేదు. దాంతో నిబంధనల ప్రకారమే అవుట్ చేశాం. మేం ఇంకేం చేయగలం' అని దీప్తి వివరణ ఇచ్చింది. దీప్తి వ్యాఖ్యలపై ఇంగ్లండ్ కెప్టెన్ హీతర్ నైట్ మళ్లీ స్పందించింది. 'మ్యాచ్ ముగిసిపోయింది. నిబంధనల ప్రకారమే చార్లీ అవుటైంది. మ్యాచ్‌తోపాటు సిరీస్ గెలిచేందుకు భారత్‌కు అన్ని విధాలా అర్హత ఉంది. అయితే రనౌట్ గురించి మమ్మల్ని హెచ్చరించారనడంలో వాస్తవం లేదు. నిజానికి వారు చేసింది తప్పు కాదు కాబట్టి హెచ్చరించాల్సిన అవసరం లేదు. కానీ తాము చేసిన దానిని సమర్థించుకోవాలని, అందుకు హెచ్చరిక అనే ఒక అబద్ధాన్ని వాడుకోవాలని కూడా భారత్ భావించరాదు' అని నైట్ వ్యాఖ్యానించింది.



తానియా గదిలో చోరీ...



వన్డే సిరీస్‌లో భారత జట్టు సభ్యురాలిగా ఉన్న తానియా భాటియాకు అనూహ్య పరిణామం ఎదురైంది. లండన్‌లో ఆమె బస చేసిన మారియట్ హోటల్‌లోని తన గదిలో దొంగతనం జరిగినట్లు ఆమె వెల్లడించింది. 'నన్ను చాలా నిరాశకు గురి చేసిన, నిర్ఘాంతపోయే ఘటన ఇది. ఎవరో అపరిచితులు నా గదిలోకి వచ్చి బ్యాగ్ చోరీ చేశారు. ఇందులో నగదు, కార్డులు, గడియారాలతో పాటు నగలు కూడా ఉన్నాయి. ఇంగ్లండ్ బోర్డుతో భాగస్వామ్యం ఉన్న హోటల్‌లోనే ఇలా జరిగింది. భద్రతా ఏర్పాట్ల వైఫల్యం ఇది. వీలైనంత తొందరగా విచారణ జరిపి తగిన చర్య తీసుకుంటారని భావిస్తున్నా' అని తానియా ట్వీట్ చేసింది.

సెంచరీ దిశగా గిల్



హోవ్: ఇంగ్లండ్ కౌంటీ క్రికెట్ చాంపియన్‌షిప్‌లో భారత ప్లేయర్ శుబ్‌మన్ గిల్ ఆకట్టుకునే ప్రదర్శన చేశాడు. ససెక్స్ జట్టుతో సోమవారం మొదలైన డివిజన్–2 నాలుగు రోజుల మ్యాచ్‌లో గ్లామోర్గన్ జట్టుకు ఆడుతున్న శుబ్‌మన్ గిల్ (102 బంతుల్లో 91 బ్యాటింగ్; 11 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీకి చేరువయ్యాడు. మరో తొమ్మిది పరుగులు సాధిస్తే గిల్ శతకం పూర్తవుతుంది. వెలుతురు మందగించి తొలి రోజు ఆటను నిలిపివేసే సమయానికి గ్లామోర్గన్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 41.2 ఓవర్లలో మూడు వికెట్లకు 221 పరుగులు సాధించింది. ఓపెనర్ డేవిడ్ లాయిడ్ (64 బంతుల్లో 56; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీ చేశాడు. ప్రస్తుతం గిల్‌తోపాటు బిల్లీ రూట్ (17 బ్యాటింగ్; 3 ఫోర్లు) క్రీజులో ఉన్నాడు.


ఆస్ట్రేలియాపై నెగ్గిన టి20 సిరీస్ ట్రోఫీతో భారత జట్టు

ఐసీసీ టి20 ర్యాంకింగ్స్: 'టాప్'లోనే భారత్

దుబాయ్: ప్రపంచ చాంపియన్ ఆస్ట్రేలియాపై టి20 సిరీస్‌ను గెల్చుకున్న భారత జట్టు అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) టీమ్ ర్యాంకింగ్స్‌లో తన టాప్ ర్యాంక్‌ను పటిష్టం చేసుకుంది. సోమవారం విడుదల చేసిన టీమ్ ర్యాంకింగ్స్‌లో రోహిత్ శర్మ బృందం 268 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. 261 పాయింట్లతో ఇంగ్లండ్ రెండో స్థానంలో ఉండగా... 258 పాయింట్లతో దక్షిణాఫ్రికా, పాకిస్తాన్ సంయుక్తంగా మూడో స్థానంలో ఉన్నాయి. ఇంగ్లండ్‌తో ఏడు టి20 మ్యాచ్‌ల సిరీస్‌లో మిగిలిన మూడు మ్యాచ్‌ల్లో పాకిస్తాన్ గెలిస్తే రెండో ర్యాంక్‌కు ఎగబాకే అవకాశం ఉంది. 252 పాయింట్లతో న్యూజిలాండ్ ఐదో స్థానంలో నిలిచింది. 250 పాయింట్లతో ఆరో ర్యాంక్‌లో ఉన్న ఆస్ట్రేలియా సొంతగడ్డపై ప్రపంచకప్‌నకు ముందు వెస్టిండీస్‌తో రెండు, ఇంగ్లండ్‌తో మూడు టి20 మ్యాచ్‌లు ఆడనుంది.

సినిమా


మహేశ్‌బాబు

అయోధ్యలో అర్జునుడు?

'అతడు'(2005), 'ఖలేజా' (2010) చిత్రాల తర్వాత హీరో మహేశ్‌బాబు, దర్శకుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో మరో సినిమా తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. పూజా హెగ్డే హీరోయిన్. హారిక అండ్ హాసినీ క్రియేషన్స్ పతాకంపై చినబాబు (ఎస్.రాధాకృష్ణ) నిర్మిస్తున్న ఈ మూవీ తొలి షెడ్యూల్ షూటింగ్ పూర్తయింది. దసరా తర్వాత ప్రారంభమయ్యే మలి షెడ్యూల్‌లో మహేశ్, పూజలపై సన్నివేశాలు చిత్రీకరించనున్నారు. ఈ సినిమా టైటిల్‌గా గతంలో 'పార్థు', 'అర్జునుడు' అనే పేర్లు తెరపైకి వచ్చాయి. తాజాగా 'అయోధ్యలో అర్జునుడు' అనే టైటిల్‌ను యూనిట్ పరిశీలిస్తోందని టాక్. త్రివిక్రమ్ దర్శకత్వంలో వచ్చిన గత నాలుగు చిత్రాలు (అఆ, అజ్ఞాత వాసి, అరవిందసమేత వీర రాఘవ, అల..వైకుంఠపురములో..) టైటిల్స్ 'అ' అక్షరంతోనే మొదలయ్యాయి. దీంతో మహేశ్, త్రివిక్రమ్ కాంబినేషన్‌లోని తాజా చిత్రం టైటిల్ కూడా 'అ' తోనే మొదలవుతుందనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. వచ్చే ఏడాది ఏప్రిల్ 28న ఈ చిత్రాన్ని రిలీజ్ చేస్తున్నట్లు యూనిట్ ప్రకటించింది.


ప్రభాస్


సంజయ్‌దత్

ప్రభాస్‌తో సంజూ భాయ్!

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, బాలీవుడ్ స్టార్ సంజయ్ దత్(అభిమానులు ముద్దుగా సంజూభాయ్ అని పిలుస్తారు) స్క్రీన్ షేర్ చేసుకోనున్నారా? అంటే అవుననే అంటున్నాయి ఫిల్మ్‌నగర్ వర్గాలు. ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో 'రాజాడీలక్స్' (ప్రచారంలో ఉన్న టైటిల్) అనే సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్ నిర్మించనున్న ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ త్వరలో స్టార్ట్ కానుంది. అయితే ఈ మూవీలోని ఓ కీలక పాత్ర కోసం సంజయ్ దత్‌ను సంప్రదించారట మారుతి. హారర్ అండ్ కామెడీగా తెరకెక్కనున్న ఈ సినిమాలో సంజయ్ దత్ నటిస్తారా? లేదా? వేచిచూడాలి.

టీజర్ రెడీ...

ప్రభాస్ హీరోగా నటించిన మరో చిత్రం 'ఆదిపురుష్'. ఓం రౌత్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం వచ్చే ఏడాది జనవరి 12న విడుదల కానుంది. కాగా ఈ సినిమా టీజర్‌ని అక్టోబరు 2న విడుదల చేయనున్నారని టాక్. మైథలాజికల్ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందిన ఈ చిత్రంలో రాముడిగా ప్రభాస్, సీతగా కృతీసనన్, లక్ష్మణుడిగా సన్నీసింగ్, రావణుడిగా సైఫ్ అలీఖాన్ నటించారు.


కమల్‌హాసన్

లొకేషన్ షిఫ్ట్

కమల్‌హాసన్ హీరోగా రూపొందుతున్న తాజా చిత్రం 'ఇండియన్ 2'. శంకర్ దర్శకత్వం వహిస్తున్నారు. 1996లో వీరి కాంబినేషన్‌లో వచ్చిన 'ఇండియన్' (తెలుగులో 'భారతీయుడు') సినిమాకు ఇది సీక్వెల్. ఇందులో కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఇటీవల చెన్నైలో ఓ షెడ్యూల్ పూర్తి చేసుకున్న ఈ సినిమా కొత్త షెడ్యూల్ తిరుపతిలో ప్రారంభం అయిందని సమాచారం. ఈ కొత్త షెడ్యూల్‌లో కమల్‌హాసన్, కాజల్‌లపై కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నారు. ప్రసవం అనంతరం కాజల్ మళ్లీ షూటింగ్‌లో పాల్గొంటున్న సినిమా ఇదే. ఈ చిత్రంలో సిద్ధార్థ్, రకుల్ ప్రీత్‌సింగ్, బాబీ సింహా కీలక పాత్రలు పోషిస్తున్నారు. అనిరుధ్ రవిచంద్రన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది విడుదల కానుంది.

మన ఇంటి కథలా ఉంటుంది

– బెల్లంకొండ గణేష్


నాగవంశీ, వర్ష, గణేశ్, లక్ష్మణ్

''స్వాతిముత్యం' లో నన్ను నేను మొదటిసారి బిగ్ స్క్రీన్‌పై చూసుకుంటే టెన్షన్‌గా ఉంది. ట్రైలర్‌లో చూసినట్టుగానే ఈ సినిమా చాలా సరదాగా మన ఇంట్లోనో, మన పక్కింట్లోనో జరిగే కథలాగా ఉంటుంది'' అని బెల్లంకొండ గణేష్ అన్నారు. లక్ష్మణ్.కె.కృష్ణ దర్శకత్వంలో బెల్లంకొండ గణేష్, వర్ష బొల్లమ్మ జంటగా నటించిన చిత్రం 'స్వాతిముత్యం'. ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంస్థతో కలసి సితార ఎంటర్‌టైన్మెంట్స్ బ్యానర్‌పై సూర్యదేవర నాగవంశీ నిర్మించిన ఈ సినిమా అక్టోబర్ 5న విడుదలకానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో చిత్ర ట్రైలర్‌ని విడుదల చేశారు. అనంతరం బెల్లంకొండ గణేష్ మాట్లాడుతూ– ''లక్ష్మణ్ చెప్పిన 'స్వాతిముత్యం' కథ చేస్తే ప్రేక్షకులు ఆదరిస్తారని నమ్మాను. ఈ సినిమా అద్భుతంగా రావడానికి ప్రధాన కారణం వంశీగారు. ఈ చిత్రాన్ని ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తారు'' అన్నారు. ''స్వాతిముత్యం' రెగ్యులర్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ కాదు.. కొత్త పాయింట్ ఉంది. నన్ను నమ్మి అవకాశం ఇచ్చిన నాగవంశీఅన్నకు థ్యాంక్స్'' అన్నారు లక్ష్మణ్.కె.కృష్ణ. ''స్వాతిముత్యం' సినిమా మీ అందరికీ నచ్చుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు వర్ష బొల్లమ్మ. ఈ కార్యక్రమంలో నిర్మాత నాగవంశీ పాల్గొన్నారు.

యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్


అల్లు శిరీష్, అనూ ఇమ్మాన్యుయేల్ జంటగా నటిస్తున్న తాజా చిత్రానికిగా 'ఊర్వశివో రాక్షసివో' అనే టైటిల్ ఖరారు చేశారు. రాకేష్ శశి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని అల్లు అరవింద్ సమర్పణలో జీఏ2 పిక్చర్స్ పతాకంపై ధీరజ్ మొగిలినేని నిర్మిస్తున్నారు. తొలుత ఈ సినిమాకు 'ప్రేమకాదంట' అనే టైటిల్‌ను అనుకున్నారు. కానీ, తాజాగా 'ఊర్వశివో రాక్షసివో' అనే టైటిల్‌ను ఫిక్స్ చేశారు. ''యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ చిత్రమిది. ఈ నెల 29న టీజర్‌ను, నవంబరు 4న సినిమాని రిలీజ్ చేస్తున్నాం'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ సినిమాకు సహ నిర్మాత: ఎం.విజయ్, సంగీతం: అచ్చు రాజమణి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: బాబు.


శిరీష్, అను

సినిమా అంటే మాటలు కాదు – ఎస్వీ కృష్ణారెడ్డి

''ప్రస్తుత పరిస్థితుల్లో సినిమా అంటే మాటలు కాదు.. అలాంటిది 'గణా' చిత్రంలో విజయ్ కృష్ణ హీరోగా నటించి, దర్శకత్వం చేయడంతో పాటు నిర్మించడం మామూలు విషయం కాదు. ఈ సినిమా మంచి హిట్ కావాలి'' అని దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి అన్నారు. 'దుర్మార్గుడు' ఫేమ్ విజయ్ కృష్ణ హీరోగా నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'గణా'. సుకన్య, తేజు హీరోయిన్స్‌గా నటించారు. రాధా మమతా సమర్పణలో ఎస్.కె.ఆర్ట్స్ బ్యానర్స్‌పై నిర్మించిన ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ని ఎస్వీ కృష్ణారెడ్డి విడుదల చేసి, మాట్లాడుతూ–''నేను పుట్టింది తూర్పుగోదావరి జిల్లాలో. ఇప్పుడు అక్కడి నుంచే వచ్చిన విజయ్ కృష్ణారెడ్డి నిర్మించిన 'గణా' ఫస్ట్ లుక్‌ని నా చేతుల మీదుగా లాంచ్ చేయడం ఆనందంగా ఉంది'' అన్నారు. ''ఎస్వీ కృష్ణారెడ్డిగారు మాకు ఆదర్శం. 'గణా' సినిమాకి నాకు సహాయం చేసిన వారందరికీ థ్యాంక్స్'' అన్నారు విజయ్ కృష్ణ. ఈ చిత్రానికి కెమెరా: సన్ని, సంగీతం: చిన్నికృష్ణ, లైన్ ప్రొడ్యూసర్స్: బాల ప్రసాద్, ఎమ్.యు.ఎస్.రెడ్డి, కర్రి బుచ్చిరెడ్డి.


విజయ్ కృష్ణ, ఎస్వీ కృష్ణారెడ్డి



దర్శకుడు అశోకన్ మృతి

మలయాళ ఇండస్ట్రీలో విషాదం నెలకొంది. ప్రముఖ దర్శకుడు అశోకన్(60) అనారోగ్యంతో మృతిచెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన కొచ్చిలోని ఓ ఆసుపత్రిలో ఆదివారం రాత్రి తుదిశ్వాస విడిచారు. అశోకన్ అసలు పేరు రామన్ అశోక్ కుమార్. 1998లో 'వర్ణం' సినిమా ద్వారా పరిశ్రమకు పరిచయమయ్యారాయన. వినోదాత్మక చిత్రాలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. అశోకన్ తీసిన 'కనప్పురముస్' అనే టెలీ చిత్రం 2003లో ఉత్తమ టెలీఫిల్మ్‌గా కేరళ రాష్ట్ర ప్రభుత్వ అవార్డు అందుకుంది. 2003 తర్వాత సినిమాలకు విరామం ఇచ్చిన ఆయన సింగపూర్‌లో సెటిలయ్యారు. గల్ఫ్, కొచ్చిలో ఐటీ కంపెనీలు స్థాపించారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు.


వరలక్ష్మి

ఆ రోజు కోసం ఎదురు చూస్తున్నా!

వరలక్ష్మీ శరత్ కుమార్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'శబరి'. ఈ మూవీతో అనిల్ కాట్జ్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. మహర్షి కూండ్ల సమర్పణలో మహా మూవీస్ పతాకంపై మహేంద్రనాథ్ కూండ్ల నిర్మిస్తున్నారు. తెలుగు, తమిళ, మలయాళ, హిందీ భాషల్లో రూపొందుతున్న ఈ సినిమా తాజా షెడ్యూల్ కొడైకెనాల్‌లో ముగిసింది. ఈ సందర్భంగా వరలక్ష్మీ శరత్ కుమార్ మాట్లాడుతూ– ''రెండు వారాలుగా కొడైకెనాల్‌లో జరుగుతున్న 'శబరి' షూటింగ్ సోమవారంతో ముగిసింది. ఈ చిత్రం షూటింగ్ త్వరగా పూర్తి చేసి, మీ ముందుకు సినిమాని ఎప్పుడు తీసుకువద్దామా? అని ఎదురు చూస్తున్నాను'' అన్నారు. ''ఇదొక సైకలాజికల్ థ్రిల్లర్. తర్వాతి షెడ్యూల్‌ని వైజాగ్‌లో ప్రారంభిస్తాం'' అన్నారు మహేంద్రనాథ్ కూండ్ల. ''కూతుర్ని కాపాడుకోవడం కోసం ప్రాణాలకు తెగించే తల్లిగా వరలక్ష్మి నటిస్తున్నారు'' అన్నారు అనిల్ కాట్జ్. ఈ చిత్రానికి కెమెరా: నాని చమిడిశెట్టి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సీతారామరాజు మల్లెల, సంగీతం: గోపీ సుందర్.


అక్షయ్ కుమార్

పురావస్తు పరిశోధన

అక్షయ్ కుమార్ హీరోగా నటించిన తాజా చిత్రం 'రామ్‌సేతు'. అభిషేక్ శర్మ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో జాక్వెలిన్ ఫెర్నాండెజ్, నుష్రత్, సత్యదేవ్ కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమాను అక్టోబరు 25న థియేటర్స్‌లో రిలీజ్ చేస్తున్నట్లు చిత్రయూనిట్ ప్రకటిస్తూ, ఫస్ట్ గ్లింప్స్ వీడియోని విడుదల చేసింది. ఈ మూవీలో పురావస్తు శాస్త్రవేత్త ఆర్యన్ పాత్రలో నటించారు అక్షయ్. 'రామసేతు' అనే బ్రిడ్జి ఉందా? లేదా? అని పురావస్తు శాస్త్రవేత్తలు జరిపే పరిశోధనల నేపథ్యంలో ఈ సినిమా కథనం ఉంటుందని బాలీవుడ్ టాక్.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	954	57,145
నిఫ్టీ ▽	311	17,016

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తాలి రెండు రాత్రి 11.30 ముగింపు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	10,819	▽	50
డోజోన్స్	29,230	▽	360
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,021	△	2
డాక్స్	12,228	▽	56
షాంఘై	3,051	▽	37
నికాయ్	26,432	▽	722

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

మళ్లీ కుప్పకూలిన మార్కెట్లు

- నాలుగో రోజూ అమ్మకాల తీవ్రత
- 954 పాయింట్లు డౌన్; 57,145కు సెన్సెక్స్
- 311 పాయింట్ల నష్టంతో 17,016 వద్దకు నిఫ్టీ
- రియల్టీ, మెటల్, ఆటో, బ్యాంక్స్ పతనం
- కొనసాగిన విదేశీ ఇన్వెస్టర్ల అమ్మకాలు



ఆర్థిక మాంద్య ఆందోళనలు, రష్యా యుద్ధ భయాలు, వడ్డీ రేట్ల పెంపు వంటి అంశాలు ఇన్వెస్టర్లకు షాకిస్తున్నాయి. వెరసి వరుసగా నాలుగో రోజు దేశీ స్టాక్ మార్కెట్లలో అమ్మకాలు వెల్లువెత్తాయి. ప్రధానంగా వడ్డీ ప్రభావిత రంగాలు కుదేలయ్యాయి. వీటితోపాటు చిన్న, మధ్యతరహా కౌంటర్లు సైతం భారీ అమ్మకాలతో బేర్‌మనడం గమనార్హం!

ముంబై: అంతర్జాతీయంగా కనిపిస్తున్న బేరిష్ ట్రెండ్ దేశీయంగానూ ప్రభావం చూపుతోంది. రూపాయి పతనం, విదేశీ ఇన్వెస్టర్ల అమ్మకాలు సెంటిమెంటును దెబ్బతీస్తున్నాయి. దీంతో మరోసారి ఇన్వెస్టర్లు అన్నివైపుల నుంచీ అమ్మకాలకు తెరతీశారు. ఫలితంగా సెన్సెక్స్ సోమవారం 954 పాయింట్లు పతనమై 57,145 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 311 పాయింట్లు కోల్పోయి 17,016 వద్ద స్థిరపడింది. రోజంతా మార్కెట్లు నష్టాల మధ్యే కదిలాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 57,038వరకూ నీరసించగా.. నిఫ్టీ సాంకేతికంగా కీలకమైన 17,000 పాయింట్ల దిగువకు చేరింది. 16,978 వద్ద కనిష్టాన్ని తాకింది. ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, ఆర్థిక మాంద్య అంచనాలు మార్కెట్లను దెబ్బతీస్తున్నట్లు హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ నిపుణులు దీపక్ జసానీ పేర్కొన్నారు. డాలరుతో మారకంలో రూపాయి 82కు చేరువై మరోసారి సరికొత్త కనిష్టాన్ని తాకింది.

రూ. 13 లక్షల కోట్లు ఆవిరి

స్టాక్ మార్కెట్లలో భారీ అమ్మకాల కారణంగా 4 రోజుల్లో ఇన్వెస్టర్ల సంపదగా పిలిచే లిస్టెడ్ కంపెనీల విలువ(మార్కెట్ క్యాప్) రూ. 13.3 లక్షల కోట్లమేర ఆవిరైంది. 4 రోజుల్లో సెన్సెక్స్ 4.3 శాతం(2,575 పాయింట్లు) పడిపోయింది. ఫలితంగా బీఎస్‌ఈ మార్కెట్ క్యాప్ 13,30,753 కోట్లు క్షీణించి రూ. 2,70,11,460 కోట్లకు పరిమితమైంది.

ఐటీ ఎదురీత..: ఎన్‌ఎస్‌ఈలో ఐటీ(0.6%) మినహా అన్ని రంగాలూ డీలా పడ్డాయి. రియల్టీ, మెటల్, ఆటో, ప్రభుత్వ బ్యాంకులు 4 శాతం స్థాయిలో పతనంకాగా.. మీడియా, ఆయిల్-గ్యాస్, ప్రయివేట్ బ్యాంక్స్ 3-2 శాతం మధ్య క్షీణించాయి. నిఫ్టీ దిగ్గజాలలో అదానీ పోర్ట్స్, టాటా మోటార్స్, హిందాల్కో, మారుతీ, ఐషర్, టాటా స్టీల్, ఓఎన్‌జీసీ, ఐటీసీ, బజాజ్ ఆటో, బజాజ్ ఫైనాన్స్, యూపీఎల్, కోల్ ఇండియా, యాక్సిస్, ఎంఅండ్‌ఎం, ఇండస్‌ఇండ్, ఆర్‌ఐఎల్, ఐసీఐసీఐ 6.4-2.5% మధ్య నష్టపోయాయి. బ్లూచిప్స్‌లో హెచ్‌సీఎల్ టెక్, ఇన్ఫోసిస్, ఏషియన్ పెయింట్స్, దివీస్, టీసీఎస్, టాటా కన్జూమర్ మాత్రమే 1.4-0.6% మధ్య బలపడ్డాయి.

చిన్న షేర్లు వీక్

బీఎస్‌ఈలో మిడ్, స్మాల్ క్యాప్స్ 3 శాతం స్థాయిలో పడిపోయాయి. గత వారం చివర్లో భారీ అమ్మకాలు చేపట్టిన విదేశీ ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) తాజాగా రూ. 5,101 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. అయితే దేశీ ఫండ్స్ రూ. 3,532 కోట్ల విలువైన స్టాక్స్ కొనుగోలు చేశాయి.

హర్ష.. లిస్టింగ్ భళా

పతన మార్కెట్లోనూ ప్రెసిషన్ బేరింగ్ కేజ్‌ల తయారీ కంపెనీ హర్ష ఇంజినీర్స్ ఇంటర్నేషనల్ భేషైన లిస్టింగ్‌ను సాధించింది. షేరుకి రూ. 330 ధరలో ఇటీవలే ఐపీవోకురాగా.. బీఎస్‌ఈలో 35 శాతం ప్రీమియంతో రూ. 444 వద్ద ప్రారంభమైంది. తదుపరి 60 శాతం(రూ. 198) జంప్‌చేసి రూ. 528 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 47 శాతం లాభంతో రూ. 486 వద్ద స్థిరపడింది.

మేఘా గ్యాస్ ఇక ఎంసీజీడీపీఎల్

అయిదేళ్లలో రూ.10,000 కోట్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మౌలిక రంగ దిగ్గజం మేఘా ఇంజనీరింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఈఐఎల్) అనుబంధ సంస్థ అయిన మేఘా గ్యాస్ పేరు మేఘా సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్‌గా (ఎంసీజీడీపీఎల్) మారింది. మేఘా గ్యాస్‌కు ఉన్న అనుమతులన్నింటినీ ఎంసీజీడీపీఎల్‌కు బదిలీ చేయాలంటూ ఎంఈఐఎల్ చేసిన అభ్యర్థనను పెట్రోలియం, సహజ వాయువు నియంత్రణ మండలి ఆమోదించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణతోసహా దేశంలోని 10 రాష్ట్రాలు, 62 జిల్లాల్లోని 22 ప్రాంతాల్లో సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్‌ను ఎంసీజీడీపీఎల్ ఇక నుంచి అమలు చేయనుంది. 60కి పైగా సీఎన్‌జీ స్టేషన్లను దేశంలోని వివిధ ప్రాంతాల్లో సంస్థ నిర్వహిస్తోంది. 80,000 పైచిలుకు గృహాలకు పైపుల ద్వారా సహజ వాయువును అందిస్తోంది. సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ కోసం కంపెనీ ఇప్పటికే రూ.1,000 కోట్లకుపైగా ఖర్చు చేసింది.

కొత్త కనిష్టానికి రూపాయి

81.67 వద్ద ముగింపు



న్యూఢిల్లీ: అమెరికన్ డాలరు బలపడుతున్న కొద్దీ రూపాయి రోజురోజుకూ మరింతగా క్షీణిస్తోంది. సోమవారం మరో 58 పైసలు తగ్గి కొత్త ఆల్-టైమ్ కనిష్ట స్థాయి 81.67కి పతనమైంది. దీంతో దేశీ కరెన్సీ వరుసగా నాలుగు సెషన్లలో పతనమైనట్లయింది. ఈ వ్యవధిలో రూపాయి మారకం విలువ ఏకంగా 193 పైసలు పడిపోయింది. డాలరు బలపడుతుండటం, ఇన్వెస్టర్లు రిస్కులకు ఇష్టపడకపోతుండటం, దేశీ స్టాక్ మార్కెట్లో ప్రతికూల ధోరణి, విదేశీ నిధులు తరలిపోతుండటం, ఉక్రెయిన్-రష్యా మధ్య ఉద్రిక్తతల వల్ల భౌగోళికరాజకీయ రిస్కుల భయాలు నెలకొనడం తదితర అంశాలు దేశీ కరెన్సీ పతనానికి కారణాలుగా ఉంటున్నాయని ఫారెక్స్ ట్రేడర్లు తెలిపారు.

82 నిరోధం..: ఈ పరిస్థితుల్లో స్పాట్ మార్కెట్లో రూపాయి 81.20-81.80 శ్రేణిలో కదలవచ్చని మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ అనలిస్ట్ గౌరంగ్ సోమయ్య చెప్పారు. 82 వద్ద నిరోధం, 81.05 వద్ద నిరోధం ఉండగలదని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ రీసెర్చ్ అనలిస్ట్ దిలీప్ పర్మార్ తెలిపారు.

గ్రాండ్ విటారా వచ్చేసింది



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ దిగ్గజం మారుతీ సుజుకీ ఇండియా నుంచి మధ్యస్థాయి స్పోర్ట్స్ యుటిలిటీ వెహికిల్ గ్రాండ్ విటారా భారత మార్కెట్లో అడుగుపెట్టింది. ఢిల్లీ ఎక్స్‌షోరూంలో ధర రూ.10.45 లక్షల నుంచి రూ.19.65 లక్షల మధ్య ఉంది. మైల్డ్ హైబ్రిడ్ టెక్నాలజీతో 1.5 లీటర్ పెట్రోల్ ఇంజన్ పొందుపరిచారు. ఆరు వేరియంట్లలో మాన్యువల్, ఆటోమేటిక్ మోడల్స్‌లో లభిస్తుంది. మైలేజీ వేరియంట్‌ను బట్టి లీటరుకు 21.1 కిలోమీటర్లు, స్ట్రాంగ్ హైబ్రిడ్ పవర్‌ట్రెయిన్ 27.97 కిలోమీటర్లు ఇస్తుందని కంపెనీ ప్రకటించింది. హ్యుందాయ్ క్రెటా, కియా సెల్టోస్, టాటా హ్యారియర్‌కు ఇది పోటీ ఇవ్వనుంది. 57 వేల పైచిలుకు బుకింగ్స్ నమోదయ్యాయని మారుతీ సుజుకీ ఇండియా ఎండీ, సీఈవో హిసాటీ టాకేయూచీ ఈ సందర్భంగా తెలిపారు. మారుతీ సుజుకీ, టయోటా సంయుక్తంగా ఈ కారును అభివృద్ధి చేశాయి. మారుతీ సుజుకీ సబ్‌స్క్రైబ్ విధానంలో నెలకు రూ.27 వేల చందాతో గ్రాండ్ విటారా సొంతం చేసుకోవచ్చు.

అమర రాజా కార్యకలాపాల క్రమబద్ధీకరణ



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: లాభాల మార్జిన్లు మెరుగుపర్చుకునే దిశగా అమర రాజా బ్యాటరీస్ (ఏఆర్‌బీఎల్) వ్యాపార కార్యకలాపాల క్రమబద్ధీకరణపై (బ్యాక్‌వర్డ్ ఇంటిగ్రేషన్) దృష్టి సారించింది. ఇందులో భాగంగా గ్రూప్ సంస్థ మంగళ్ ఇండస్ట్రీస్ (ఎంఐఎల్)లోని ప్లాస్టిక్స్ కాంపొనెంట్ బ్యాటరీల వ్యాపార విభాగాన్ని ఎంఐఎల్ నుంచి విడదీసి ఏఆర్‌బీఎల్ కిందికి తీసుకురానుంది. ఎంఐఎల్ ప్లాస్టిక్స్ కాంపోనెంట్ విభాగం ఏఆర్‌బీఎల్‌కు మాత్రమే ప్లాస్టిక్ కంటైనర్లు, హ్యాండిల్స్ వంటి ఉత్పత్తులను సరఫరా చేస్తోంది. వీటిని బ్యాటరీల తయారీలో వినియోగిస్తారు. దీని వార్షిక సామర్థ్యం 37,000 మిలియన్ టన్నుల (ఎంటీపీఏ) పైచిలుకు ఉంటుంది. రికార్డు తేదీన ఎంఐఎల్ షేర్‌హోల్డర్లకు ప్రతి 74 ఎంఐఎల్ షేర్లకుగాను 65 ఏఆర్‌బీఎల్ షేర్లు లభిస్తాయి.

భారత్‌లో ఐఫోన్ 14 తయారీ



న్యూఢిల్లీ: ఇటీవలే కొత్తగా ప్రవేశపెట్టిన ఐఫోన్ 14 స్మార్ట్‌ఫోన్ల తయారీని భారత్‌లోనూ ప్రారంభించినట్లు టెక్ దిగ్గజం యాపిల్ తెలిపింది. తమిళనాడులోని శ్రీపెరంబుదూర్‌లో ఉన్న ఫాక్స్‌కాన్ ప్లాంటులో తయారయ్యే మేడిన్ ఇండియా ఫోన్లు మరి కొద్ది రోజుల్లో దేశీయ కస్టమర్లకు చేరుతాయని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఇటు దేశీ, అటు విదేశీ మార్కెట్ల కోసం కూడా వీటిని భారత్‌లో తయారు చేయనున్నట్లు వివరించాయి. భారత్‌లో ఐఫోన్ 14 తయారీపై ఉత్సాహంగా ఉన్నామని, ఈ ఫోన్ వినూత్న టెక్నాలజీలను ఆవిష్కరిస్తుందని యాపిల్ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ఏడాది సెప్టెంబర్ 7న ఐఫోన్ 14ను యాపిల్ ఆవిష్కరించింది. సెప్టెంబర్ 16 నుంచి డెలివరీలు ప్రారంభమయ్యాయి. సాధారణంగా ఐఫోన్ల తయారీ ముందుగా చైనాలో ప్రారంభమై, ఆ తర్వాత కొన్నాళ్లు ఆగి భారత్‌లో ఉత్పత్తి మొదలవుతోంది. కానీ తాజాగా మాత్రం కొత్త ఫోన్ ప్రకటించిన కేవలం మూడు వారాల వ్యవధిలోనే భారత్‌లో ఉత్పత్తిని మొదలుపెట్టడం గమనార్హం. తమకు అతి పెద్ద మార్కెట్లలో ఒకటిగా ఎదుగుతున్న భారత్‌లో కార్యకలాపాలు మరింతగా విస్తరించడంపై యాపిల్ దృష్టి పెడుతోంది. ఈ నేపథ్యంలోనే 2017 నుంచే భారత్‌లో ఐఫోన్ ఎస్‌ఈ స్మార్ట్‌ఫోన్ల తయారీ ప్రారంభించింది. ప్రస్తుతం ఐఫోన్ 12, 13లను కూడా ఉత్పత్తి చేస్తోంది. 2020 సెప్టెంబర్‌లో దేశీయంగా యాపిల్ తమ ఆన్‌లైన్ స్టోర్ ప్రారంభించింది. అలాగే బెంగళూరులో యాప్ డిజైన్, అభివృద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేసింది.

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	49,590
బంగారం (99.5 స్వచ్ఛత)	49,391
వెండి (కిలో)	55,374

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

27-9-2022	
విశాఖ	435-00
చిత్తూరు	443-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	435-00
విజయవాడ	435-00
రిటైల్ ధర (డజను)	66.00
26-9-2022 ఫామ్ ధర...	
హైదరాబాద్	400-00
వరంగల్	402-00
రిటైల్ ధర	4.60

భవిత

- గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- ఇండియన్ పాలిటీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఎయిమ్స్, రాయ్‌బరేలిలో 35 సీనియర్ రెసిడెంట్ పోస్టులు

రాయ్‌బరేలిలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్).. సీనియర్ రెసిడెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 35
» **విభాగాలు:** డెర్మటాలజీ, మైక్రోబయాలజీ, మెడిసిన్, ఆప్తమాలజీ, పాథాలజీ, సైకియాట్రీ, రేడియాలజీ, సర్జరీ తదితరాలు.
» **అర్హత:** సంబంధిత స్పెషలైజేషన్‌లో పీజీ డిగ్రీ/ఎండీ/ఎంఎస్/డీఎన్‌బీ/ఎండీఎస్ ఉత్తీర్ణులవ్వాలి. **వయసు:** 45 ఏళ్లు మించకూడదు. **జీతం:** నెలకు రూ.67,700 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, డిపార్ట్‌మెంట్‌లో అసెస్‌మెంట్ పరీక్షలో మెరిట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 21.10.2022
» **వెబ్‌సైట్:** www.aiimsrbl.edu.in

ఎన్‌ఐఐఎస్‌టీ, తిరువనంతపురంలో ప్రాజెక్ట్ అసోసియేట్ పోస్టులు

తిరువనంతపురంలోని సీఎస్‌ఐఆర్-నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఇంటర్ డిసిప్లినరీ సైన్స్ అండ్ టెక్నాలజీ.. తాత్కాలిక ప్రాతిపదికన ప్రాజెక్ట్ అసోసియేట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 09
» **పోస్టుల వివరాలు:** ప్రాజెక్ట్ అసోసియేట్1-03, టెక్నికల్ అసిస్టెంట్-01, ప్రాజెక్ట్ అసోసియేట్ 2-01, సీనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్-02, ప్రాజెక్ట్ అసిస్టెంట్-02.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా,బీఎస్సీ,బీఈ/బీటెక్, మాస్టర్స్ డిగ్రీతోపాటు పని అనుభవం ఉండాలి.
» **ఎంపిక:** ఆన్‌లైన్ ఇంటర్వ్యూ ఆధారంగా.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.09.2022
» **వెబ్‌సైట్:** www.niist.res.in

ఐఐఎస్‌టీ, కేరళలో 12 రీసెర్చ్ స్టాఫ్ పోస్టులు

కేరళలోని తిరువనంతపురంలో ఉన్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ(ఐఐఎస్‌టీ).. రీసెర్చ్ స్టాఫ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 12
» **పోస్టుల వివరాలు:** సీనియర్ రీసెర్చ్ ఫెలో(ఎస్‌ఆర్‌ఎఫ్)-01, జూనియర్ రీసెర్చ్ ఫెలో-02, జేపీఎఫ్-09.
» **అర్హత:** పోస్టును అనుసరించి బీఎస్/బీఈ/బీటెక్/ఎమ్మెస్సీ/ఎంఎస్ ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** 35 ఏళ్లు మించకూడదు.
» **జీతం:**నెలకు రూ.23,000-35,000 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష/ఇంటర్వ్యూలో మెరిట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 10.10.2022
» **వెబ్‌సైట్:** iist.ac.in

బీఈసీఐఎల్-ఏఐసీటీఈ, న్యూఢిల్లీలో వివిధ ఉద్యోగాలు

న్యూఢిల్లీలోని బ్రాడ్‌కాస్ట్ ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్.. ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్(ఏఐసీటీఈ) కార్యాలయంలో ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 04
» **పోస్టుల వివరాలు:** క్లౌడ్ ఆర్కిటెక్ట్-01, టెక్నాలజీ అసోసియేట్-01, సైబర్ సెక్యూరిటీ కన్సల్టెంట్-01, సాఫ్ట్‌వేర్ డెవలపర్-01.
» **వయసు:** సాఫ్ట్‌వేర్ డెవలపర్ పోస్టులకు 35 ఏళ్లు,మిగతా ఖాళీలకు 40ఏళ్లు మించకూడదు.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్, ఎంసీఏ, ఎంఎస్సీ, ఎంఈ/ఎంటెక్, ఎంఎస్ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
» **ఎంపిక విధానం:** స్కిల్ టెస్ట్, రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 11.10.2022
» **వెబ్‌సైట్:** www.becil.com

నిమ్‌హాన్స్, బెంగళూరులో 10 పోస్టులు

బెంగళూరులోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్-న్యూరో సైన్సెస్.. ఒప్పంద ప్రాతిపదికన వివిధ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 10
» **పోస్టుల వివరాలు:** జూనియర్ సైంటిఫిక్ ఆఫీసర్-01, అకౌంట్స్ అసిస్టెంట్-01, సైకాలజిస్ట్-01, సోషల్ వర్కర్-01, కోహోర్ట్ మేనేజర్-01, ప్రాజెక్ట్ మేనేజర్-01, రీసెర్చ్ ఆఫీసర్-01, ఫాలో-అప్ కౌన్సెలర్-03.
» **అర్హత:** పోస్టును అనుసరించి బీకాం, ఎమ్మెస్సీ, ఎంఏ, ఎంఫిల్ ఉత్తీర్ణులవ్వాలి.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, స్కిల్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ది రిజిస్ట్రార్, నిమ్‌హాన్స్, పోస్ట్ బాక్స్ నెం.2900, హోసూర్ రోడ్డు, బెంగళూరు చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 22.10.2022
» **వెబ్‌సైట్:** nimhans.ac.in

ఐఐటీల్లో.. పీపీఓలు అదరహో!



» గత ఏడాది కంటే 75 శాతం అధికంగా పీపీఓలు
» కోర్, ఐటీ నుంచి ఫైనాన్స్ వరకు పలు సంస్థల నుంచి ఆఫర్లు
» వేతనాలు కూడా భారీగానే

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీలు.. సాంకేతిక విద్యలో అత్యున్నత శ్రేణి విద్యాసంస్థలుగా గుర్తింపు! వీటిలో చదువుకున్న వారికి సంస్థలు రెడ్ కార్పెట్ స్వాగతం పలుకుతాయనే భావన! లక్షల ప్యాకేజీలతో ఆఫర్లు ఇస్తాయనే అభిప్రాయం!! వాస్తవానికి ఐఐటీలంటేనే.. కంపెనీలు తమకు అవసరమైన టాలెంట్‌ను ఒడిసి పట్టుకునే కేంద్రాలు. ఈ విషయం నిజమని మరోసారి రుజువైంది. గత ఏడాది వర్క్ ఫ్రమ్ హోమ్, హైబ్రీడ్ వర్కింగ్ విధానాల వల్ల పీపీఓల్లో కొంత తగ్గుదల ఏర్పడినా.. ఈసారి మళ్లీ అవి పుంజుకున్నాయి. ఈ నేపథ్యంలో.. ఐఐటీల్లో ప్రీ ప్లేస్‌మెంట్ ఆఫర్స్(పీపీవో) తాజా ట్రెండ్స్..ఆఫర్లు అందించిన రంగాలు, సంస్థలు, జాబ్ ప్రొఫైల్స్, కంపెనీలు కోరుకుంటున్న స్కిల్స్‌పై ప్రత్యేక కథనం..

ప్రీ ప్లేస్‌మెంట్ ఆఫర్స్ అంటే

- క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ అంటే..కంపెనీలు ఆయా ఇన్‌స్టిట్యూట్స్‌కు వచ్చి, ఎంపిక ప్రక్రియ నిర్వహించి ఆఫర్లు ఇవ్వడం. ప్రీ ప్లేస్‌మెంట్ ఆఫర్స్ అంటే.. ఫైనల్ ప్లేస్‌మెంట్స్ కంటే ముందే విద్యార్థులకు ఆఫర్లు ప్రకటించే ప్రక్రియ.
- ఐఐటీల్లోని విద్యార్థులు సమ్మర్ ప్లేస్‌మెంట్స్ పేరుతో ఆయా సంస్థల్లో ఇంటర్న్‌షిప్‌లో చేరతారు. ఆ సమయంలో వారు చూపిన ప్రతిభ ఆధారంగా ఫైనల్ ప్లేస్‌మెంట్ డ్రైవ్స్ కంటే ముందుగానే సదరు విద్యార్థులకు సంస్థలు ఆఫర్స్ ఇచ్చే ప్రక్రియనే ప్రీ ప్లేస్‌మెంట్ ఆఫర్లు అంటారు. అంటే.. ఒక విద్యార్థి ఏదైనా సంస్థలో ఇంటర్న్‌షిప్ చేసిన సమయంలో అద్భుతమైన ప్రతిభ చూపితే.. సదరు విద్యార్థికి ఫైనల్ ప్లేస్‌మెంట్ ఎంపిక ప్రక్రియలో పాల్గొనాల్సిన అవసరం లేకుండానే.. ప్రీ ప్లేస్‌మెంట్ ఆఫర్స్ పేరుతో ఉద్యోగాలు ఖరారవుతాయి.

సెప్టెంబర్ నుంచి డిసెంబర్ వరకు

- ప్రీ ప్లేస్‌మెంట్ ఆఫర్స్ ప్రక్రియను.. కార్పొరేట్ కంపెనీలు ప్రతి ఏటా సెప్టెంబర్ నుంచి డిసెంబర్ వరకు దశల వారీగా చేపడతాయి. 2023లో ఆయా కోర్సులు పూర్తి చేసుకోనున్న వారికి.. తాజాగా తొలి దశలో భాగంగా ప్రీ ప్లేస్‌మెంట్ ఆఫర్స్‌ను ప్రకటించాయి.
- ఐఐటీ-ఢిల్లీలో తొలి దశలోనే 150 మందికి ప్రీ ప్లేస్‌మెంట్ ఆఫర్లు లభించాయి.
- ఐఐటీ-గువహటిలో కూడా 182 మందికి పీపీఓలు అందాయి.
- ఐఐటీ-చెన్నైలో 213 మంది పీపీఓలు సొంతం చేసుకున్నారు.
- ఐఐటీ-బీహెచ్‌యూలో 203 మందికి పీపీఓలు ఖరారయ్యాయి.
- ఐఐటీ-గాంధీనగర్‌లో గతం కంటే 75 శాతం అధికంగా పీపీఓలు లభించాయి.
- ఐఐటీ-హైదరాబాద్‌లో 60 శాతం అధికంగా పీపీఓలు దక్కాయి
- ఐఐటీ-మండిలో ఇప్పటివరకు 56 మందికి పీపీఓలు ఖరారయ్యాయి.
- ఈ గణాంకాలన్నీ పీపీఓ ఎంపికలో తొలి దశకు చెందినవి మాత్రమేనని..

డిసెంబర్ వరకు ఈ ప్రక్రియ కొనసాగనున్న నేపథ్యంలో.. నూటికి తొంభై శాతం మందికి పీపీఓలు ఖరారవుతాయని ఆయా క్యాంపస్ ప్లేస్‌మెంట్ వర్గాలు పేర్కొంటున్నాయి.

పీపీఓ.. భారీ వేతనాలు

ఈ ఏడాది ప్రీ ప్లేస్‌మెంట్ ఆఫర్స్‌లో సంస్థలు భారీ వేతనాలను సైతం ఖరారు చేశాయి. రూ.91 లక్షల నుంచి రూ.1.2కోట్ల వరకు వేతనాలతో ఆఫర్లు ఇచ్చాయి. డొమెస్టిక్, ఇంటర్నేషనల్ ఆఫర్స్ సైతం విద్యార్థులను పలకరించాయి. ఫైనల్ ప్లేస్‌మెంట్స్ సమయానికి వీటిపై పూర్తి సమాచారం వెలువడనుంది.

కోర్ టు సర్వీస్

ప్రీ ప్లేస్‌మెంట్ ఆఫర్స్ లభించిన విభాగాలను పరిశీలిస్తే.. కోర్ సెక్టార్ మొదలు సర్వీస్ సెక్టార్ వరకు పలు రంగాలకు చెందిన సంస్థలు ఈ జాబితాలో ఉన్నాయి. ఆఫర్స్‌లో ఐటీ రంగం అగ్రస్థానంలో ఉండగా..ఆ తర్వాత స్థానాల్లో ప్రధానంగా కోర్ ఇంజనీరింగ్, ఫైనాన్స్, అనలిటిక్స్, బ్యాంకింగ్ రంగాలు ఉన్నాయి.

ఎంఎన్‌సీల నుంచి స్టార్టప్స్ వరకు

- ఎంఎన్‌సీలు మొదలు స్టార్టప్ కంపెనీల వరకు పీపీవో ఆఫర్స్ ఇవ్వడంలో ముందంజలో ఉన్నాయి. అమెజాన్, మైక్రోసాఫ్ట్, ఒరాకిల్, అడోబ్, క్వాల్‌కామ్, వాల్ మార్ట్, సేల్స్‌ఫోర్స్, ఫ్లిప్‌కార్ట్ వంటి దిగ్గజ సంస్థలు; మ్యాథ్‌వర్క్, వేదాంతు వంటి యూనికార్న్ స్టార్టప్స్ పీపీఓలు అందించాయి.
- కోర్ సెక్టార్స్‌లో డీఈషా, జాన్‌డీర్, ఫోర్డ్ మోటర్స్, బీఎన్‌వై మెలాన్, శాంసంగ్ రీసెర్చ్ వంటి ప్రముఖ సంస్థలు ఈ జాబితాలో ఉన్నాయి.
- కన్సల్టింగ్, ఫైనాన్స్ రంగాల్లో బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్, బెయిన్ అండ్ కో, కేపీఎంజీ వంటివి పీపీఓలు ఖరారు చేశాయి.

డేటా అనలిటిక్స్‌కు ప్రాధాన్యం

కన్సల్టింగ్, ఈ-కామర్స్ సంస్థలు డేటా అనలిటిక్స్‌కు ఎక్కువ ప్రాధాన్యమిచ్చాయి. సంస్థల విస్తరణ, అభివృద్ధికి డేటా అనలిటిక్స్, డేటా కంపైలేషన్ వంటివి కీలకంగా మారుతున్నాయి. దీంతో ఈ విభాగాల్లో ఎక్కువ నియామకాలు చేపట్టినట్లు చెబుతున్నారు.

ఆటోమేషన్, కోడింగ్

ఐటీ, సాఫ్ట్‌వేర్ రంగానికి చెందిన సంస్థలు ఆటోమేషన్, కోడింగ్ స్కిల్స్ ఉన్న వారికి ప్రాధాన్యమిచ్చాయి. కంపెనీలు ఆటోమేషన్ ఆధారిత కార్యకలాపాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్, ఐఓటీ, రోబోటిక్స్ వంటి నైపుణ్యాలున్న వారిని ఎంపిక చేసుకున్నాయి. ఆటోమేషన్ కార్యకలాపాల నిర్వహణకు సంబంధించి బ్యాక్ ఎండ్‌లో సంబంధిత ప్రోగ్రామ్స్, సాఫ్ట్‌వేర్స్ రూపొందించేందుకు అవసరమైన కోడింగ్ నైపుణ్యాలున్న వారికి సంస్థలు ఎక్కువ ఆఫర్లు ఇచ్చాయి.

ఈ నైపుణ్యాలు తప్పనిసరి

డెసిషన్ మేకింగ్ స్కిల్స్, ప్రాబ్లమ్ సాల్వింగ్ కెపాసిటీ, క్రిటికల్ థింకింగ్, అడాప్టివ్‌నెస్, టీమ్ వర్కింగ్ కల్చర్, బిహేవియరల్ స్కిల్స్ వంటి నైపుణ్యాలున్న వారికి కంపెనీలు ప్రాధాన్యమిచ్చినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఇండస్ట్రీ 4.0 స్కిల్స్, నాలెడ్జ్ అప్‌డేషన్ విషయంలో ముందున్న వారికే ప్రాధాన్యమిచ్చాయి. దీంతో ఫైనల్ ప్లేస్‌మెంట్స్‌కు సిద్ధమవుతున్న విద్యార్థులు ఈ నైపుణ్యాలపై దృష్టి పెట్టాలని నిపుణులు సూచిస్తున్నారు.

ఇంటర్న్‌గా రాణించిన వారికే

ఆయా సంస్థల్లో సమ్మర్ ప్లేస్‌మెంట్ ఆఫర్ ద్వారా ఇంటర్న్ ట్రైనీగా ఎంపికై..విధుల్లో మంచి పనితీరు చూపిన వారికి పీపీఓ ఆఫర్లలో ప్రాధాన్యం లభించింది. ఇంటర్న్ ట్రైనీగా సంస్థలో తమకు కేటాయించిన విభాగంలో నిర్వర్తించిన విధులు, టీమ్, సీనియర్స్, క్లయింట్లతో వ్యవహరించిన తీరు వంటివి పరిగణనలోకి తీసుకుని కంపెనీలు పీపీఓలు ప్రకటించాయి.

ఫైనల్ ప్లేస్‌మెంట్‌లోనూ

ఇంటర్న్ ట్రైనీగా రాణించి.. ప్రీ ప్లేస్‌మెంట్ ఆఫర్స్ పొందిన విద్యార్థులు కావాలనుకుంటే.. ఫైనల్ ప్లేస్‌మెంట్ ప్రక్రియలోనూ పాల్గొనొచ్చు.తమకు నచ్చిన సంస్థల్లో ఆఫర్ సొంతం చేసుకోవచ్చు. పీపీఓ ద్వారా ఇప్పటికే ఆఫర్ ఖరారు చేసుకున్నప్పటికీ.. ఫైనల్ ప్లేస్‌మెంట్స్‌లో పాల్గొని ఇంతకంటే మెరుగైన ఆఫర్ లభిస్తే దానికి ఆమోదం తెలిపే వీలు కూడా ఉంది. అధిక శాతం మంది పీపీఓ లభించిన సంస్థలోనే ఫైనల్ ఆఫర్‌ను ఖరారు చేసుకుంటున్నారని ఐఐటీ ప్లేస్‌మెంట్ వర్గాలు పేర్కొంటున్నాయి.

ఫైనల్ ప్లేస్‌మెంట్స్ ఆశాజనకంగానే

ఐఐటీల్లో తాజా ప్రీ ప్లేస్‌మెంట్ ఆఫర్లను పరిగణనలోకి తీసుకుంటే..ఫైనల్ ప్లేస్‌మెంట్స్ మరింత ఆశాజనకంగా ఉంటాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సంస్థల కార్యకలాపాలు కోవిడ్ పూర్వ స్థితికి చేరుకోవడం,వ్యాపార ప్రణాళికల్లో భాగంగా డిజిటల్, టెక్నాలజీ ఆధారిత సేవలకు ప్రాధాన్యం కారణంగా ఆఫర్లు, వేతనాలు ఆకర్షణీయంగా ఉంటాయని ప్లేస్‌మెంట్ వర్గాల ప్రతినిధులు పేర్కొంటున్నారు.

క్యాంపస్ డ్రైవ్స్‌కే కంపెనీల మొగ్గు

"ప్రస్తుత పరిస్థితుల్లో సంస్థలు క్యాంపస్ రిక్రూట్‌మెంట్స్‌కు ప్రాధాన్యం ఇస్తున్నాయి. ఈ విధానంలో రిక్రూట్‌మెంట్ ప్రక్రియ త్వరగా ముగియడంతోపాటు, ఫ్రెష్ టాలెంట్‌ను నియమించుకునే అవకాశం లభిస్తుంది. అందుకే ప్రీ ప్లేస్‌మెంట్ ఆఫర్స్ పేరుతో ముందుగానే నియామకాలు ఖరారు చేస్తున్నాయి. పీపీఓ గణాంకాలను పరిగణనలోకి తీసుకుంటే.. ఫైనల్ ప్లేస్‌మెంట్స్ మరింత ఆశాజనకంగా ఉంటాయని చెప్పొచ్చు. క్యాంపస్ డ్రైవ్స్ అవకాశం లేని అభ్యర్థులు రిఫరల్ ఎంట్రీ, జాబ్ పోర్టల్స్, సంస్థలు నిర్వహించే సొంత నియామక ప్రక్రియల్లో నెగ్గేందుకు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలి.

-ప్రొ॥ సి.కృష్ణ మోహన్, డీన్, పబ్లిక్ అండ్ కార్పొరేట్ రిలేషన్స్, ఆఫీస్ ఆఫ్ కెరీర్ సర్వీసెస్, ఐఐటీ-హైదరాబాద్.

ప్రైవేటు స్కూళ్లలో ఉచిత ప్రవేశాల రెండో జాబితా విడుదల నేడు

సాక్షి, అమరావతి: విద్యా హక్కు చట్టం(ఆర్టీఈ) కింద ప్రైవేటు స్కూళ్లలో పేద, అణగారిన వర్గాల పిల్లలకు ఒకటో తరగతిలో ఉచితంగా ప్రవేశం కల్పించేందుకు ఎంపిక చేసిన రెండో విడత జాబితా మంగళవారం విడుదల కానుంది. తల్లిదండ్రులు ఆ జాబితాను సందర్శించి తమ పిల్లలను ఈ నెల 28 నుంచి అక్టోబర్ 10వ తేదీలోపు ఎంపికైన పాఠశాలల్లో చేర్పాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఉద్యోగంతో కూడిన ఎంఎస్ కోర్సులు

సాక్షి, అమరావతి: రాష్ట్ర విద్యార్థులకు ఉద్యోగంతో కూడిన ఎంఎస్ కోర్సులను అందించేలా జర్మనీ దేశానికి చెందిన ఎస్జీఐటీ స్టీన్బీస్ వర్సిటీతో ఉన్నత విద్యామండలి సోమవారం ఒప్పందం చేసుకుంది. ఉన్నత విద్యామండలి కార్యాలయంలో చైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి సమక్షంలో కార్యదర్శి నజీర్ అహమ్మద్, ఎస్జీఐటీ స్టీన్బీస్ వర్సిటీ డైరెక్టర్ బెట్రమ్ లోహ్మార్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందంతో రాష్ట్ర విద్యార్థులకు ఉన్నత ఉద్యోగావకాశాలు మెరుగుపడతాయని హేమచంద్రారెడ్డి తెలిపారు. బెట్రమ్ లోహ్మార్ మాట్లాడుతూ రానున్న నాలుగేళ్లలో బాష్ వంటి కంపెనీలకు 5 లక్షల మంది అభ్యర్థులు అవసరం అవుతారని చెప్పారు.


28 నుంచి ఈఏపీ సెట్ బీ కేటగిరీ సీట్లకు దరఖాస్తుల స్వీకరణ

సాక్షి, అమరావతి: ఇంజనీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి సంబంధించిన ఈఏపీ సెట్ అడ్మిషన్లలో బీ కేటగిరీ (యాజమాన్య కోటా) సీట్ల భర్తీ కోసం ఈ నెల 28 నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఉన్నత విద్యామండలి కార్యదర్శి నజీర్ అహమ్మద్ సోమవారం ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు 'హెచ్టీటీపీపీఎస్://సెట్స్ ఏపీఎస్సీహెచ్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్' ద్వారా ఆన్లైన్లో దరఖాస్తులు సమర్పించవచ్చని, లేదా ఆయా కాలేజీలకు వెళ్లి నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి ఆయా కాలేజీలు ఈ నెల 27న నోటిఫికేషన్లు జారీ చేస్తాయని, అక్టోబర్ 10 వరకు దరఖాస్తుకు గడువు ఉంటుందని, 14న మెరిట్ ప్రకారం అభ్యర్థుల ఎంపిక చేయాల్సి ఉందని వివరించారు.

ఏపీలోనే నిరుద్యోగం తక్కువ

సీఎంఐఈ గణాంకాల్లో వెల్లడి

- ఆగస్టులో దేశ సగటు నిరుద్యోగ రేటు 8.3%
- ఇదే సమయంలో ఏపీలో 6%గా నమోదు
- తెలంగాణ, తమిళనాడు, బెంగాల్, రాజస్తాన్ కంటే ఏపీలోనే తక్కువ నిరుద్యోగం
- హరియాణాలో అత్యధికంగా 37.3%
- సత్ఫలితాలనిస్తున్న వైఎస్ జగన్ సర్కార్ చర్యలు
- ప్రభుత్వ ఉద్యోగాల కల్పనతో పాటు పరిశ్రమలకిస్తున్న ప్రోత్సాహంతోనే నిరుద్యోగం తగ్గిందన్న నిపుణులు



సాక్షి, అమరావతి: దేశంలో పెద్ద రాష్ట్రాలతో పోలిస్తే రాష్ట్రంలోనే నిరుద్యోగ రేటు తక్కువగా ఉంది. అంతే కాదు దేశీయ సగటు కంటే కూడా ఏపీ నిరుద్యోగ రేటు తక్కువగా ఉందని సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ(సీఎంఐఈ) తాజాగా విడుదల చేసిన గణాంకాల్లో వెల్లడైంది. ఈ ఏడాది ఆగస్టు నాటికి జాతీయ సగటు నిరుద్యోగ రేటు 8.3%గా ఉండగా.. ఏపీలో నిరుద్యోగ రేటు 6 శాతమేనని సీఎంఐఈ తెలిపింది. ఇక పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన పొరుగు రాష్ట్రాలు తమిళనాడు, తెలంగాణతో పాటు పశ్చిమ బెంగాల్, రాజస్తాన్, పంజాబ్ వంటి పెద్ద రాష్ట్రాల కంటే కూడా ఏపీలోనే నిరుద్యోగ రేటు చాలా తక్కువగా ఉంది. తమిళనాడులో 7.2%గా ఉంటే.. తెలంగాణలో 6.9%గా నమోదయ్యింది. దేశంలో అత్యధికంగా హరియాణాలో 37.3%, జమ్మూ అండ్ కశ్మీర్ 32.8, రాజస్తాన్లో 31.4% ఉండగా.. అత్యల్పంగా ఛత్తీస్గఢ్లో 0.4% మేర నిరుద్యోగముంది. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన మహారాష్ట్రలో 2.2%, మధ్యప్రదేశ్, గుజరాత్లలో 2.6%గా నిరుద్యోగ రేటు నమోదయ్యింది.

ప్రభుత్వ ప్రోత్సాహంతో కోవిడ్ను అధిగమించి..

కోవిడ్ లాక్డౌన్ సమయంలో దేశవ్యాప్తంగా నిరుద్యోగ రేటు రికార్డు స్థాయికి చేరుకుంది. 2020 ఏప్రిల్లో దేశ నిరుద్యోగ రేటు 23.6 శాతానికి చేరగా.. ఏపీలో 20.5 శాతంగా నమోదయ్యింది. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమై తీసుకున్న చర్యలతో నిరుద్యోగ రేటు తగ్గుతూ వచ్చింది. వైఎస్ జగన్ ప్రభుత్వం శాశ్వత, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ విభాగాల్లో కలిపి మొత్తం 6,16,323 మందికి ప్రభుత్వ రంగంలో ఉపాధి కల్పించింది. ఇందులో శాశ్వత ఉద్యోగాలు 2,06,638 ఉన్నాయి. ఇవి కాకుండా కోవిడ్ సమయంలో పరిశ్రమలు, వ్యాపార సముదాయాలు మూతపడకుండా.. ఆర్థిక వ్యవస్థ త్వరగా కోలుకునే విధంగా చేపట్టిన చర్యలు కూడా సత్ఫలితాలనిచ్చాయి. రీస్టార్ట్ ప్యాకేజీ ప్రకటించి ఎంఎస్ఎంఈలను ఆదుకోవడం వల్ల లక్షలాది మందికి ఉపాధి లభించింది. అలాగే ప్రభుత్వ చొరవతో రాష్ట్రంలో ప్రముఖ కంపెనీలు భారీగా పెట్టుబడులు పెట్టడం.. ఇప్పటికే పలు సంస్థలు తమ పరిశ్రమలను ప్రారంభించడంతో ఉపాధి అవకాశాలు భారీగా పెరిగాయి. ప్రభుత్వం తీసుకున్న ఇలాంటి ఎన్నో నిర్ణయాల వల్ల రాష్ట్రంలో నిరుద్యోగ రేటు గణనీయంగా తగ్గిందని నిపుణులు పేర్కొంటున్నారు.

ఎన్టీఆర్ హంతకులకు ఆయనపై ప్రేమ ఉందా..!

తెలుగు అకాడమీ చైర్పర్సన్, వైఎస్సార్సీపీ నేత నందమూరి లక్ష్మీపార్వతి

సాక్షి, అమరావతి: ఎన్టీఆర్ హంతకులకు ఆయనపై ప్రేమ ఉందా అని ఏపీ తెలుగు అకాడమీ చైర్పర్సన్, వైఎస్సార్సీపీ ప్రధాన కార్యదర్శి నందమూరి లక్ష్మీపార్వతి ప్రశ్నించారు. ఎన్టీఆర్ హంతకులే హెల్త్ యూనివర్సిటీకి ఆయన పేరు ఉంచాలంటూ కపట ప్రేమ ప్రదర్శిస్తున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డికి ఎన్టీఆర్పై చంద్రబాబులా ద్వేషం గానీ, శత్రుత్వం గానీ లేవని, పైగా గౌరవం, అభిమానం ఉన్నాయని తెలిపారు. అందువల్లే కృష్ణా జిల్లాకు ఎన్టీఆర్ పేరు పెట్టారని తెలిపారు. ఎన్టీఆర్ పేరు జిల్లాకు ఉండాలా.. యూనివర్సిటీకి ఉండాలా అంటే.. జిల్లాకే తన ఓటు అని స్పష్టంచేశారు. జిల్లా అనేది పెద్దదని, యూనివర్సిటీ అన్నది చిన్నది అని విమర్శించే వారు తెలుసుకోవాలన్నారు. హెల్త్ యూనివర్సిటీకి ఆరోగ్యశ్రీ సృష్టికర్త, రూపాయి వైద్యుడిగా పేరు గడించిన దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పేరు పెట్టడమే సముచితమని అన్నారు. ఆమె సోమవారం తాడేపల్లిలోని వైఎస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆనాడు ఎల్లో మీడియాలో ఎన్టీఆర్కు వ్యతిరేకంగా వచ్చిన వార్తలను ప్రదర్శించారు. ఎన్టీఆర్కు భారతరత్న రాకుండా అడ్డుపడ్డవారు ఆయన్ను గౌరవిస్తారంటే ప్రజలు నమ్ముతారా అని లక్ష్మీపార్వతి అన్నారు. ప్రతి మహానాడులో ఎన్టీఆర్కు భారతరత్న ఇవ్వాలని తీర్మానం చేయడం, చెత్త బుట్టలో వేయడం పరిపాటని తెలిపారు. 14 ఏళ్ళు సీఎంగా ఉన్న చంద్రబాబు.. ఎన్టీఆర్ గౌరవార్థం ఏం చేశారని ప్రశ్నించారు. ఎన్టీఆర్ కుటుంబ సభ్యులు చంద్రబాబుకు వంతపాడి కన్న తండ్రినే చంపుకున్నారని చెప్పారు. ఆయన గౌరవాన్ని కాపాడలేని వారు బిడ్డలు ఎలా అవుతారని ప్రశ్నించారు. ఇప్పటికీ పశ్చాత్తాపం కలగదా అని అన్నారు.

ఎన్టీఆర్ జీవితంలోకి తాను వచ్చాకే వసంతం వచ్చిందని లక్ష్మీపార్వతి చెప్పారు. ఆయన బతికి ఉన్నప్పుడు తన కాళ్ళు మొక్కినవారే, ఇప్పుడు తిడుతున్నారన్నారు. బాబుతో కుమ్మక్కై రామోజీ ఆనాడు ఎన్టీఆర్పై తప్పుడు రాతలు రాశారని, ఇప్పుడూ సీఎం జగన్పై దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎన్టీఆర్ను బాబు అండ్ కో హత్య చేశారా లేదా అని రామోజీ, రాధాకృష్ణలను నిలదీశారు. రాజకీయానికే కాదు కులానికి కూడా గౌరవం తెచ్చిన ఒక పెద్దను సజీవ దహనం చేసింది వీరే కదా అని అన్నారు. స్పీకర్ పదానికి అగౌరవం తెచ్చిన వ్యక్తి యనమల రామకృష్ణుడు అని మండిపడ్డారు. రాధాకృష్ణ చెత్త పలుకులకు తాను భయపడనని చెప్పారు.

ఎన్టీఆర్పై నాకున్న అభిమానం అందరికీ తెలుసు

ఎన్టీఆర్పై తనకున్న అభిమానం అందరికీ తెలుసునన్నారు. పిచ్చి పిచ్చి కార్టూన్లతో ఎన్టీఆర్ వ్యక్తిత్వాన్ని కించపరిచింది పచ్చమీడియానే అని చెప్పారు. తాను ఏనాడూ పదవుల కోసం తాను ఆశపడలేదన్నారు. ఇందుకు ఆయన ఇంటర్వ్యూలలో చెప్పిన మాటలే సాక్ష్యమన్నారు. టెక్కలి, గోరంట్ల నియోజకవర్గాల్లో పోటీ చేయాలని ఎన్టీఆర్, ఆయన అభిమానులు కోరినా వద్దని చెప్పానని అన్నారు. ఎన్టీఆర్ భార్య పదవికి మించింది తనకు ఏదీ లేదని చెప్పానన్నారు. లక్ష్మీపార్వతి భార్య మాత్రమే కాదని, తల్లిలాంటిదని ఆనాడు ఎన్టీఆర్ చెప్పారని గుర్తు చేశారు. పత్రికల్లో వచ్చినవి రామోజీ, రాధాకృష్ణ, చంద్రబాబు చదవలేదా అని ప్రశ్నించారు. ఈనాడు అబద్ధపు రాతలను ఎన్టీఆర్ ఆనాడే తప్పుబట్టారని చెప్పారు. ఎన్టీఆర్కు అన్యాయం చేయనని చంద్రబాబు ఆనాడు లోకేశ్ మీద ప్రమాణం చేసి మాట తప్పలేదా అని నిలదీశారు. తాను అడ్డుపడి ఉంటే ఎన్టీఆర్ కేబినెట్లో చంద్రబాబుకు ఫైనాన్స్, రెవెన్యూ వంటి కీలక శాఖలు దక్కేవి కాదని చెప్పారు. ఎన్టీఆర్ అసలు తనను పెళ్లి చేసుకోలేదని, ఆ ఇంటి పేరు వాడుకునే హక్కు తనకు లేదంటూ అతి దారుణంగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. చంద్రబాబు అధికార వ్యామోహాన్ని ఎదిరించినందుకే మహిళనైన తనపై విషప్రచారం చేస్తున్నారని అన్నారు. వారి ఇంట్లో కూడా మహిళలు ఉన్నారు కదా? ఇది సమంజసమా అని ప్రశ్నించారు. తమ పెళ్లి గురించి తప్పుగా మాట్లాడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు.

రామోజీ, రాధాకృష్ణలకు బుద్ధి, జ్ఞానం ఉందా?

ఎన్టీఆర్కు చేసిన ద్రోహాన్ని, అధికార దాహాన్ని కప్పిపుచ్చుకోవడానికి పచ్చ మీడియా, టీడీపీ సోషల్ మీడియా తనపై విష ప్రచారం చేస్తోందని చెప్పారు. అసలు రామోజీ, రాధాకృష్ణలకు బుద్ధి, జ్ఞానం ఉందా.. వెన్నుపోటును అధికార మార్పు అంటారా అని ప్రశ్నించారు. పత్రికాధిపతులని చెప్పుకోవటానికి వారు అనర్హులని చెప్పారు. అధికార దాహంతో చంద్రబాబు, లోకేశ్లు ఎల్లో మీడియాతో కలిసి చేసే దుష్ప్రచారాలను, వెన్నుపోటుదారుల మాటలను నమ్మొద్దని ప్రజలను కోరారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్ అభ్యర్థుల ఎంపిక జాబితా విడుదల

సాక్షి, అమరావతి: వైద్య, ఆరోగ్య శాఖలో వైద్యులు, వైద్య సిబ్బంది నియామక ప్రక్రియ కొనసాగుతోంది. ఈ క్రమంలో డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) పరిధిలో అసిస్టెంట్ ప్రొఫెసర్ ల్యాటరల్ ఎంట్రీ భర్తీకి సంబంధించి 113 మంది ఎంపికైన అభ్యర్థుల జాబితాను విడుదల చేశారు. మొత్తం 622 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయగా.. ఇందులో 247 ల్యాటరల్ ఎంట్రీ, 375 పోస్టులు ప్రత్యక్ష పద్ధతిలో భర్తీ చేస్తున్నారు. 49 స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీల్లో క్లినికల్, నాన్-క్లినికల్లో ల్యాటరల్ ఎంట్రీ కోసం 501 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 367 దరఖాస్తులు అర్హత సాధించగా, మిగిలిన దరఖాస్తులు రిజెక్ట్ అయ్యాయి. అర్హత పొందిన దరఖాస్తుల ఆధారంగా 113 పోస్టులు మాత్రమే భర్తీ కాగా, 134 పోస్టులు అలాగే మిగిలిపోయాయి. అత్యధికంగా నాన్-క్లినికల్ విభాగంలో ఫిజియాలజీ 21, అనాటమీ 13, మైక్రోబయాలజి 10, క్లినికల్లో రేడియాలజీలో 10 పోస్టులు భర్తీ అవ్వలేదు.

పాదయాత్రకు టీడీపీ జనసమీకరణ

వైఎస్సార్సీపీ నేత విజయసాయిరెడ్డి



సాక్షి, అమరావతి: అమరావతిని రాష్ట్రానికి ఏకైక రాజధానిగా కొనసాగించాలంటూ అరసవల్లికి బయల్దేరిన పాదయాత్ర.. పూర్వపు టీడీపీ సర్కారుకు భూములిచ్చిన రైతులకు సంబంధించిన వ్యవహారంగానే ప్రజలకు అర్థమవుతోందని వైఎస్సార్సీపీ నేత విజయసాయిరెడ్డి అన్నారు. అమరావతి అధికార హోదా మారితే తాము నష్టపోతామని అనుమానిస్తున్న రైతులు ఉత్తరాంధ్రకు ఊరేగింపుగా వెళ్తుండగా టీడీపీ నేతలు వారికి జనసమీకరణ చేస్తున్నారని సోమవారం ఆయనొక ప్రకటనలో తెలిపారు. పాదయాత్రను చూసేందుకు గుమిగూడిన జనమంతా అమరావతికి మద్దతుదారులనే రీతిలో చంద్రబాబు, ఆ పార్టీ నేతలు మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. మహా పాదయాత్ర లక్ష్యం కేవలం స్థానిక రైతుల ఆర్థిక ప్రయోజనాల పరిరక్షణేనని, ఈ విషయం రాష్ట్ర ప్రజలకు తెలుసునని ఆయన వివరించారు. అమరావతి పరిధిలోని 25-30 గ్రామాలకు చెందిన రైతుల ఆందోళనను ఒక గొప్ప ప్రజా ఉద్యమంగా చిత్రించి రాజకీయ లబ్ధిపొందడానికి చంద్రబాబు బృందం చేసే కుట్రలు ఫలించవన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Survey no 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402. and Pulished at Survey No. 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08942-281444, 499, 466 Fax No. 08942-281666 RNI Regn No. APTEL/2008/23798. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి
శ్రీకాకుళం

మంగళవారం । 27 । సెప్టెంబర్ । 2022



గతం కంటే మెరుగ్గా..
జీఆర్‌ఏయూలో డిగ్రీ ఫలితాలు గతం కంటే మెరుగయ్యాయి. సంస్కరణలు మంచి ఫలితాలు ఇస్తున్నాయి. - IIలో



ఖోఖో పోటీలు ప్రారంభం
రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు ఇచ్ఛాపురంలో ప్రారంభమయ్యాయి. నిర్వాహకులు చక్కటి ఏర్పాట్లు చేశారు. - IIలో

ప్రకృతి వ్యవసాయంతో మేలు


బూర్జ: బూర్జలోని పాలవలస ఆర్‌బీకేలో సోమవారం వైఎస్సార్ పొలం బడి నిర్వహించారు. ఈ పొలం బడి కార్యక్రమంలో మూడు రకాల అంశాలపై ముప్పై మందికి శిక్షణ అందించారు. ప్రకృతి వ్యవసాయంతో రైతులకు మేలు జరుగుతుందని డీడీఏ ఎఫ్‌టీసీ కె.త్రినాథరావు అన్నారు.

న్యూస్‌రీల్

కొత్తూరు తహసీల్దార్‌కు షోకాజ్ నోటీసు
శ్రీకాకుళం పాతబస్టాండ్: కొత్తూరు మండలం మెట్టూరు గ్రామానికి చెందిన దళితుల భూమి అక్రమాలకు సంబంధించి కొత్తూరు తహసీల్దార్ పి.బాలకు కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ సోమవారం షోకాజ్ నోటీసులు జారీచేశారు. దళితుల భూముల విషయంలో ఆర్‌ఓఆర్ చట్టాన్ని ఉల్లంఘించారన్న అభియోగంపై ఆమెకు షోకాజ్ జారీ చేశారు. మెట్టూరు గ్రామానికి చెందిన గుంట మిన్నారావు, అలికానే వరలక్ష్మి, దుక్క జోగలమ్మకు సంబంధించి 94 సెంట్ల భూముల ఆక్రమణపై బాధితులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కలెక్టర్ స్పందించారు.

భూ సర్వే నమోదు పరిశీలన


సర్వే నమోదు అంశాలను కంప్యూటర్‌లో పరిశీలిస్తున్న బొప్పరాజు వెంకటేశ్వర్లు

శ్రీకాకుళం పాబస్టాండ్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెవెన్యూ సర్వీసుల సంఘం అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వరరావు సోమవారం శ్రీకాకుళం తహసీల్దారు కార్యాలయాన్ని సందర్శించారు. అక్కడ కార్యాలయంలో భూ సర్వేకు సంబంధించిన డేటాను పరిశీలించారు. సర్వే తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే ఆయన సోమవారం ఉదయం కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, జేసీ విజయసునీతలను కలిసి రెవెన్యూ క్రీడోత్సవాలకు ఆహ్వానించారు. రెవెన్యూ శాఖ ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు.

ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలు
శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో గల గ్రామ/వార్డు సచివాలయాల్లో ప్రజల సౌకర్యార్థం 122 ఆధార్ నమోదు, మార్పులు చేర్పుల కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆధార్ నోడల్ అధికారి వాసుదేవరావు తెలిపారు. ఈ కేంద్రాల్లో కొత్తగా ఆధార్ నమోదు చేసుకునేందుకు, ఆధా ర్ కార్డులో వ్యక్తి సమాచారం మార్పు చేసేందుకు బయోమెట్రిక్ అప్‌డేషన్ ఉంటుందని ఆయన తెలిపారు. ఈ నెల 27, 28 తేదీల్లో అదనంగా జిల్లాలో 83 గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. 5 నుంచి 15 ఏళ్ల వయసు నిండిన బాల బాలికలకు తప్పనిసరిగా వారి ఐరిస్ (కళ్లు), వేలిముద్రలు అప్‌డేట్ చేసుకోవాలని తెలిపారు.

68 మంది కళాకారులకు గుర్తింపు కార్డులు
శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలోని వివిధ కళా రంగాలకు చెందిన 68 మంది కళాకారులకు గుర్తింపు కార్డులను మంజూరుచేయాలని జిల్లా పర్యాటక అధికారి ఎస్.నారాయణరావును కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఆదేశించారు. కళాకారులకు గుర్తింపు కార్డుల మంజూరు విషయమై జిల్లా స్థాయి కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన కలెక్టర్ బంగ్లాలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా జిల్లాకు చెందిన 76 మంది కళాకారులు గుర్తింపు కార్డులను కోరుతూ దరఖాస్తులు చేసుకోగా, అందులో 8 మంది కళాకారులు సరైన ధ్రువీకరణ పత్రాలను సమర్పించని కారణంగా వారిని అనర్హులుగా గుర్తించినట్లు జిల్లా పర్యాటక అధికారి కలెక్టర్‌కు తెలిపారు. దీంతో అర్హత కలిగిన మిగిలిన 68 మంది కళాకారులకు గుర్తింపు కార్డులు మంజూరుచేయాలని కలెక్టర్ ఆదేశించారు. వీటితో పాటు ఇంకా ఎవరైనా అర్హత కలిగిన కళాకారులు దరఖాస్తు చేసుకుంటే వారికి కూడా మంజూరు చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

కళా వారి రాబంధువు



- ఎచ్చెర్ల టీడీపీలో వసూళ్ల రగడ
- మాజీ మంత్రి కళా వెంకటరావు బంధువు నిర్వాకంపై చర్చ
- టీడీపీ అధికారంలో ఉండగా ఆవులు, గేదెలు, ఇళ్లు ఇప్పిస్తామని భారీగా వసూళ్లు
- మూడేళ్లుగా జనాలను తిప్పుతున్న వైనం


తెలుగుదేశం జమానాలో జన్మభూమి కమిటీల పెత్తనాలు.. ఆ ముసుగులో వారి ఆగడాల గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. అప్పటి మంత్రులు, ఎమ్మెల్యేల బంధువులు సైతం జన్మభూమి కమిటీ నేతలమంటూ జనంపై స్వారీ చేసేవారు. పథకాలు కావాలంటే ముడుపులు కట్టాల్సిందేనంటూ విచ్చలవిడిగా వసూళ్లకు తెగబడేవారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలో మాజీమంత్రి కళా వెంకటరావు బంధువు ఒకాయన కూడా రాబంధువులా మారి జనాలను పీక్కు తిన్నాడు. ప్రభుత్వ పథకాల ద్వారా ఆవులు, గేదెలు, ఇళ్లు ఇప్పిస్తామంటూ వేలకు వేలు వసూలు చేశాడు. అలాగని పథకాలు మంజూరు చేయించలేదు.. దండుకున్న డబ్బులూ తిరిగి ఇవ్వలేదు. దీనిపై అప్పట్లోనే బాధితులు నిలదీసినా అధికార మదంతో అణచి వేశారు. మూడేళ్ల తర్వాత కూడా తమ డబ్బులు రాకపోవడంతో బాధితులంతా మూకుమ్మడిగా కళా వారి నివాసానికి వెళ్లి నిలదీశారు. రోడ్డెక్కి రచ్చ చేస్తామని హెచ్చరించారు. దాంతో ఉలిక్కిపడిన కళా కుటుంబీకులు కొందరికి చెల్లింపులు జరిపారు.

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

ఎచ్చెర్ల నియోజకవర్గంలో టీడీపీ నేతల వ్యవహారాలు రోజుకొకటిగా బయటపడుతున్నాయి. మాజీ మంత్రి కిమిడి కళా వెంకటరావు బంధువు పంచాయితీ ఇప్పటికీ పరిష్కారం కాలేదు. అధికారంలో ఉన్నప్పుడు అందరి వద్ద డబ్బులు తీసుకుని, ఆ తర్వాత ముఖం చాటేయడం పంచాయితీ కళా వద్దకు చేరడంతో కొన్ని రోజులుగా నియోజకవర్గంలో ఇదే చర్చ నడుస్తోంది.

తెలిసిన బాగోతమే
టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల పెత్తనం అంతా ఇంతా కాదు. కమిటీ సభ్యుల ముసుగులో టీడీపీ నేతలు చెలరేగిపోయారు. ప్రజలకు ఏం కావాలన్నా ముడుపులు ముట్టజెప్పాల్సిన పరిస్థితులు ఉండేవి. సంక్షేమ పథకాలు అందాలంటే చేతులు తడపాల్సి వచ్చేది. ప్రతి పథకానికి ఒక రేటు పెట్టి వసూళ్ల దందా చేశారు. ఇక, నాడు మంత్రులు, ఎమ్మెల్యేలుగా పదవులు చేపట్టిన నాయకుల బంధువులు, అనుచరులైతే మరింత రెచ్చిపోయారు. అయిన దానికి కాని దానికి ప్రజలను పీడించేశారు. కొన్ని పథకాలు మంజూరు చేస్తామంటూ డబ్బులు తీసుకుని చేతులెత్తేసిన పరిస్థితులు ఉన్నాయి. అలాంటి ఘటనలు ఇప్పుడు టీడీపీలో రచ్చ చేస్తున్నాయి. ఆ పార్టీలో గొడవకు దారితీస్తున్నాయి.

కళా వద్దకు చేరిన పంచాయితీ..
వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చినా కూడా వారిలో స్పందన లేదు. దీంతో బాధితులంతా ఏకమై మాజీ మంత్రి కళా వెంకటరావు నివాసం ఉంటున్న రాజాం వెళ్లి గట్టిగా నిలదీశారు. పథకాల కోసం తీసుకున్న డబ్బులు తిరిగి చెల్లించకపోతే రోడ్డెక్కుతామని, అవసరమైతే మీడియాకు తెలియపరుస్తామని కళా ముందే హెచ్చరించారు. దీంతో కళాతో పాటు ఆయన బంధువు ఉలిక్కి పడ్డారు. ఇది కాస్త వివాదంగా మారింది. మీడియా ప్రతినిధులకు, నియోజకవర్గ టీడీపీ కేడర్‌కు ఇదంతా తెలిసింది. చెప్పాలంటే దావానంలా వ్యాపించింది. దీంతో గుట్టుగా యుద్ధ ప్రాతిపదికన ఒక్కొక్కరికీ వెయ్యి రూపాయలు తగ్గించేసి కొంతమందికి చెల్లింపులు చేశారు. మరికొంత మందికి చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ఈ తంతు ఇప్పుడు జి.సిగడాం మండలంలోనే కాకుండా ఎచ్చెర్ల నియోజకవర్గంలోనే హాట్ టాపిక్ అయింది.

పథకాల కోసం వసూళ్లు


జి.సిగడాం మండలం నిద్దాం, అద్వానంపేట గ్రామాల్లో తెలుగు దేశం ప్రభుత్వం హయంలో ఆవులు, గేదెలు రాయితీపై మంజూరు చేస్తామని 40 మంది లబ్ధిదారుల నుంచి మాజీ మంత్రి కిమిడి కళా వెంకటరావు బంధువు అధిక మొత్తంలో వసూళ్లు చేశారు. ఆ గ్రామంలో జన్మభూమి కమిటీ నాయకుడిగా పెత్తనం చెలాయిస్తూ పథకాల పేరుతో భారీ మొత్తంలో లబ్ధిదారుల నుంచి తీసుకున్నారు. ఇళ్లు కూడా మంజూరు చేస్తామని చెప్పి వసూళ్లకు తెగబడ్డారు. ఒక్కొక్కరి దగ్గరి నుంచి రూ.20వేలు వరకు తీసుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కానీ, వారికి న్యాయం చేయలేదు. చెప్పినట్టుగా ఆవులు, గేదెలు, ఇళ్లు మంజూరు చేయించలేదు. అలాగని తీసుకున్న డబ్బులు వెనక్కి ఇవ్వలేదు. ఇదే విషయమై టీడీపీ హయాంలో జరిగిన జన్మభూమి–మా ఊరు గ్రామసభలో కూడా అప్పట్లో కొందరు నిలదీశారు. ఇదిగో అదిగో అంటూ తాత్సారం చేస్తూ వచ్చారే తప్ప టీడీపీ ప్రభుత్వం దిగిపోయేవరకు వాపసు చేయలేదు.

హాట్ టాపిక్

ఎమ్మెల్సీగా సుధాకర్ గెలుపే లక్ష్యం

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎన్‌రోల్‌మెంట్ కీలకం: మంత్రులు ధర్మాన, సీదిరి
- చరిత్ర తిరగరాయాలి: ధర్మాన కృష్ణదాస్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు. చిత్రంలో మంత్రి అప్పలరాజు, పార్టీ జిల్లా అధ్యక్షుడు కృష్ణదాస్, జెడ్పీ చైర్‌పర్సన్ విజయ, ఎమ్మెల్సీ దువ్వాడ, ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్ తదితరులు


శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా ప్రతిపాదించిన సీతంరాజు సుధాకర్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని రాష్ట్ర మంత్రులు ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజులు సూచించారు. ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌తో కలిసి పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అధ్యక్షతన సోమవారం శ్రీకాకుళంలోని పార్టీ కార్యాలయంలో ఆత్మీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు ఎంతో విభిన్నమైనవన్నారు. ఈ ఎన్నికల్లో పోటీ ప్రచారం కంటే అర్హుల ఎన్‌రోల్‌మెంట్ కీలకమని అన్నారు. దీన్ని సమగ్రంగా చేయాలని సూచించారు. ప్రతి మండలాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని ఎన్‌రోల్‌మెంట్ పూర్తి చేయాలని తెలిపారు. అందరూ కలిసి సమష్టిగా పని చేసి విజయాన్ని సాధించాలన్నారు. ఎమ్మెల్సీగా పోటీచేయనున్న సీతంరాజు సుధాకర్ మంచి అభ్యర్థి అని అన్నారు.

మంత్రి సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ ఎన్‌రోల్‌మెంట్‌లో నిర్లక్ష్యం, ఉదాసీనత పనికి రాదన్నారు. తొలి ప్రాధాన్యత ఓటు, రెండో ప్రాధాన్యత ఓటు వంటి వాటి గురించి అవగాహన కల్పించాలని సూచించారు. ఎన్‌రోల్‌మెంట్ సమయంలో పట్టభద్రులతో నేరుగా మాట్లాడాలని తెలిపారు. సదస్సుకు అధ్యక్షత వహించిన పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ ఎన్నికలు ఏవైనా అంతిమంగా విజయం వైఎస్సార్‌సీపీదేనన్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సత్తా చాటి విమర్శకుల నోళ్లు మూయించాలని పిలుపునిచ్చారు. పట్టణాల్లో వైఎస్సార్ సీపీ ఓటర్లు లేరనే విమర్శను తిప్పికొట్టాలన్నారు.

సదస్సులో జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ తదితరులు మాట్లాడుతూ అధిష్టానం నిర్ణయమే శిరోధార్యంగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో పనిచేస్తామని తెలిపారు. ఈ సదస్సులో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ అభ్యర్థి సీతంరాజు సుధాకర్, మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి, కార్పొరేషన్ల చైర్మన్లు అంధవరపు సూరిబాబు, పేరాడ తిలక్, శ్యామ్ ప్రసాద్ రెడ్డి, నర్తు రామారావు, ఎంపీ పద్మావతి, చల్ల సుగుణ, పిలక రాజ్య లక్ష్మి, ఎన్ని ధనుంజయరావు, శిమ్మ రాజశేఖర్, మెంటాడ స్వరూప్, చౌదరి సతీష్, పతివాడ గౌరీశ్వరరావు, గొండు కృష్ణమూర్తి, కింతలి రమేష్ బాబు, అంబటి శ్రీను, పొన్నాడ రుషి, రాజాపు అప్పన్న,అంధవరపు ప్రసాద్, మండవల్లి రవి, కోణార్క్ శ్రీను, చల్లా అలివేలు మంగ, టి కామేశ్వరి, చింతాడ గణపతి, శ్రీనివాస్ పట్నాయక్, మీసాల నీలకంఠం, పిన్నింటి సాయికుమార్, సువ్వారి గాంధీ, మార్పు పృథ్వీ, గంగు శారద, తదితరులు ఉన్నారు.



శ్రీకాకుళం కల్చరల్: డే అండ్ నైట్ వద్ద మోటారు కార్మికుల యూనియన్ ఆధ్వర్యంలో ఊరేగింపు



లావేరు: రజత కవచాలంకృత కనకదుర్గాదేవిగా దర్శనమిచ్చిన లావేరు కనకదుర్గ ఆలయంలోని దుర్గాదేవి

అవతార స్వరూపిణి..


తొమ్మిది రోజులు.. తొమ్మిది అవతారాలు.. నవవిధ పూజల క్రతువు సోమవారం మొదలైంది. శరన్నవరాత్రుల ప్రారంభానికి గుర్తుగా ఊరూరా అమ్మ మండపాలు ఏర్పాటయ్యాయి. శ్రీముఖలింగంలో వారాహి అమ్మవారికి, పాతపట్నంలో నీలమణి దుర్గ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాతపట్నంలో ఎమ్మెల్యే రెడ్డి శాంతి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. జిల్లావ్యాప్తంగా దుర్గామాత ఆలయాల్లో ప్రత్యేక అలంకరణలు, పూజలు జరిగాయి.



శ్రీకాకుళం కల్చరల్: గుడివీధిలోని ఉమారుద్రకోటేశ్వరస్వామి సన్నిధిలో శ్రీరాజరాజేశ్వరీ అమ్మవారు




కాశీబుగ్గ: సూదికొండలో ఏర్పాటు చేసిన దుర్గమ్మ విగ్రహం



శ్రీకాకుళం కల్చరల్: ఫాజుల్‌బాగ్ పేటలోని భద్రమహంకాళి



శ్రీముఖలింగంలో వారాహి అమ్మవారు



శ్రీకాకుళం కల్చరల్: మొండేటివీధిలో స్వర్ణ కవచాలంకృత కనకదుర్గాదేవి



పాతపట్నం: నీలమణి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



పాతపట్నం: ప్రత్యేక అలంకరణలో పూజలు అందుకుంటున్న నీలమణి దుర్గ అమ్మవారు



కవిటి: జగతి గ్రామంలోకి అమ్మవారిని ఆహ్వానిస్తున్న దృశ్యం

సమస్యలు సకాలంలో పరిష్కరించాలి: కలెక్టర్

స్పందన ఫోకస్

శ్రీకాకుళం పాతబస్టాండ్: స్పందనలో నమోదవుతున్న సమస్యలను సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అధికారులను ఆదేశించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఎం.విజయ సునీత అర్జీలు స్వీకరించారు. కొత్తూరు తహసీల్దార్ దళితుల భూమిని ఇతరులకు అప్పగిస్తున్నారని పలువురు దళిత రైతులు ఆందోళన చేసి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ స్పందన పోర్టల్‌లో ఉన్న ఆయా శాఖలకు సంబంధించిన అర్జీలను పరిష్కరించాలని సూచించారు. వివిధ శాఖల్లో రీ ఓపెన్‌లో ఉన్న అర్జీలు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏపీ సేవా పోర్టల్‌లో అర్జీలు 76 పెండింగ్‌లో ఉండగా ఇందులో విద్యుత్, మున్సిపాలిటీ, తదితర శాఖల అర్జీలు ఉన్నట్లు వివరించారు. అర్జీల విచారణకు వెళ్లిన ఫొటోలు అప్‌లోడ్ చేయాలని చెప్పారు. అప్ లోడ్ చేయని జిల్లా అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయనున్నట్లు చెప్పారు.

విభిన్న ప్రతిభావంతులకు కిట్లు పంపిణీ

శ్రీకాకుళం పాతబస్టాండ్: విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులకు కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ సోమవారం కిట్లు అందజేశారు. జెడ్పీ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో 38 భవిత కేంద్రాల్లో ఉన్న విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులు 144 మందికి కిట్లు పంపిణీ చేశారు. 3–18 ఏళ్ల వయసున్న వారికి అందించారు. ఒక కిట్టు ధర రూ. 9450 ఉంటుందని, ఇది చదువుకోవడానికి ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.విజయ సునీత, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



స్పందనలో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, జేసీ విజయసునీత తదితరులు

ఎస్పీ స్పందనకు 37 అర్జీలు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ జీఆర్ రాధిక

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): 'స్పందన' కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులపై సకాలంలో స్పందించి చట్ట ప్రకారం పరిష్కారం చూపాలని ఎస్పీ జీఆర్ రాధిక పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో స్పందన కార్యక్రమంలో ఎస్పీతోపాటు అదనపు ఎస్పీలు కె.శ్రీనివాసరావు, టీపీ విఠలేశ్వరరావు ఫిర్యాదులు స్వీకరించారు. మొత్తం 37 మంది వినతులు అందించారు.

'స్పందన' వద్ద చేనేత వస్త్ర ప్రదర్శన
శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా పరిషత్ సమావేశ మందిరం వద్ద సోమవారం స్పందన కార్యక్రమం సందర్భంగా చేనేత వస్త్ర ప్రదర్శన నిర్వహించారు. ప్రతి సోమవారం చేనేత వస్త్రాలు ధరించాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఇదివరకే సూచించారు. కలెక్టరేట్ చాలా ఏళ్లుగా ఇలా చేనేత వస్త్రాలు విక్రయించేవారు. స్పందన కూడా అక్కడే జరిగేది. కోవిడ్ తర్వాత స్పందనను జెడ్పీ హాల్‌కు మార్చారు. ఈ క్రమంలో చేనేత వస్త్రాల విక్రయాలు కూడా స్పందన హాల్ వద్దనే ఈ వారం నుంచి ఏర్పాటు చేశారు. అధికారులు, ఉద్యోగులు, ప్రజలకు అందుబాటులో వస్త్రాలను ఉంచారు. ఆప్కో ఆధ్వర్యంలో ఈ విక్రయాలు జరుగుతున్నాయి.



స్పందన వద్ద చేనేత విక్రయాలు

జాతి ఆవుకు పుంగనూరు దూడ

మండల కేంద్రంలోని జేఆర్ పురం గ్రామానికి చెందిన కోటేశ్వరరావుకు చెందిన జాతి ఆవుకు పుంగనూరు ఆవుదూడ పుట్టిందని రణస్థలం పశుసంవర్ధక సహాయ సంచాలకుడు బి.దుర్గారావు తెలిపారు. ఆయన సోమవారం దూడను పరిశీలించారు. బయట నుంచి తీసుకువచ్చిన బ్రీడ్‌ను జాతి ఆవుతో సంపర్కం చేయించినట్లు తెలిపారు. దీని వల్ల 20 అంగుళాల ఎత్తు, 22 అంగుళాల పొడవు గల పుంగనూరు దూడ జన్మించిందని తెలిపారు. ఈ పశువు 90 సెంటీమీటర్ల ఎత్తు మాత్రమే ఉంటుందని అన్నారు. ఈ ఆవుల ధర రూ.లక్ష నుంచి రూ.ఇరవై లక్షల వరకు ఉంటుందని చెప్పారు. –రణస్థలం



పుంగనూరు దూడను పరిశీలిస్తున్న వైద్యుడు

క్లుప్తంగా

ఉత్సవానికి వేళాయె..

- నేటి నుంచి కొత్తమ్మతల్లి ఉత్సవాలు
- ఏర్పాట్లు పూర్తి



అమ్మవారి ఆలయం వద్ద ఏర్పాట్లు (ఇన్‌సెట్లో) కొత్తమ్మతల్లి అమ్మవారు

కోటబొమ్మాళి: కొత్తమ్మతల్లి ఉత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. దీని కోసం నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జాతీయ రహదారి కొత్తపేట జంక్షన్ నుంచి కోటబొమ్మాళి రైతు బజార్ వరకూ విద్యుత్ అలంకరణ, స్వాగత ద్వారాలు, ఆలయం వద్ద భక్తుల కోసం షామియానాలు, క్యూలైన్లు ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు స్థానిక ఎస్సై షేక్ ఖాదర్ బాషా తెలిపారు. గత రెండేళ్లు కరోనా కారణంతో ఉత్సవాలు నామమాత్రం జరిగాయి. ఈసారి నాలుగు లక్షలకుపైగా భక్తులు అమ్మవారిని దర్శించుకునే అవకాశం ఉందని ఆలయ కమిటీ చైర్మన్ బోయిన మాధవి, ఈవో వీవీ సూర్యనారాయణ తెలిపారు. మూడు రోజులు జరగనున్న ఉత్సవాల సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు.

మత్స్యకారుల స్థితిగతులపై ట్రైనీ ఐఏఎస్‌ల అధ్యయనం



శిక్షణలో ఉన్న అధికారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటరమణ

సోంపేట: మండలంలోని తీర ప్రాంతంలోని మత్స్యకారుల స్థితిగతులపై పలు ట్రైనీ ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్ అధికారులు సోమవారం అధ్యయనం చేశారు. ఉప్పలాం పంచాయతీ బట్టిగళ్లూరులో వారు పర్యటించారు. ఎంపీడీఓ బెందాళం వెంకటరమణ, తహసీల్దార్ ఎస్.రమేష్ వారికి వివరాలు తెలియజేశారు. మూడు రోజుల పాటు సోంపేట, వజ్రపుకొత్తూరు మండలాల్లో పర్యటించనున్నట్లు శిక్షణ అధికారులు పేర్కొన్నారు. గ్రామంలో పర్యటించి మత్స్యకారుల జీవన విధానం, వారి ఆహారపు అలవాట్లు, ఆదాయ మార్గాలు, పారిశుద్ధ్యంపై వివరాలు సేకరించారు. రామేంద్ర ప్రసాద్, మోహిత్ కాసిన్య, రాజ్ ఆనంద్, శారదా శుక్లా, ట్వింకిల్ జైన్, విశాల్ కత్రిలు పర్యటించారు.

విద్యార్థులపై దాడి



గాయపడిన కార్తీక్, నాని

టెక్కలి రూరల్: కె.కొత్తూరు గ్రామానికి చెందిన ధర్మాన కార్తీక్, అతని స్నేహితుడు ఎ.నానిపై కొంతమంది వ్యక్తులు దాడి చేశారు. దీంతో వారిద్దరూ గాయపడ్డారు. టెక్కలి పంచాయతీ పరిధి గోపీనాథపురంలోని ఓ ప్రైవేట్ ఐటీఐలో వీరిద్దరూ చదువుతున్నారు. సోమవారం కాలేజీ విడిచిపెట్టిన తరువాత కార్తీక్, నాని రైలు పట్టాల పక్క నుంచి నడిచి వస్తుండగా రాంపురం గ్రామానికి చెందిన తిర్లంగి ప్రదీప్ తోపాటు మరో నలుగురు కర్రలతో వారిపై దాడి చేశారు. గాయపడిన వీరిని స్థానికులు టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ విషయాన్ని టెక్కలి పోలీసుల వద్ద ప్రస్తావించగా గాయపడిన కార్తీక్, దాడి చేసిన ప్రదీప్ మధ్య గొడవలు ఉన్నాయన్నారు. ఇరువురిపై బైండోవర్ కేసులు ఉన్నట్టు చెప్పారు. ఈ నేపథ్యంలోనే కార్తీక్ అతని స్నేహితుడుపై దాడి జరిగి ఉండవచ్చునన్నారు. క్షతగాత్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	50,200–00
బంగారం(22సి. 10గ్రా.)	46,600–00
వెండి (కిలో)	60,700–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 435.00
విజయనగరం	రూ. 439.00
శ్రీకాకుళం	రూ. 439.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹140	₹235	₹ 235

గతంకంటే మెరుగ్గా..

- సత్ఫలితాలు ఇస్తున్న సంస్కరణలు
- మెరుగుపడిన డిగ్రీ ఫలితాలు



ఎచ్చెర్ల క్యాంపస్:

ఉన్నత విద్యాశాఖ చేపడుతున్న సంస్కరణలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. ఉన్నత విద్యలో కీలకమైన డిగ్రీలో ఫలితాలు మెరుగు పడతుండడం దీనికి ఉదాహరణగా చెప్పవచ్చు. కొన్నేళ్ల క్రితం ఉత్తీర్ణత శాతం తక్కువగా నమోదయ్యేది. శ్రీకాకుళం (ఎచ్చెర్లలో) డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం 2008 జూన్ 25న ఏర్పాటు కాగా.. 2010లో అప్పటికి ఆంధ్రా యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న కళాశాలలు జిల్లాకు సంబంధించి స్థానిక వర్సిటీకి అప్పగించారు. ప్రస్తుతం శ్రీకాకుళం జిల్లాతో పాటు, పాలకొండ, రాజాం నియోజకవర్గాల్లోని డిగ్రీ కళాశాలలు అఫిలియేషన్‌గా ఉన్నాయి. అఫిలియేషన్‌లో 104 కళాశాలలు ఉండగా, ఈ ఏడాది డిగ్రీ చివరి సెమిస్టర్ (ఆరో) పరీక్షలు 99 కళాశాల నుంచి రాశారు. 10,301 మంది పరీక్షకు హాజరవ్వగా 6,772 మంది (65.74 శాతం) ఉత్తీర్ణత సాధించారు.

వర్సిటీ పరిధిలో డిగ్రీ పరీక్షలు మొదటి సారిగా 2013లో నిర్వహించారు. అప్పట్లో ఇయర్ ఎండ్ పద్ధతిలో పరీక్షలు ఉండేవి. ఏడాదికి మూడుసార్లు రెగ్యులర్ పరీక్షలు నిర్వహించేవారు. విద్యలో సంస్కరణలు, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ సూచనల మేరకు ప్రస్తుతం ఏడాదికి రెండు సెమిస్టర్లు విద్యార్థులు రాస్తున్నారు. 2016 నుంచి సెమిస్టర్ విధానం అమలు చేస్తున్నారు. సెమిస్టర్, ఇయర్ ఎండ్ విధానంలో పరీక్షలు నిర్వహించినా ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం తక్కువగా ఉండేవి. ప్రస్తుతం ప్రత్యేక సంస్కరణలు పెట్టడంతో ఫలితాలు మెరుగుపడ్డాయి.

మరింత దృష్టి పెడితే..

ఇప్పటి వరకు విడుదల చేసిన ఫలితాల్లోకల్లా ఈ ఏడాది అత్యధిక శాతం మంది ఉత్తీర్ణ సాధించారు. మరో పక్క కొన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలు మెరుగైన ఫలితాలు సాధిస్తున్నాయి. అన్ని కళాశాలలపై పూర్తిస్థాయి దృష్టిపెడితే 70 శాతం దాటి ఫలితాలు సాధించే అవకాశం ఉంది. కొన్ని కళాశాలలు 80 శాతం దాటి సైతం ఫలితాలు సాధించాయి. ప్రభుత్వ కళాశాలల్లో పాలకొండ 83.56, బారువలో 80.91 శాతం సాధించగా, ప్రైవేట్ కళాశాలల్లో శ్రీకాకుళంలోని కాకినాడ ఆదిత్య 94.38 శాతం, కాకినాడ శ్రీఆదిత్య 85.17, రాజాం జీసీఎస్ఆర్ 85.17 శాతం ఫలితాలు సాధించాయి. వర్సిటీ పరిధిలో ఐదు కళాశాలలు 80 శాతం దాటి ఫలితాలు నమోదు చేసుకున్నాయి.

ప్రత్యేక దృష్టి..

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలపై ఉన్నత విద్యశాఖ ప్రత్యేక దృష్టిపెడుతుంది. విద్యార్థులు, అధ్యాపకుల హాజరులో ఫేస్ రికగ్నేషన్ సిస్టం అమలు, అర్హత గల బోధకుల పరిశీలనకు ర్యాటిఫికేషన్, వరుసుగా మూడేళ్ల పాటు 30 శాతం ప్రవేశాలు లేని కళాశాలల్లో ప్రవేశాలు నిలిపివేత, అర్హత గల ప్రిన్సిపాల్ నియామకం వంటి అంశాలపై దృష్టి పెట్టారు. రెండు అంశాలకు ప్రాధాన్యత ఇస్తే భవిష్యత్తులో మంచి ఫలితాలు సాధ్యమవుతాయి. కొన్ని ప్రైవేట్ కళాశాలల్లో ఉద్యోగ, ఉపాధికి సంబంధించిన అంశాల్లో శిక్షణ ఇస్తూ మెరుగైన ఫలితాలు సాధిస్తున్నాయి. గతంలో కొన్ని ప్రైవేట్ కళాశాలల్లో చేరాలంటే ఇంటర్మీడియెట్‌లో 90 శాతం మార్కులు ఉండాలి. అలాగే ప్రవేశ పరీక్ష నిర్వహించి ప్రతిభ పరిశీలించి సీటు ఇచ్చేవారు. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో రాష్ట్రం యూనిట్‌గా ప్రవేశాలు జరుగుతున్నాయి. ఇంటర్‌లో మార్కులు, రిజర్వేషన్ రోస్టర్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తున్నారు.

మెరుగైన ఫలితాలే లక్ష్యం



ఈ ఏడాది ఫలితాలు మెరుగ్గా వచ్చాయి. భవిష్యత్తులో ఇంకా మెరుగ్గా ఫలితాలు వచ్చేలా సంస్కరణలు అమలు చేస్తాం. ఇప్పటికే ప్రమాణాలు పాటించని 12 కళాశాలల్లో మొదటి ఏడాది ప్రవేశాలు నిలిపివేశాం. కళాశాలల్లో ఫేస్ రికగ్నేషన్ సిస్టం అమలు చేస్తాం. విద్యార్థుల హాజరు పెంచటం, అర్హత గల బోధన సిబ్బంది కళాశాలల్లో పనిచేసేలా పర్యవేక్షణ పెంచుతాం. ఒకటి నుంచి చివరి సెమిస్టర్ వరకు మెరుగైన ఫలితాల సాధనే లక్ష్యం.

– హెచ్‌ఏ రాజేంద్ర ప్రసాద్, రిజిస్ట్రార్, బీఆర్‌ఏయూ

ఫలితాలు సరళి ఇలా..

ఏడాది	ఫలితాలు	ఏడాది	ఫలితాలు
2013	48.72	2017	46.41
2014	31.35	2018	34.77
2015	39.52	2019	59.88
2016	36.34	2020	63.37
		2021	62.69
		2022	65.76

కరెంటు బిల్లు కట్టమంటే..

కాశీబుగ్గ:



విద్యుత్ బిల్లు కట్టమంటే ఓ టీడీపీ నాయకుడు తిట్ల దండకం ఎత్తుకున్నాడు. విద్యుత్ సిబ్బందిని తిట్టి పోసి బెదిరించాడు. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ 19వ వార్డులో నివాసం ఉంటున్న తెలుగుదేశం నాయకుడు, మాజీ కౌన్సిలర్ భర్త సైని వల్లభరావు సోమవారం విద్యుత్ సిబ్బందితో గొడవకు దిగాడు. సైని వల్లభకు చెందిన రెండు ఇళ్లకు విద్యుత్ బకాయి రూ.9880లు చెల్లించాల్సి ఉంది. రెండు నెలలుగా విద్యుత్ బిల్లు కట్టకపోవడంతో అధికారులు కరెంటు సరఫరా నిలిపివేశారు. దీంతో వల్లభ శివాలెత్తి సచివాలయం జేఎల్ఎం నుంచి ఏడీ వరకు అందరికీ తిట్టిపోశాడు. పెట్రోల్ పోసి చంపేస్తానని బెదిరింపులకు పాల్పడ్డాడు. దీనిపై విద్యుత్ ఏఈ ఎల్.యోగి మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగి పైల త్రినాథ్ ఏడు సార్లు వల్లభ ఇంటికి వెళ్లి మరీ సమాచారం అందించారని, అయినా ఆయన బిల్లు చెల్లించలేదని అందుకే పైనుంచి వచ్చిన ఆదేశాల ప్రకారం విద్యుత్ సరఫరా తొలగించామని తెలిపారు. దీంతో ఆయన బిల్లు కట్టినా ఫైన్ అమౌంట్ మాత్రం చెల్లించలేదని ఆ డబ్బు కూడా చెల్లిస్తే కరెంటు సరఫరా పునరుద్ధరిస్తామని తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తానని ఆయన చెప్పారు.

జాతీయ పోటీల్లో సత్తాచాటాలి

- సాఫ్ట్‌బాల్ క్రీడాకారులకు అభినందనలు



క్రీడాకారులతో సాఫ్ట్‌బాల్ సంఘ రాష్ట్ర చైర్మన్, జిల్లా సంఘ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రస్థాయి పోటీల్లో కనబర్చిన పోరాట స్ఫూర్తితో జాతీయ పోటీల్లోను రాణించి సిక్కోలు ఖ్యాతిని చాటిచెప్పాలని సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చైర్మన్, జిల్లా అధ్యక్షుడు కలిదిండి నరసింహారాజు అన్నారు. యానాం వేదికగా ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి సబ్–జూనియర్స్ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్–2022 పోటీల్లో జిల్లా బాలురు జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా శ్రీకాకుళంలో సోమవారం ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులను అభినందించి, సత్కరించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కన్వీనర్ కలిదిండి వెంకటరామరాజు, కార్యనిర్వాహక కార్యదర్శి మొజ్జాడ వెంకటరమణ, సాఫ్ట్‌బాల్ గేమ్ ప్రమోటర్ పి.జగదీష్, ఉపాధ్యక్షులు ఎం.తిరుపతిరావు, సురేష్‌కుమార్, సంయుక్త కార్యదర్శులు ఎం.ఆనందకిరణ్, ఎ.ఢిల్లీశ్వరరావు, రాజగోపాల్, మల్లేషు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్‌ను సిక్కోలు కేరాఫ్ అడ్రస్‌గా చేస్తాం

సాఫ్ట్‌బాల్ గేమ్‌ను సిక్కోలు కేరాఫ్ అడ్రస్‌గా మార్చుతామని, అందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ కలిదిండి నరసింహారాజు అన్నారు. క్రీడాకారులను అభినందించిన అనంతరం 'సాక్షి'తో మాట్లాడారు. సాఫ్ట్‌బాల్ గేమ్స్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అతికాలంలో అత్యంత ఆదరణ పొందింది శ్రీకాకుళం జిల్లాలోనేనని చెప్పారు. కొన్నేళ్ల నుంచి ప్రతి వయో విభాగంలో రాష్ట్రస్థాయి పోటీల్లో మొదటి మూడు స్థానాల్లో నిలుస్తుండడం ఇందుకు ఉదాహరణగా చెప్పవచ్చున్నారు. ఇప్పటి వరకు 30 మంది వరకు క్రీడాకారులు జాతీయ పోటీల్లో ప్రాతినిధ్యం వహించారన్నారు. గ్రామీణ స్థాయిలో కూడా సాఫ్ట్‌బాల్ గేమ్‌ను బలోపేతం చేస్తామన్నారు.

పాఠశాల స్థాయిలో ప్రతిభ కలిగిన క్రీడాకారులను గుర్తించి వారికి తరచూ రెసిడెన్షియల్ కోచింగ్ క్యాంప్‌లను నిర్వహిస్తామన్నారు. బాలురుతో పాటు బాలికలకు కూడా ప్రత్యేకంగా శిక్షణను అందిస్తామన్నారు.

ఆడ, మగ ఇద్దరూ సమానమే

- ఆర్డీవో శాంతి



మాట్లాడుతున్న ఆర్డీవో శాంతి

శ్రీకాకుళం పాతబస్టాండ్: సమాజంలో ఆడ, మగ ఇద్దరూ సమానమేనని..ఇందులో ఎటువంటి వివక్ష చూపరాదన్న విషయంపై ప్రజలకు అవగాహన కల్పించాలని రెవెన్యూ డివిజనల్ అధికారి బొడ్డేపల్లి శాంతి అన్నారు. పి.సి.పి.ఎన్.డి.టి యాక్టు అమలుపై తన చాంబర్‌లో సోమవారం డివిజనల్ స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో ప్రతి వేయి మంది పురుషులకు 953 మంది మహిళలు ఉన్నారని, ఈ నిష్పత్తి మరింత పెరగాల్సి ఉందన్నారు. స్కానింగ్ సెంటర్లతో పాటు ఇతర రాష్ట్రాల్లోని స్కానింగ్ సెంటర్లపై దృష్టి సారించాలని చెప్పారు. ఆడపిల్లలపై చులకన భావం ఉండరాదన్నారు. లింగ నిర్ధారణ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.అనూరాధ, జిల్లా పౌర సంబంధాల అధికారి కె.బి.ఎం.సింగ్, డెమో పైడి వెంకటరమణ, స్వీప్ సంచాలకులు ఎస్.రమణమూర్తి, పోలీసు అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు చిరుకానుక..



కలెక్టర్‌కు చిత్రాన్ని అందజేస్తున్న రమేష్ ఆచారి

శ్రీకాకుళం పాతబస్టాండ్: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి 21వ వార్డు గాంధీనగర్‌కు చెందిన కొత్తపల్లి రమేష్ ఆచారి సుద్దముక్కపై జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ చిత్రాన్ని చెక్కారు. దీనికి వాటర్ రంగులు వేసి అందంగా తీర్చిదిద్దారు. ఆ చిత్రాన్ని సోమవరం స్పందన కార్యక్రమం వద్ద కలెక్టర్‌కు ఆచారి అందజేశారు. జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తుండడంతో చిరుకానుకగా ఆయన చిత్రాన్ని సుద్దముక్కపై చెక్కినట్టు ఆచారి పేర్కొన్నారు.

సంకేత భాషా వారోత్సవాల బ్రోచర్ విడుదల



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: అంతర్జాతీయ సంకేత భాషా వారోత్సవాల బ్రోచర్‌ను సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ బి.లాఠకర్, జాయింట్ కలెక్టర్ విజయ సునీ త, ఇతర అధికారులు ఆవిష్కరించారు. సంకేత భాషపై సాధారణ ప్రజలకు సైతం అవగాహన కల్పించాలని జిల్లా అధికారులకు కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో డీఆర్వో రాజేశ్వరి, డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్, దివ్యాంగుల శాఖ ఏడీ ఎం.కిరణ్‌కుమార్, బదిరుల అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రయాణికుల పాట్లు



కేశవరావుపేట ప్రారంభంలో రోడ్డుపై నిలిచిన నీరు (ఇన్‌సెట్లో) చిలకపాలెంలో చెరువును తలపిస్తున్న సర్వీస్ రోడ్డు

ఎచ్చెర్ల క్యాంపస్: 16వ నంబరు జాతీయ రహదారిపై ప్రయాణికులు పాట్లు పడుతున్నారు. చిన్నపాటి వర్షానికి జాతీయ రహదారితోపాటు సర్వీస్ రోడ్డుపై నీరు నిలిచిపోతుంది. చిలకపాలెం, ఎచ్చెర్ల, కేశవరావుపేట తదితర ప్రాంతాల్లో నీరు నిలిచిపోతుండడంతో వాహనదారులు పడరానిపాట్లు పడుతున్నారు. కొంతమంది వాహన చోదకులు ప్రమాదానికి గురవుతున్నారు. ఇటీవల బైపాస్ వద్ద వర్షం నీరు నిలిచిపోవడంతో ఓ కొరియర్ సంస్థలో పని చేస్తున్న యువకుడు ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోయాడు.

మూడు రాజధానులకు మద్దతుగా 2న ర్యాలీ

- ప్రజాప్రతినిధుల సమావేశంలో నిర్ణయం



మాట్లాడుతున్న ఎంపీపీ గొండు రఘురామ్

గార:

మూడు రాజధానులకు మద్దతుగా ప్రజాభాగస్వామ్యంతో అక్టోబర్ రెండో తేదీన భారీ ర్యాలీ చేద్దామని గార ఎంపీపీ గొండు రఘురామ్ పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, యువ నాయకులతో సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమిళనాడుతో కలిసి ఉన్నప్పుడు చెన్నై, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్ అభివృద్ధి చెందిందన్నారు. ఆ తరువాత రాష్ట్రాలు విడిపోవడంతో మనకంటూ ఏమీ మిగల్లేదన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన నుంచి రాజధానుల్లో కూలీలుగా ఉత్తరాంధ్ర వాసులు ఉండిపోవాలని కొంతమంది చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

వెనుకబడిన జిల్లాలుగా ఉన్న మన ప్రాంతంలో పరిపాలన రాజధాని వస్తే వాటి ఫలాలు రాబోయే తరాలకు అందుతాయన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి తీసుకున్న మూడు రాజధానుల నిర్ణయం సరైనదేనని చెప్పాలన్నారు. విద్యావేత్తలు, రైతులు, ఆటో యూనియన్‌లు, కార్మిక వర్గాలు, యువత, వ్యాపారస్తులు, మహిళలు అందరూ పాల్గొని ర్యాలీని జయప్రదం చేయాలన్నారు. ప్రజాప్రతినిధుల ఉమ్మడి నిర్ణయంతో అక్టోబర్ రెండో తేదీన ఉదయం శ్రీకూర్మం జంక్షన్ నుంచి శ్రీకాకుళం నగరంలోని పొట్టి శ్రీరాములు జంక్షన్ వరకు ర్యాలీ చేద్దామని నిర్ణయించారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు ప్రారంభం



క్రీడాజ్యోతిని అందిస్తున్న మంత్రి సీదిరి అప్పలరాజు, ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, జెడ్పీ చైర్ పర్సన్ పిరియావిజయ

ఇచ్ఛాపురం:

క్రీడలతో విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెరుగుతుందని రాష్ట్ర పశు సంవర్ధక పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య శాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. పట్టణంలోని సురంగి రాజా క్రీడామైదానం ఆవరణలో జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇచ్ఛాపురం వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం నిర్వహిస్తున్న 32వ అంతర్‌జిల్లాల సబ్ జూనియర్ బాలబాలికల ఖోఖో పోటీలను సోమవారం రాష్ట్రమంత్రి, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ పిరియా విజయ, రాష్ట్ర ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ క్రీడలతో జీవితంలో ఆటుపోట్లను ఎదుర్కొనే విధానం తెలుస్తుందన్నారు. జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ మాట్లాడుతూ క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం బాగుపడుతుందన్నారు. అనంతరం ధర్మాన కృష్ణదాస్ క్రీడాకారుల గౌరవ వందనం స్వీకరించి క్రీడాజ్యోతిని వెలిగించారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్, ఏపి గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ చైర్మన్ నర్తు రామారావు, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్లు పిలక రాజలక్ష్మి, బల్లా గిరిబాబు, ఎంపీపీలు బోరపుష్ప, పైలదేవదాస్, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఉలాల భారతిదివ్య, జెడ్పీటీసీ ఉప్పాడ నారాయణమ్మ, రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు టిఎస్ఆర్‌కేప్రసాద్, ఎం.సీతారామిరెడ్డి, జిల్లా ఖోఖో అసోషియేషన్ అధ్యక్ష కార్యదర్శులు సీహెచ్ నాగభూషణ్, సాదు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆహార పొట్లాల అందజేత



ఆహార పొట్లాలను అందజేస్తున్న సభ్యులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: స్పందన కార్యక్రమానికి దూర ప్రాంతాల నుంచి వినతులు అందజేసేందుకు వచ్చిన వారికి సత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం అన్నదానం చేశారు. 180 మందికి ఆహార పొట్లాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రతినిధులు టి.ఎస్.ఎన్.మూర్తి, బీవీ భాస్కరరావు, బి.లింగరాజు, పి.సతీష్‌కుమార్, రాజరాజేశ్వరి, ఉమాకాంత్ చౌదరి ఉన్నారు.

సంక్షేమ పథకాల మంజూరు పత్రాల అందజేత



సంక్షేమ పథకాల మంజూరు పత్రాలను అందిస్తున్న నాయకులు

జి.సిగడాం: అర్హులకు సంక్షేమ ఫలాలు అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని దానెమ్మరాజువలస సర్పంచ్ కుమరాపు శాంతమ్మ అన్నారు. గ్రామానికి చెందిన పలువురు అర్హులైన వారికి ప్రభుత్వం మంజూరు చేసిన సంక్షేమ పథకాలకు సంబంధించిన పత్రాలను సోమవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామంలో సుమారు పది మంది లబ్ధిదారులు ఎన్నోఏళ్లుగా సంక్షేమ పథకాలు అందక నానా ఇబ్బందులు పడేవారన్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్‌కు వీరి కష్టాలను వివరించామన్నారు. ఆయన కృషితో సంక్షేమ పథకాలు మంజూరైనట్లు వెల్లడించారు. పటాన్న మణికంఠకు సదరం ధ్రువపత్రం రావడంతో ఆ కుటుంబానికి ఎంతో ధైర్యం ఇచ్చారన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యులు కుమరాపు శ్రీనివాసరావు, కుమరాపు నాగభూషణరావు, రాజు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పశువులకు లంపీ స్కిన్ వ్యాధి నిరోధక టీకాలు



గుమడాంలో పశువుకు టీకా వేస్తున్న దృశ్యం

లావేరు: మండలంలోని పలు గ్రామాల్లో పశువులకు లంపీ స్కిన్ వ్యాధి నివారణ టీకాలు వేసే ప్రక్రియ సోమవారం జరిగింది. గుమడాం, లింగాలవలస, వెంకటాపురం, లావేరు, లావేటిపాలేం, తాళ్లవలస, అదపాక, కొత్తకోట, బెజ్జిపురం గ్రామాల్లో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో సచివాలయాల వెటర్నరీ అసిస్టెంట్లు, సిబ్బంది టీకాలు వేశారు. బెజ్జిపురం, లావేరు పశువైద్య కేంద్రాల వైద్యులు డాక్టర్ జి.లావణ్య, బి.గాయత్రి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

లంపీ స్కిన్ వ్యాధి నివారణకు చర్యలు తీసుకోవాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: లంపీ స్కిన్ వ్యాధితో పశువులు చనిపోతున్నాయని, ఈ వ్యాధి విస్తరించకుండా చర్యలు తీసుకోవాలని పొందూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కలిశెట్టి అప్పలనాయుడు కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా రెవెన్యూ అధికారిణిని తన చాంబర్‌లో కలిసి వినతి పత్రం అందజేశారు. ఎచ్చెర్ల నియోజకవర్గం పరిధిలో వ్యాధి తీవ్రత ఉందన్నారు.

నేడు చేయూత సభ



మాట్లాడుతున్న రమణమూర్తి

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండల కాంప్లెక్స్‌లో మంగళవారం నిర్వహించనున్న వైఎస్సార్ చేయూత సభను విజయవంతం చేయాలని వెలుగు ఏపీఎం అర్.రమణమూర్తి కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సంక్షేమ సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ సమావేశంలో పాల్గొంటారన్నారు. ఎంపీడీవో కుమార్ పట్నాయక్, సీనియర్ సహాయకులు కిలారి నారాయణరావు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం



పాల్గొన్న మహిళలు



చేయూత లబ్ధిదారులనుద్దేశించి మాట్లాడుతున్న మంత్రి ధర్మాన

- చేయూత చెక్కు పంపిణీ కార్యక్రమంలో మంత్రి ధర్మాన ప్రసాదరావు

గార: మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని మంత్రి ధర్మాన ప్రసాదరావు చెప్పారు. గారలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద వైఎస్సార్ చేయూత మూడో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. మహిళలు కుటుంబ యజమాని కావాలన్న సంకల్పంతో పలు సంక్షేమ పథకాలను అమలు చేసే విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారన్నారు. సంక్షేమ పథకాల అమల్లో అవినీతికి తావులేకుండా వర్తింపజేస్తున్నామన్నారు. కుటుంబంలో ఉన్నటువంటి ప్రతి వ్యక్తిని తీర్చిదిద్ది ప్రయోజకులను చేసి వారి ఉన్నతికి కృషి చేసే అక్కచెల్లెళ్లకు అండగా వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందన్నారు. మూడేళ్ల కిందట మీరిచ్చిన అధికారాన్ని అందిపుచ్చుకొని ప్రతి కుటుంబానికి ఆర్థికస్థితిగతులు కల్పించడం జరుగుతోందన్నారు. ఈవిధంగా చేస్తామని ఎన్నికల ముందే చెప్పామని, ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి రాగానే ప్రారంభించామని పేర్కొన్నారు.

మూడో విడత చేయూతలో ఒక్కో మహిళకు రూ.18,750 జమ చేస్తున్నామని.. ఇది ఎన్నికల కోసం కాదన్నారు. ఇంకా ఎన్నికలకు రెండేళ్ల సమయం ఉందని పేర్కొన్నారు. చంద్రబాబు అయితే ఎన్నికలకు మూడు నెలల ముందు రూ. 4 వేలు వేసి ఆశ చూపి అధికారం చేజిక్కించుకొని రుణమాఫీ కూడా చేయలేదన్నారు. అలాగే పథకాల పేరుచెప్పి డబ్బు వృథా చేస్తున్నామని చంద్రబాబు చెబుతున్నారంటే ఒకవేళ ఆయన గెలిచి వస్తే ఈ పథకాలన్నీ రద్దు చేస్తానని చెబుతున్నారనే విషయాన్ని అర్థం చేసుకోవాలన్నారు. ప్రతిపక్షం వారు కొందరు ధరలు పెరిగాయని అంటున్నారని ఇందులో వాస్తవం లేదన్నారు. డీజిల్, పెట్రోల్, నూనె, పప్పులు దేశమంతా ఇంచుమించుగా ఒకే ధర ఉంటుందనే విషయాన్ని ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. లేనిపోని ప్రచారం చేస్తున్న నేతలను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో ఎంపీపీ గొండు రఘురాం, డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్, జెడ్పీటీసీ సభ్యురాలు మార్పు సుజాత ధర్మారావు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, వైస్ ఎంపీపీ బరాటం రామశేషు, ఏఎంసీ చైర్మన్ మూకళ్ల తాతబాబు, నాటక అకాడమీ డైరెక్టర్ ముంజేటి కృష్ణమూర్తి, పీస శ్రీహరిరావు, పీస గోపి, యాళ్ల నారాయణ, కొయ్యాన నాగభూషణం పాల్గొన్నారు.

అక్కచెల్లెమ్మల జీవితాల్లో వెలుగులు



జి.సిగడాం: చేయూత చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

- ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

జి.సిగడాం: ప్రతి మహిళను లక్షాధికారి చేయడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. అక్కచెల్లెమ్మల జీవితాల్లో వెలుగులు నింపేందుకే చేయూత పథకాన్ని అమలు చేస్తున్నట్టు చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండలానికి మంజూరైన రూ.7.23 కోట్ల విలువైన చేయూత పథకం చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు అన్ని రంగాల్లో పెద్దపీట వేస్తోందన్నారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను వర్తింప జేస్తున్నామన్నారు. విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు చెప్పారు. నాడు–నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ పట్టిందన్నారు. పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మీసాల సత్యవతి, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ మామిడి జయకుమారి, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వాన ప్రమీలరాణి, వైస్ ఎంపీపీ తోలేటి వెంకటరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు బూరాడ వెంకటరమణ, డీసీఎంఎస్ డైరెక్టర్ నక్క ప్రసాదరావు, పీఏసీఎస్ చైర్మన్ బూరాడ చిన్నారావు, ఎర్నేన ప్రకాశరావు, మక్క వెంకటిసాయి, పల్లేటి సన్యాసిరావు, పార్టీ మండల బూత్ కన్వీనర్ ఆబోతుల జగన్నాథం, నాయకులు బత్తుల సన్యాసిరావు, మాడుగుల మురళీధర్‌బాబా, ఎంపీడీవో ఎస్.శ్రీనివాసరావు, ఏపీఎం రెడ్డి రామకృష్ణంనాయుడు పాల్గొన్నారు.

నవరత్నాలతో సంక్షేమ విప్లవం

- కేశవరాయునిపాలెంలో 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కిరణ్‌కుమార్



వృద్ధురాలికి సంక్షేమాన్ని వివరిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

లావేరు: నవరత్న పథకాల అమలుతో రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డి సంక్షేమ విప్లవం తీసుకువచ్చారని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. కేశవరాయునిపాలెంలో సోమవారం సాయంత్రం 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించడంతోపాటు మూడేళ్లలో ప్రభుత్వం ద్వారా చేకూరిన లబ్ధిని తెలియజేశారు. ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా.. లేదా అని గ్రామస్తులను అడిగితెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను వలంటీర్ల ద్వారా ఇంటి వద్దకే అందజేస్తున్నామన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌ను ప్రజలంతా ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు రొక్కం బాలకృష్ణ, జెడ్పీటీసీ సభ్యుడు మీసాల సీతన్నాయుడు, ఇన్‌చార్జి ఎంపీడీవో వి.విశ్వేశ్వరరావు, తహసీల్దార్ ఎస్.దిలీప్‌చక్రవర్తి, వైస్ ఎంపీపీ అలుపన రమణమ్మ, సర్పంచ్ యాగాటి వెంకటలక్ష్మి, ఉప సర్పంచ్ నాయని సీతంనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు దన్నాన రాజినాయుడు, వ్యవసాయ సలహా మండలి జిల్లా సభ్యుడు గొర్లె అప్పలనాయుడు, ఎఫ్ఎస్‌సీఎస్ డైరెక్టరు మీసాల శ్రీనివాసరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు బూరాడ చిన్నారావు, పీఆర్, హౌసింగ్ మండల ఏఈలు ఎల్.అప్పన్న, కె.అప్పలనాయుడు, ఏవో మహేష్ నాయుడు, ఏపీఎం ఎం.మాధవీలత, ఏపీవో ఆర్.సత్యవతి, కేశవరాయునిపాలెం పంచాయతీ నాయకులు యాగాటి ఆదినారాయణ, నాయని మోహనరెడ్డి, అలుపున నారాయణరెడ్డి, నాయని లక్ష్మణరెడ్డి, నాయని వెంకటేష్, అలుపున షణ్ముఖరెడ్డి, నాయని శ్రీనివాసరెడ్డి, సిహాంద్రి మల్లిబాబు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణపై సమావేశం



మాట్లాడుతున్న కిరణ్‌కుమార్

రణస్థలం: ఎచ్చెర్ల అసెంబ్లీ నియోజకవర్గంలోని 309 పోలింగ్ కేంద్రాల్లో హేతుబద్ధీకరణ ప్రక్రియలో భాగంగా మార్పులు, నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ సనపల కిరణ్‌కుమార్ చెప్పారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణపై పలు రాజకీయ పార్టీల నాయకులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో వివిధ పార్టీలు, ఓటర్ల సూచనల మేరకు ఎనిమిది పోలింగ్ కేంద్రాలకు సంబంధించి స్థల మార్పు చేశామన్నారు. అలాగే 25 పోలింగ్ కేంద్రాలకు పేరు మార్పు చేయగా.. అన్ని రాజకీయ పార్టీలు ఆమోదం తెలిపాయన్నారు. సమావేశంలో లావేరు, జి.సిగడాం తహసీల్దార్లు దిలీప్‌చక్రవర్తి, పి.వేణుగోపాల్, ఎచ్చెర్ల డిప్యూటీ తహసీల్దార్ జి.కె.శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, రణస్థలం జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం తదితరులు పాల్గొన్నారు.

లలితాదేవికి సారె అందజేత



లలితాదేవికి సారెను అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక మొండేటివీధిలోని షిర్డీసాయి బాబా ఆలయ ప్రాంగణంలో ఉన్న లలితా దేవి అమ్మవారికి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా సోమవారం పలువురు దంపతులు సారెను అందజేశారు. అమ్మవారు మంగళవారం బాలాత్రిపుర సుందరి అవతారంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్న నేపథ్యంలో సారె అందించారు.

విగ్రహావిష్కరణ

ఎచ్చెర్ల క్యాంపస్: ఇబ్రహింబాద్ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, దివంగత సనపల ద్రోణాచార్యులు విగ్రహాన్ని గ్రామంలో సోమవారం ఆవిష్కరించారు. ఆయన సతీమణి, ఎంపీటీసీ మాజీ సభ్యురాలు విజయలక్ష్మి విగ్రహాన్ని అవిష్కరించగా స్థానికులు నివాళులర్పించారు. జిల్లా వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు జనపల నారాయణరావు, నాయకులు సూర అప్పారావు, కల్లి ప్రకాశరావు పాల్గొన్నారు.

డి.మత్స్యలేశంలో ఫాగింగ్



ఫాగింగ్ చేస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: దోమల నియంత్రణ కోసం డి.మత్స్యలేశం గ్రామంలో సోమవారం ఫాగింగ్ నిర్వహించారు. క్లీన్ ఆంధ్ర ప్రదేశ్ మిషన్‌లో భాగంగా ప్రజల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ ఈక్షిత పర్యవేక్షించారు.

మత్స్యకారుల సంక్షేమమే ధ్యేయం



లబ్ధిదారులకు కరపత్రాలు అందజేస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

- కుందువానిపేటలో 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో మంత్రి ధర్మాన

శ్రీకాకుళం రూరల్: మత్స్యకారుల సంక్షేమమే వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. కుందువానిపేట గ్రామంలో సర్పంచ్ సూరాడ సూర్యం అధ్యక్షతన 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ధర్మాన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బ్రోచర్లను అందజేశారు. ప్రభుత్వం మూడేళ్లలో చేసిన అభివృద్ధిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. టీడీపీ ప్రభుత్వ హయాంలో మత్స్యకారులు తమ హక్కుల కోసం పోరాటాలు చేస్తే చంద్రబాబు దాడులు చేయించారని గుర్తు చేశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో పలాసకు చెందిన మత్స్యకార నాయకుడు జుత్తు జగన్నాయకులను ఎమ్మెల్యే చేశారని, ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో సీదిరి అప్పలరాజుకు మంత్రి పదవి ఇచ్చారన్నారు. రాజ్యాంగ స్ఫూర్తిని చాటుతూ తాము పరిపాలన సాగిస్తున్నామన్నారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. వివిధ పథకాలు అందుకుంటున్న లబ్ధిదారులు ఆర్థిక స్వావలంబన, పురోగతి సాధించాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై తప్పుడు ప్రచారం చేస్తున్న వారిని తిప్పికొట్టాలన్నారు. ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం ఎక్కడా జరిగిన సచివాలయ సిబ్బంది, వలంటీర్లు కలిసి ప్రభుత్వ పరిపాలన గురించి మంచిగా చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో కళింగ కోమటి కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, ఎంపీపీ అంబటి నిర్మలా శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ మూకళ్ల తాతబాబు, మత్స్యకార నాయకులు కోరాడ నర్సింగరావు, చల్లా రవికుమార్, చిట్టి జనార్దన్‌రావు, గంగు నరేంద్రకుమార్, పీఏసీఎస్ చైర్మన్ గొండు క్రిష్ణ, ఎచ్చెర్ల శ్రీధర్, రొక్కం సూర్యప్రకాశరావు, బగ్గు అప్పారావు, తంగి ఈశ్వరరావు, యజ్జల గురుమూర్తి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

జి.సిగడాం: కోపరేటివ్ బ్యాంకు మాజీ అధ్యక్షుడు, సీనియర్ వైఎస్సార్‌సీపీ నాయకుడు మునగపాటి విజయరామరాజు మృతి పార్టీకి తీరనిలోటని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. పున్నాం పంచాయతీ ఎల్లయ్యపేట గ్రామంలో విజయరామరాజు కుటుంబ సభ్యుడు శ్రీనివాసరాజు తదితరులను సోమవారం పరామర్శించారు. మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, పార్టీ నాయకులు బూరాడ వెంకటరమణ, మామిడి జయకుమారి, సర్పంచులు చందక సతీష్, కుమరాపు శ్రీనివాసరావు, సాకేటి నాగరాజు తదితరులున్నారు.

దుర్గమ్మా.. కరుణించమ్మా..

- శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



ఎచ్చెర్ల క్యాంపస్: దేవీ పీఠంలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



శ్రీకాకుళం కల్చరల్: సంతోషిమాతకు పూజలు



జి సిగడాం మండలకేంద్రంలో పూజలు చేస్తున్న భక్తులు

శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. దుర్గామాత విగ్రహాలను ఉత్సవ కమిటీలు మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి మండపాల్లో కొలువు తీర్చారు. దేవీ పీఠాలు, ఆలయాల్లో అమ్మవారికి క్షీరాభిషేకాలు, విశేషపూజలు, పీఠార్చనలు, కుంకుమపూజలు, దుర్గాభవానీ దీక్షలు, భజన కార్యక్రమాలు జరిగాయి. మహిళలు అమ్మవారికి కుంకుమ పూజలు, అర్చనలు చేశారు. మండపాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. మండపాల వద్ద ఉత్సవ కమిటీ సభ్యులు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.



రణస్థలం: పైడిభీమవరంలో దుర్గాదేవిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ తదితరులు



లావేరు గ్రామంలో ఏర్పాటు చేసిన భారీ దుర్గాదేవి విగ్రహం వద్ద భక్తుల పూజలు



గార: అంపోలులో కలశాలతో మహిళల శోభాయాత్ర



ఎచ్చెర్ల క్యాంపస్: దేవీ పీఠంలో కుంకుమార్చన పూజలు



శ్రీకాకుళం రూరల్: పెదపాడులో పూజలు చేస్తున్న మృత్యేంజయస్వామి యువజన సేవాసంఘం సభ్యులు



శ్రీకాకుళం కల్చరల్: హౌసింగ్ బోర్డు కాలనీలోని షిర్డీ సాయి మందిరంలో కొలువైన శ్రీచక్ర సహిత దుర్గాదేవి



శ్రీకాకుళం కల్చరల్: జెడ్పీ వెనుక ఉన్న హౌసింగ్ బోర్డు కాలనీలో దుర్గాదేవి విగ్రహం ఊరేగింపు

ఆర్టీసీ ఒకటో డిపో నూతన కార్యవర్గం



సమావేశంలో మాట్లాడుతున్న దామోదరరావు

శ్రీకాకుళం అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఉద్యోగులకు దసరా కానుకగా కొత్త జీతాలు వస్తాయన్న ఆశతో ఆర్టీసీలోని 52 వేల మంది ఉద్యోగులు ఎదురుచూస్తున్నారని ఈయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదరరావు అన్నారు. స్థానిక ఈయూ కార్యాలయంలో సోమవారం శ్రీకాకుళం ఒకటో డిపో నూతన కమిటీ ఎన్నిక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగులకు 11వ పీఆర్‌సీ జీతాలు అమలు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చినప్పటికీ ఆర్థిక శాఖ నుంచి వచ్చిన అభ్యంతరాల మేరకు కొత్త జీతాలు అమలులో గత నాలుగు నెలలుగా జాప్యం జరిగిందన్నారు. అనంతరం నూతన కమిటీ ఎన్నిక జరిగింది. అధ్యక్షుడుగా జి.బి.మూర్తి, కార్యదర్శిగా ఎస్.వి.రమణ, గౌరవాధ్యక్షుడుగా ఆర్.జి.రావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కె.గోవిందరావు, డిప్యూటీ కార్యదర్శులుగా తమ్మినేని వెంకట్రావు, వై.కె.కుమార్, కోశాధికారిగా జి.వి.రమణమ్మతో పాటు మరో 18 మంది సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు జి.త్రినాథ్, కార్యదర్శి దశరధుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ పి.నానాజీ, గౌరవాధ్యక్షుడు ఎస్ఎస్ఆర్ వర్మ, ముఖ్య సలహాదారు కొర్లాం గణేశ్వరరావు పాల్గొన్నారు.

సాక్షి ఫ్యామిలీ
శ్రీకాకుళం
మంగళవారం ॥ 27-9-2022

నేడు వరల్డ్ టూరిజం డే

**కోయంబత్తూరులో కోడి పలావు
అమృత్‌సర్‌లో కుల్చా
లక్నోలో కబాబులు.. ఉడిపిలో ఇడ్లీ...
కొత్త ప్రాంతాలు చూస్తూ
అక్కడ దొరికే తిండిని రుచి చూస్తూ
జీవితం గడిచిపోతుంటే ఎలా ఉంటుంది?
సౌమ్య జీవితంలానే ఉంటుంది.
ఐటిలో పని చేసే సౌమ్య ఇప్పుడు
ఉద్యోగం మానేసి
ఫుల్‌టైమ్ ట్రావెల్ రైటర్ అయ్యింది.
భర్త విషుతో కలిసి 'రోడ్ టు టేస్ట్' అనే
వ్లోగ్‌ని నడుపుతుంది ఆమె.
నెలలో ఒక్క కొత్త ప్రాంతాన్నైనా
రోడ్డు మార్గంలో చూసి
అక్కడి తిండి తినాలన్నది సౌమ్య లక్ష్యం.
ఇవాళ 'వరల్డ్ టూరిజం డే'.
లోకం చాలా విశాలమైనది.
రుచులు లెక్కలేనివి.
తిరుగుతూ తినే అనుభూతి
ఈ సెలవుల్లో ట్రై చేయండి.**





భర్త విషుతో సౌమ్య

తిరుగు... తిను... ఉన్నది ఒకటే జిందగీ

ఊరికే శాంపిల్‌కి సౌమ్య తన భర్త విషుతో వేసిన ఒక ట్రిప్‌ను తెలుసుకుందాం. దాని పేరు 'దక్షిణ భారత దేశంలో మంచి బిర్యానీని కనుగొనుట'. అంతే. కారు వేసుకుని భార్యాభర్తలు ఇద్దరూ బయలుదేరారు. ముందు హైదరాబాద్ చేరుకున్నారు. అక్కడి 'షాబాద్'లో బిర్యానీ టేస్ట్ చూశారు. 'షా గౌస్'నూ వదల్లేదు. అక్కణ్ణుంచి బెంగళూరు బయలుదేరి వెళ్లారు. అక్కడి అలీ బాబా కేఫ్‌లో ఫేమస్ 'భత్కలీ బిర్యానీ' తిన్నారు. ఆ తర్వాత అక్కడే 'చిచాబాస్ తాజ్' అనే రెస్టరెంట్‌లో దొరికే బిర్యానీ తిన్నారు. కీమా బిర్యానీ టేస్ట్ చూశారు. నాగార్జున రెస్టరెంట్‌లో దొరికే 'తర్కారీ బిర్యానీ' (వెజ్ బిర్యానీ) లాగించారు. అక్కడి నుంచి చెన్నై బయలుదేరి దారిలో 'అంబూర్'లో ఆగి అంబూర్ బిర్యానీ తిన్నారు. ఆ తర్వాత చెన్నైలో మెరినా బీచ్‌లో సేద తీరి చెన్నైలో దొరికే 'షాదీ బిర్యానీ' తిన్నారు. చెన్నైలోని ఫేమస్ 'చార్మినార్ బిర్యానీ సెంటర్' అనే చిన్న షాపులోని బిర్యానీ వంకాయ కూరతో తిన్నారు. కల్యాణ్ భవన్‌లో దొరికే బిర్యానీ వంతు తర్వాత. అక్కడి నుంచి కోయంబత్తూరు బయలుదేరి మధ్యలో మహాబలిపురంలో ఒక బిర్యానీ టేస్ట్ చూశారు. ఆ తర్వాత కోయంబత్తూరులో దిండిగుల్ మటన్ బిర్యానీకి లొట్టలు వేశారు. చివరకు ఈ ప్రయాణం కేరళలోని కాలికట్‌లో దొరికే మలబార్ బిర్యానీతో ముగిసింది.

ఇంట్లో నాలుగ్గోడల మధ్య కూచుని ఉంటే ఇన్ని ఊళ్ల మీదుగా ఇన్ని బిర్యానీలు తినే వీలు ఉండేదా? అసలు లోకం తెలిసేదా? ఇన్ని రుచులతో ఇన్ని స్థలాలు ఉన్నాయని ఇందరు మనుషులు వీటిని సిద్ధం చేస్తున్నారని ఎలా తెలియాలి? ప్రయాణాలు చేయాలి. సౌమ్య తన భర్త విషుతో కలిసి చేసే పని అదే. అందుకే ఆమె తన వ్లోగ్‌కు 'రోడ్ టు టేస్ట్' అని పెట్టింది.

2015లో పెళ్లి- ప్రయాణం

సౌమ్య, విషులు తమ సొంత ఊళ్లు చెప్పుకోవడానికి ఇష్టపడరు. ప్రపంచమే వారి ఊరు. మొత్తం మీద ఇద్దరూ టీనేజ్ వయసు నుంచి సోలో ట్రావెలర్లుగా ఉన్నారు. కాని విషు పని చేసే ఐ.టి కంపెనీలోనే సౌమ్య కూడా చేరడంతో కథ ఒక దారిన పడింది. 'మన టేస్ట్ ఒకటే' అని ఇద్దరూ గ్రహించారు. 2015లో పెళ్లి చేసుకున్నారు. 'జీవితం అంటే తిరగడమే' అనేది వీరి పెళ్లికి ట్యాగ్‌లైన్. 2016లో 'రోడ్ టు టేస్ట్' వ్లోగ్ మొదలెట్టారు. ఇన్‌స్టాలో కూడా తమ అనుభవాలు, ఫోటోలు పెడతారు. సోషల్ మీడియాలో ఈ జంట చాలా పాపులర్ అయ్యింది. రోడ్డు మార్గం గుండా తిరుగుతూ కొత్త ప్రాంతాల విశేషాలతో పాటు అక్కడి ఆహారం గురించి తెలియ చేస్తారు. కంటికి, కడుపుకి వీరిచ్చే విందు అందరికీ నచ్చింది. ఇప్పటికి వీరు కలిసి 30 దేశాల్లో 100 నగరాలు చూశారు. ఇన్ని మనం చూడకపోయినా మన దేశంలోనే 30 టూరిస్ట్ ప్లేస్‌లు చూడగలిగితే చాలు.





వివిధ రకాల వంటలతో సౌమ్య

డబ్బులూ వస్తాయి

ఒక రంగంలో మనం ఫేమస్ అయితే డబ్బులూ వస్తాయి. సౌమ్య కూడా డబ్బు సంపాదిస్తోంది. అనేక ప్రాడక్ట్‌లను ప్రమోట్ చేయమని కంపెనీలు డబ్బులిస్తాయి. ఉదాహరణకు 'మిల్టన్' వారు ఒక ట్రిప్‌కు స్పాన్సర్ చేస్తారు. ఆ విశేషాలు రాసేప్పుడు సౌమ్య మిల్టన్ ఉత్పత్తి ఏదైనా తన ప్రయాణంలో ఉన్నట్టు చూపుతుంది. ఒక సినిమాను ప్రమోట్ చేయాలంటే పోస్టర్ ఇచ్చి హిమాలయ బేస్ క్యాంప్‌కు వెళ్లమంటే వెళ్లి అక్కడ దానిని చూపుతూ ఫొటో దిగుతారు. ప్లస్ ప్రయాణ వివరాలు రాస్తారు. అంటే ఉభయతారకం అన్నమాట.

భ్రమణ కాంక్ష

స్త్రీలైనా పురుషులైనా తిరగాలి. సౌమ్య, విషులకు ఉండే ఆర్థిక శక్తి, ఇంగ్లిష్ ప్రావీణ్యం మనకు లేకపోవచ్చు. కాని పొదుపుగా తక్కువ ఖర్చులో చేసే విహారాలు కూడా ఉంటాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నవారు ఆ రాష్ట్రంలోని ముఖ్య ప్రదేశాలు, తెలంగాణలో ఉన్నవారు ఆ రాష్ట్రంలోని ముఖ్య ప్రదేశాలు కనీసం చూసి ఉండాలి. ఆ తర్వాత సౌత్‌లోని ఒక్కో రాష్ట్రం చూడాలి. తర్వాత నార్త్. తర్వాత ఈశాన్యం. తిరుగుతూ ఉంటే ఈ లోకం ఇంత పెద్దది... చిన్న మనసుతో బతక్కూడదు అనిపిస్తుంది. అది చాలదూ?

● ఎంపవర్‌మెంట్

డైనమిక్ సిస్టర్స్

అవసరం నుంచే కాదు... ఆపద నుంచి కూడా ఆవిష్కరణలు పుడతాయి. 'ఇండియా–హెంప్ అండ్ కంపెనీ' ఉత్పత్తులు ఈ కోవకే చెందుతాయి. భరించలేని వెన్నునొప్పితో బాధ పడిన షాలిని తన పరిశోధనలో భాగంగా తెలుసుకున్న విషయం... హెంప్ మొక్కకు వెన్నునొప్పిని తగ్గించే శక్తి ఉంది అని. అది ప్రయోగాత్మకంగా నిరూపణ కావడంతో హెంప్ ఉత్పత్తుల విలువను ప్రపంచానికి పరిచయం చేయడానికి సోదరి జయంతి భట్టాచార్యతో కలిసి 'ఇండియా హెంప్ అండ్ కంపెనీ'కి శ్రీకారం చుట్టి విజయపథంలో దూసుకుపోతోంది.

షాలిని భట్టాచార్య నిలకడగా ఒకచోట ఉండే రకం కాదు. స్పెయిన్‌లో ఉంటున్న శాలినికి ఇంట్లో ఉండడం కంటే బయట ఉండడం అంటేనే ఎక్కువ ఇష్టం. అలాంటి షాలినికి కష్టం వచ్చిపడింది.

భరించలేని వెన్నునొప్పి! బయట అడుగు వేయలేని పరిస్థితి. చిన్న బ్యాగ్‌ను ఇటు నుంచి అటు పెట్టాలన్నా వీలయ్యేది కాదు. హాస్పిటల్స్ చుట్టూ తిరగడం మొదలైంది. ఏదో కాస్త తాత్కాలిక ఉపశమనం తప్ప శాశ్వత పరిష్కారం దొరకలేదు. ఈ నేపథ్యంలో బెంగళూరులో ఉంటున్న సోదరి జయంతితో కలిసి తన సమస్యకు పరిష్కారాన్ని వెదకడానికి పరిశోధన మొదలు పెట్టింది. ఈ పరిశోధన క్రమంలో వారికి ఎప్పుడో విన్న హెంప్ (ఒక రకమైన కనబిస్ మొక్క) గుర్తుకు వచ్చింది.

వేసవి సెలవులు వస్తే చాలు...కొండకోనల్లో తిరగడం తమ అలవాటు. అలా వెళ్లినప్పుడు అక్కడి మొక్కల గురించి స్థానికుల నుంచి ఆసక్తికరమైన వివరాలు తెలుసుకునేవారు. ఒకసారి హిమాలయాలో విస్తారంగా పెరిగే, విస్తృత ఔషధ గుణాలు ఉన్న హెంప్ గురించి విని ఉన్నారు.

ఆ జ్ఞాపకంతో హెంప్ గురించి లోతైన పరిశోధన ప్రారంభించారు. వెన్నునొప్పిని తగ్గించే సామర్థ్యం ఈ మొక్కకు ఉన్నట్లు ప్రయోగాత్మకంగా తెలుసుకున్నారు.

ఆ సమయంలోనే వారికి ఒక ఆలోచన వచ్చింది... అజ్ఞాతంగా ఉన్న హెంప్‌ను ప్రజల్లోకి తీసుకువెళ్లి దాని ఔషధశక్తి ఏమిటో తెలియజేయాలని. ఇందుకు వారు ఎంచుకున్న మార్గం ఇండియా హెంప్ అండ్ కంపెనీ. బెంగళూరు కేంద్రంగా మొదలైన ఈ కంపెనీ హెంప్ ట్రేల్ మిక్స్, హెంప్ హార్ట్, ప్రొటీన్ పౌడర్, హెంప్ ఆయిల్... మొదలైన న్యూట్రీషన్–ప్యాక్‌డ్ హెంప్ ప్రాడక్ట్స్‌ను తీసుకువచ్చింది.

'షార్క్ ఇండియా రియల్టీ షో' నుంచి ఆహ్వానం అందడాన్ని ఔత్సాహిక వ్యాపారవేత్తలు గొప్పగా భావిస్తారు. తమ ఉత్పత్తులను ప్రచారం చేసుకోవడానికి ఒక విశాలవేదికగా షార్క్ ఇండియా ఉపయోగపడుతుంది. ముఖ్యంగా ఫండింగ్ విషయంలో మేలు జరుగుతుంది. 'ఇండియా హెంప్ అండ్ కంపెనీ' కో–ఫౌండర్‌గా జయంతి భట్టాచార్యకు షార్క్ ఇండియా నుంచి ఆహ్వానం లభించింది. అడ్వర్‌టైజింగ్ అండ్ మార్కెటింగ్‌లో మాస్టర్స్ డిగ్రీ ఉన్న జయంతికి తమ ఉత్పత్తుల గురించి ఎలా ప్రచారం చేసుకోవాలో అనేది తెలియని విషయమేమీ కాదు. ఆమె ప్రసంగం ఎందరినో ఆకట్టుకుంది. రకరకాల దేశాల నుంచి ఇన్వెస్టర్‌లు ముందుకు వచ్చారు. అయితే సరియైన డీల్ కుదరకపోవడంతో వాటిని ఆమోదించలేదు. ఫండింగ్ మాట ఎలా ఉన్నా 'షో'కు వచ్చిన ప్రముఖుల సూచనలతో బ్రాండింగ్ స్ట్రాటజీని మార్చుకున్నారు.

ఆ తరువాత సరియైన ఇన్వెస్టర్లు వచ్చారు. కంపెనీ విజయపథంలో దూసుకెళుతుంది. నిజానికి హెంప్ ఉత్పత్తులను మార్కెట్‌లో సక్సెస్ చేయడం అంత ఆషామాషీ విషయమేమీ కాదు. మన దేశంలో తొలిసారిగా ఉత్తరాఖండ్ ప్రభుత్వం హెంప్ సాగు చేయడానికి అనుమతి ఇచ్చింది. అయినప్పటికీ ఎక్కడో ఒక చోట అనుమానం మిగిలే ఉంది. దీన్ని తీసివేయడానికి ప్రచార రూపంలో గట్టి ప్రయత్నాలు ప్రారంభించి విజయం సాధించారు ఈ డైనమిక్ సిస్టర్స్. 'ప్లానెట్ ఫ్రెండ్లీ ప్లాంట్ అయిన హెంప్‌పై మాకు ఉన్న నమ్మకం వృథాపోలేదు. మా వ్యాపారం విజయవంతమైంది అనే దానికంటే, ఇండియా హెంప్ అండ్ కంపెనీ ద్వారా హెంప్‌లోని ఔషధ గుణాల గురించి చాలామంది తెలుసుకోగలుగుతున్నందుకు ఆనందంగా ఉంది' అంటుంది షాలిని.


జయంతి – షాలిని

సాగుబడి
హస్త కార్తె : సెప్టెంబర్ 27 నుంచి

ప్రకృతి మెచ్చిన ఎఫ్.పి.ఓ.లు!

- ప్రకృతి సేద్య ఉత్పత్తుల మార్కెటింగ్ రంగంలో విశేష కృషికి జాతీయ గుర్తింపు
- ఏపీకి చెందిన రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు 'జైవిక్ ఇండియా' పురస్కారాలు


● మాభూమి ఎఫ్.పి.ఓ.లో విత్తనాల ప్రాసెసింగ్ యంత్రం


● కాఫీ పండ్లను గ్రేడ్ చేస్తున్న రైతులు

రైతుల్లో 90% చిన్న, సన్నకారు రైతులే. పెరుగుతున్న సాగు ఖర్చులు, తగ్గుతున్న దిగుబడులు, దళారుల దగాలు, ప్రకృతి వైపరీత్యాలు.. ఇవీ ఈ బడుగు రైతుల సమస్యలు. ఈ సమస్యలను తట్టుకొని రైతులు నిలబడాలంటే.. ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లటంతో పాటు తమ ఉత్పత్తులకు విలువను జోడించి, గిట్టుబాటు ధరలకు అమ్ముకోగలగటం ముఖ్యం. బడుగు రైతులను ఈ దిశగా సమైక్యంగా నడిపించడంలో 'రైతు ఉత్పత్తిదారుల సంఘాలు కీలకపాత్ర పోషిస్తున్నాయి. ఏపీ రైతులకు చెందిన అటువంటి రెండు ఎఫ్.పి.ఓ.లు 2022–23కు సంబంధించి జాతీయ స్థాయి 'జైవిక్ ఇండియా' అవార్డుల్ని గెలుచుకోవటం విశేషం. ఈ నెల 23న ఆగ్రాలో అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. పాడేరు, పార్వతీపురం ప్రాంత రైతులకు విశేష సేవలందిస్తున్న ఈ రెండు ఎఫ్.పి.ఓ.ల విజయగాథలు రైతు లోకానికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయి.

'మా భూమి' స్వయం సమృద్ధి ప్రస్థానం

పార్వతీపురం మన్యం జిల్లాలో ప్రకృతి వ్యవసాయదారుల ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు కల్పించడం, నాణ్యమైన విత్తనాలను అందించడంలో తనదైన వ్యూహంతో ముందుకెళ్తోంది 'మా భూమి' ఎఫ్.పి.ఓ.!

2012–13లో గరుగుబిల్లి మండలం తోటపల్లి గ్రామంలో పది మంది రైతులు కలిసి 'శ్రీ వెంకటేశ్వర రైతు క్లబ్'ను ఏర్పాటు చేసుకున్నారు. డి.పారినాయుడు నేతృత్వంలోని జట్టు ట్రస్టుతో పాటు నాబార్డు సహకారం తీసుకున్నారు. రూ.5 లక్షల యంత్ర సామాగ్రిని 90 శాతం రాయితీపై సమకూర్చుకొని విత్తన శుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. తర్వాత గరుగుబిల్లి మండలంలోని రైతు క్లబ్‌లన్నింటినీ ఏకం చేసి.. మా భూమి రైతు ఉత్పత్తిదారుల సంఘాన్ని (ఎఫ్.పి.ఓ.ను) కంపెనీ చట్టం కింద రిజిస్ట్రేషన్ చేయించారు. 4 మండలాలకు చెందిన 573 మంది రైతులు ఈ ఎఫ్.పి.ఓ.లో సభ్యులుగా, 15 మంది డైరెక్టర్లుగా వున్నారు.

ఆరేళ్ల క్రితం నుంచి ఎఫ్.పి.ఓ. ప్రకృతి వ్యవసాయ విధానం వైపు రైతులను ప్రోత్సహిస్తోంది. ఘన జీవామృతం, ద్రవ జీవామృతం, వేపపిండి, కషాయాలను తయారు చేసి రైతులకు విక్రయిస్తోంది. వీటి రవాణాకు ఎస్‌బీఐ సీఎస్ఆర్ నిధులతో రూ.7 లక్షల వ్యాన్ సమకూరింది. నూనె గానుగను రైతుసాధికార సంస్థ తోడ్పాటుతో ఏర్పాటు చేశారు. వివిధ సంస్థల నుంచి దఫదఫాలుగా రూ. 70 లక్షల రుణాలు తీసుకొని వ్యాపారాభివృద్ధికి ఉపయోగించారు. 2016–17లో రూ.18 లక్షల వ్యాపారం ద్వారా రూ. 80 వేల నికర లాభం గడించిన ఎఫ్.పి.ఓ... 2020–21 నాటికి రూ.70.02 లక్షల వార్షిక టర్నోవర్‌తో రూ.46 వేల నికరాదాయం ఆర్జించటం విశేషం.

– **అల్లు సూరిబాబు**, సాక్షి ప్రతినిధి, విజయనగరం



దళారులు లేకుండా నేరుగా వ్యాపారం

మాభూమి విత్తన కంపెనీ ద్వారా నాణ్యమైన విత్తనాలను రైతులకు విక్రయిస్తున్నాం. ఆరోగ్యానికి మేలు చేసే వరి దేశీయ రకాలైన నవారా, కాలాభట్, రత్నచోడి, ఢిల్లీ బాస్మతి, చిట్టి ముత్యాలు, సుగంధ సాంబ విత్తనాలను రైతులకు అందిస్తున్నాం. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు విలువను జోడించటం, దళారుల్లేకుండా నేరుగా వ్యాపారం నిర్వహించడం వంటి పనులు చేస్తున్నాం.

– **తాడేన మన్మథనాయుడు** (63649 93344), మాభూమి ఎఫ్‌పీవో కమిటీ సభ్యుడు, లక్ష్మీపురం, జియ్యమ్మవలస మండలం



ఆర్గానిక్ సర్టిఫికేషన్ కోసం కృషి

మాభూమి ఎఫ్‌పీవో ఉత్పత్తులకు ఆర్గానిక్ సర్టిఫికేషన్ కోసం హైదరాబాద్‌లోని స్కంద ఆర్గానిక్–42 కంపెనీతో ఒప్పందం కుదుర్చుకున్నాం. ఈ కంపెనీ సిబ్బంది క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి సర్టిఫికేట్‌ను మంజూరు చేస్తారు. ఇంటర్నేషనల్ కంట్రోల్ సిస్టమ్(ఐసీఎస్) సర్టిఫికెట్ ఉంటే రైతులు పండించిన ఉత్పత్తులను లాభాలున్న చోట ఎక్కడైనా విక్రయించుకొనేందుకు అవకాశం ఉంటుంది.

– **ఎం. నూకం నాయుడు** (94400 94384), సీఈవో, మాభూమి ఎఫ్‌పీవో, తోటపల్లి

గిరిజన రైతులకు ఎఫ్‌పివో దన్ను!

– కాఫీ, మిరియాలు, పసుపు కొనుగోళ్లతో రైతులకు మంచి ఆదాయం

అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగుల మండలంలోని ఎం. నిట్టాపుట్టు గ్రామం కేంద్రంగా రైతు ఉత్పత్తిదారుల సంస్థ (ఎఫ్‌పివో) 2018లో ఏర్పాటైంది. 549 మంది రైతులు షేర్ హోల్డర్లుగా ఉన్నారు. 11 పంచాయతీలకు చెందిన 75 గ్రామాల్లోని 3,685 మంది గిరిజన రైతుల ద్వారా 9,575 ఎకరాల్లో ఈ ఎఫ్.పి.ఓ. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తోంది. దిగుబడులకు గిట్టుబాటు ధర కల్పనే లక్ష్యంగా గిరిజన రైతులకు అండగా నిలుస్తోంది. గత మూడేళ్లుగా కాఫీ పండ్లు, పాచ్‌మెంట్, మిరియాలు, పసుపు ఉత్పత్తులను గిట్టుబాటు ధరకు కొనుగోలు చేస్తోంది. బ్యాంకుల సహకారంతో నిట్టాపుట్టు ఎఫ్‌పివో వ్యాపారంలో రాణిస్తూ జాతీయ స్థాయిలో ఉత్తమ ఎఫ్‌పివోగా గుర్తింపు పొందింది.

కాఫీ, మిరియాలు, పసుపు తదితర ఉత్పత్తుల వ్యాపారం ద్వారా 2019–20లో రూ.29.9 లక్షలు, 2020–21లో రూ.1.91 కోట్ల టర్నోవర్ సాధించింది. కాఫీ పండ్లను కిలో రూ.50కు, మిరియాలను రూ.400–430కి, పసుపును రూ.65–80కు ఎఫ్.పి.ఓ. కొనుగోలు చేసి రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తోంది. సీజన్‌లో రోజుకు 35–45 మంది గిరిజనులకు పని కల్పిస్తూ రూ.350ల రోజు కూలీ చెల్లిస్తున్నారు. గిరిజన రైతులు రసాయనాలు వాడకుండా పండించే ఉత్పత్తులకు ఆర్గానిక్ సర్టిఫికెట్లు సాధించి గిట్టుబాటు ధర రాబట్టడంలో ఎం.నిట్టాపుట్టు ఎఫ్‌టీవో మంచి పేరు తెచ్చుకుంది.

– **ఎస్.ఎం. కొండబాబు**, సాక్షి, పాడేరు, అల్లూరి సీతారామరాజు జిల్లా



తూకాలు, ధరల్లో మోసాలకు స్వస్తి

దళారుల తూకాలు, ధరల్లో మోసాలకు స్వస్తి చెప్పి తోటి గిరిజనులకు మేలు చేయాలనే లక్ష్యంతో ఎఫ్‌పీవోను ప్రారంభించాం. కాఫీ, మిరియాలు, పసుపు మార్కెటింగ్ బాధ్యతలు చేపట్టి రైతులకు మంచి లాభాలు అందిస్తున్నాం. ఈ ఆర్థిక సంవత్సరంలో చిరుధాన్యాలను కూడా కొనుగోలు చేస్తాం. ప్రకృతి వ్యవసాయంపై అన్ని గ్రామాల్లోనూ విస్తృత ప్రచారం చేస్తున్నాం.

– **పరదాని విజయ** (63000 39552), ఛైర్‌పర్సన్, ఎం.నిట్టాపుట్టు ఎఫ్‌టీవో, జి.మాడుగుల మం., అల్లూరి సీతారామరాజు జిల్లా



రెండేళ్లుగా ఎఫ్‌పీవోకే అమ్ముతున్నా...

ఎఫ్‌పీవో ద్వారా రెండేళ్లుగా మంచి లాభాలు వస్తున్నాయి. ఈ ఏడాది కిలో రూ.50ల ధరతో 200 కిలోల కాఫీ పండ్లు, రూ.250ల ధరతో 500 కిలోల పాచ్‌మెంట్ కాఫీ గింజలను అమ్మాను. మిరియాలు కిలో రూ.460కి ఎఫ్‌పివో కొనుగోలు చేసింది.

– **పరదాని లక్ష్మయ్య**, నిట్టాపుట్టు గ్రామం, జి.మాడుగుల మం. ,ఏఎస్సార్ జిల్లా

లంపీ స్కిన్ డిసీజ్‌కు మూలికా వైద్యం

● కషాయం, పైపూత మందుతో నాలుగైదు రోజుల్లో పూర్తిగా నయం



దేశవ్యాప్తంగా పశువులకు లంపీ స్కిన్ డిసీజ్ (ఎల్.ఎస్.డి.) సోకుతూ రైతులను బెంబేలెత్తిస్తోంది. 15 రాష్ట్రాల్లో 20 లక్షల గోజాతి పశువులకు సోకింది. లక్ష పశువులు చనిపోయాయి. తగిన చికిత్స లభించని పక్షంలో 2–4 శాతం చనిపోయే ప్రమాదం ఉందంటున్నారు. పశువు చర్మంతో పాటు అంతర్గత అవయవాలకు సోకడం వల్ల ఉత్తరాది రాష్ట్రాల్లో ఎక్కువ పశువులు మృతి చెందుతున్నట్లు భావిస్తున్నారు. పశువుల నుంచి ఈ వైరస్ మనుషులకు సోకదని నిపుణులు చెబుతున్నారు. ఈ వ్యాధి క్యాప్రిపాక్స్ అనే వైరస్ కారణంగా సోకుతోంది. అపరిశుభ్ర వాతావరణం, కలుషిత దాణా/నీటి కారణంగా బలహీనంగా ఉన్న పశువులకు దోమలు, పిడుదులు, ఇతర కీటకాల ద్వారా ఈ వైరస్ సోకుతుంది. దూడలకు ఎక్కువగా సోకుతుంది. పశువు శరీరం పైన అనేక భాగాల్లో బొబ్బలు, కణుతుల మాదిరిగా రావటం దీని ప్రధాన లక్షణం. కుంకుడు గింజ నుంచి చిన్న నిమ్మకాయ అంతటి కణుతులు వస్తాయి. వైరస్ సోకిన 4–14 రోజుల్లో జ్వరం, దురదలు, ముక్కులు, కళ్ల నుంచి స్రావాలు కారటం కనిపిస్తాయి. కనుగుడ్లు ఎర్రబడటం, కాంతిని చూడలేకపోవటంతో పశువు నీరసిస్తుంది. తగిన చికిత్స అందకపోతే కణుతులు పగిలి పశువును బాధిస్తాయి. పాడి పశువులకు ఈ వైరస్ సోకితే పాల దిగుబడి తగ్గిపోతుంది.

సాధారణంగా పశువైద్యులు ఈ వ్యాధి సోకిన పశువులకు ఇంజక్షన్లు, యాంటిబయోటిక్స్‌తో చికిత్స చేస్తున్నారు.

అయితే, ఇంటి వైద్యంతోనే ఈ వైరస్ వ్యాధిని 4–5 రోజుల్లో సంపూర్ణంగా నయం చేయవచ్చని, మరణాల సంఖ్యను కూడా బాగా తగ్గించవచ్చని పశు వైద్య నిపుణులు డాక్టర్ మల్లంపల్లి సాయి బుచ్చారావు తెలిపారు. ఔషధ మొక్కల ఆకులతో చేసిన కషాయం, పైపూత లేపనంతో లంపీ స్కిన్ డిసీజ్‌ను పారదోలవచ్చని ఘంటాపథంగా చెబుతున్నారు.

కషాయం తయారు చేసే విధానం

100 గ్రాముల వేప ఆకులు, 100 గ్రాముల తులసి ఆకులు, 100 గ్రాముల పసుపు, 50 గ్రాముల మిరియాలను అర లీటరు (500 ఎం.ఎల్.) నీటిలో వేసి మరిగించాలి. రెండు పొంగులు వస్తే చాలు. ఇలా తయారు చేసిన 200 గ్రాముల కషాయాన్ని పశువుకు తాగించాలి. ఉదయం ఒకసారి, సాయంత్రం ఒకసారి 3 నుంచి 5 రోజులు తాగించాలి.

పైపూత మందు తయారు చేసే విధానం

కలబంద ఆకుల గుజ్జు, పసుపు, గోరింటాకులను కలిపి ముద్దగా నూరాలి. ఆ ముద్దను పశువు వంటికి లేపనంగా పట్టించాలి. శరీరం అంతా రాస్తే మంచిది. ఒకవేళ వీలుకాకపోతే కణుతులు తేలిన ప్రాంతాల్లో రాసినా పర్వాలేదు. ఈ లేపనం పూయక ముందు 2 శాతం (వంద లీటర్ల నీటికి 2 కిలోల ఉప్పు) ఉప్పు ద్రావణంతో పశువును శుభ్రంగా కడగాలి. ఖర్చు లేకుండా రైతులు ఈ చికిత్స ద్వారా ఈ వ్యాధి బారి నుంచి పశువులను కాపాడుకోవచ్చు.

ముందు జాగ్రత ఇలా..

వేపాకు, పటిక, పసుపు ద్రావణంతో వారానికోసారి పశువుల శరీరాలను, పరిసరాలను శుభ్రం చేసుకుంటూ ఉంటే లంపీ స్కిన్ డిసీజ్ సోకకుండా జాగ్రత్తపడొచ్చని డా. మల్లంపల్లి సాయిబుచ్చారావు అన్నారు. లీటరు నీటిలో 100 గ్రా. వేపాకులు, 50 గ్రా. పటిక కలిపి మరగబెట్టాలి. 2,3 పొంగులు వచ్చిన తర్వాత దించి, 50 గ్రా. పసుపు కలపాలి. చల్లబడనివ్వాలి. గోరువెచ్చగా ఉన్నప్పుడు ఈ లీటరు ద్రావణాన్ని 10 లీటర్ల నీటిలో కలిపి పశువుల శరీరాన్ని శుభ్రం చేయటానికి లేదా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడానికి వాడుకోవాలని డా.సాయి బుచ్చారావు (99122 92229) తెలిపారు.



– నిర్వహణ: పంతంగి రాంబాబు, సాగుబడి డెస్క్

2న బసంపల్లిలో రైతులకు శిక్షణ

శ్రీసత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి మండలం బసంపల్లి గ్రామంలో అక్టోబర్ 2 (ప్రతి నెలా మొదటి ఆదివారం)న ప్రకృతి వ్యవసాయ నిపుణుడు నాగరాజు రైతులకు శిక్షణ ఇస్తారు. ధర్మవరం–పుట్టపర్తి రోడ్డులోని తన వ్యవసాయ క్షేత్రంలో ఉ. 9 నుంచి సా. 4 వరకు శిక్షణ ఇస్తారు. ప్రవేశ రుసుం రూ. 200. వివరాలకు 91826 71819.

సేంద్రియ సేద్యంపై 3 రోజుల శిక్షణ

సేంద్రియ సాగు విధానం, అందుకు అవసరమైన కషాయాలు, ద్రావణాల తయారీ, పంట దిగుబడులకు విలువ జోడింపు తదితర అంశాలపై నాబార్డు సహకారంతో రైతు నేస్తం ఫౌండేషన్ అక్టోబర్ 8,9,10 (శని, ఆది, సోమవారాలు) తేదీల్లో గుంటూరు జిల్లా కొర్నెపాడులో రైతులకు శిక్షణ ఇవ్వనుంది. భోజనం, వసతి సదుపాయాలు కల్పిస్తారు. ముందుగా పేర్లు నమోదు చేయించుకోవాలి. 30 మందికే ప్రవేశం. వివరాలకు.. 97053 83666, 95538 25532.